



ESTD: 1999

www.voodayam.com

# వుదయం






ఆదిలాబాద్ | 22-06-2026 సోమవారం | సంపుటి : 13 | సంచిక : 232 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on

### అన్ని వసతులతో కూడిన

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయండి

ఢిల్లీ పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి రైల్వేమంత్రితో రైల్ భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 అనుమతులపై వారు చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలుకు ఐఆర్‌ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. రైల్వేమంత్రితో భేటీ ఏర్పాటు చేయించాలని కోరారు.

- కార్గో ఎంఆర్‌వో వసతులు కల్పించాలి
- హ్యాంగర్ ఏర్పాటుకు అత్యంత అనుకూలం
- దేవరకద్రలో డీఆర్‌డీవో ప్రాజెక్టు మంజూరు చేయండి
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం రేవంత్ రెడ్డి వినతి
- గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు భూములు
- బదలాయించినందుకు కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి


ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, జూన్ 22 (వుదయం బ్యూరో) :** భారత వాయు సేన ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించ ◌ినందుకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకర◌ిస్తామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు.

మిగతా 2లో

### మత్తు వదలండి..

# మైదానాలు చేరండి

- క్రీడలకు అత్యంత ప్రాధాన్యత నిస్తున్న ప్రభుత్వం
- ప్రతి యువకుడు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని
- క్రమశిక్షణతో ముందుకు సాగాలి : మంత్రి వాకిటి శ్రీహరి
- క్రీడలను యువత సీరియస్‌గా తీసుకోవాలి
- గ్రామ స్థాయి నుండి యువతలో ప్రతిభను వెలికితీయాలి

స్పోర్ట్స్ అసోసియేషన్లు మరింత చురుకుగా పనిచేసి గ్రామ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలి. క్రీడా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా త్వరితగతిన అనుమతులు ఇచ్చి పనులను వేగవంతం చేయాలి. లక్షలాది యువతకు క్రీడల ద్వారా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి వాకిటి



**మహబూబ్ నగర్, జూన్ 22 (వుదయం ప్రతినిధి) :** మత్తు వదలండి.. మైదానాలు చేరండి అని యువతకు పిలుపునిచ్చారు రాష్ట్ర క్రీడా, పశుసంవర్థక శాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి,మత్స్య,యువజన సర్వీసుల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి . మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం గ్రౌండ్ మైదానంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 12 కోట్ల 53 లక్షల రూపాయల వ్యయంతో పలు ఆధునిక క్రీడా సదుపాయాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ పాలమూరు బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ క్రీడాకారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు .అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్న 400 మీటర్ల 8 లైన్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ద్వారా జిల్లాలోని యువ క్రీడాకారులకు ఉన్నత స్థాయి శిక్షణ అందే అవకాశం కలుగుతుందని అన్నారు.క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా జీవన శైలిని మార్చే శక్తివంతమైన సాధనం అని ఆయన అన్నారు. ప్రతి యువకుడు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో ఇప్పటికే సుమారు 80 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు.

మిగతా 2లో


## తెలంగాణ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- రాజోలిబండ డైవర్షన్, తుంగభద్ర డ్యామ్‌పై చర్చ
- తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలి
- ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ ఆదేశం

**హైదరాబాద్, జూన్ 22 (ఎంఎస్) :** తెలంగాణ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.



రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఉత్తమ్ సూచించారు. కృష్ణా పరివాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చిచెప్పారు. రైతుల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.



# మీరు బెదిరిస్తారు.. మేం చర్యలు తీసుకుంటాం

### హర్మూజ్ మీ క్యాసినో కాదు



- ఇజ్రాయెల్ దాడులతో విరుచుకుపడటంతో మళ్లీ హర్మూజ్‌ను మూసివేస్తున్నాం
- ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ పార్లమెంట్‌లోని నేషనల్ సెక్యూరిటీ కమిటీ ఛైర్మన్ ఇబ్రహీం అజీజి తీవ్ర వ్యాఖ్యలు
- హర్మూజ్‌లో నెమ్మదించిన రాకపోకలు

**టెహ్రాన్, జూన్ 22 :** ఇజ్రాయెల్‌పై దాడులు చేయకుండా లెబనాన్‌లోని హెజ్‌బొల్లాను నిలువరించాలని, లేకపోతే ఇరాన్‌పై భీకరదాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీనిపై ఇరాన్ పార్లమెంట్‌లోని నేషనల్ సెక్యూరిటీ కమిటీ ఛైర్మన్ ఇబ్రహీం అజీజి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మీరు బెదిరిస్తారు. మేం చర్యలు తీసుకుంటాం. హర్మూజ్ జలసంధి మీ క్యాసినో కాదు. అలాగే, సముద్ర దొంగలుండే పెరడు కాదు. ఆ జలసంధిపై తీసుకునే నిర్ణయం ఏదైనా ఇరాన్ ప్రజలు, బలగాల చేతిలోనే ఉంది' అని ఇబ్రహీం 'ఎక్స్' వేదికగా విస్పష్టం చేశారు. ఒప్పందంలోని నిబంధనలను, అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేస్తూ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో విరుచుకుపడటంతో మళ్లీ హర్మూజ్‌ను మూసివేస్తున్నామని ఇరాన్ ప్రకటించింది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. 60రోజుల్లో ఇరాన్‌తో తుది ఒప్పందం కుదరకపోతే జలసంధి మార్గంలో టోల్ విధిస్తామని హెచ్చరించారు.

మిగతా 2లో

## దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ టూరిజం శాఖ

- ఫోర్ట్ రిస్టోరేషన్ చేసి చరిత్ర
- తెలిపేలా మ్యూజియం ఏర్పాటు
- నిర్లక్ష్యానికి గురైన టూరిజం శాఖను
- దేశంలో నంబర్ వన్‌గా గుర్తింపు
- ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి
- మంత్రి జూపల్లి కృష్ణారావు



**యాదాద్రి, జూన్ 22 (వుదయం ప్రతినిధి) :** చరిత్ర కలిగిన పురాతన భువనగిరి ఖిల్లాకు పూర్వవైభవం తీసుకొస్తామని టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం ఉదయం భువనగిరి ఖిల్లా పైకి రోప్ వే నిర్మించే స్థలాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫోర్ట్ రిస్టోరేషన్ చేసి చరిత్ర తెలిపేలా మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. గంటకు మూడు వందల మంది ప్రయాణికులు ఖిల్లా పైకి వెళ్లేలా రోప్ వే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట , భువనగిరి ఖిల్లా, కొలనుపాక సోమేశ్వర ఆలయం, స్వర్ణగిరిలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన టూరిజం శాఖను దేశంలో నంబర్ వన్‌గా గుర్తింపు తీసుకొస్తామని స్పష్టం చేశారు. పర్యాటక స్థలాలకు వెళ్తే ప్రజల ఆలోచనా విధానం మారుతుందని, అనేక మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్‌కు అవమానం



- వాన్స్ ఎదురుచూస్తుండగానే ఇరాన్ విదేశాంగమంత్రి వాకౌట్
- అమెరికా, ఇరాన్ చర్చల్లో పట్టించుకోని ఖతార్ ప్రధాని
- నివ్వెరపోయిన పాక్ నేతలు, ఖతార్ నుంచి వాన్స్‌కు అవమానం

**స్విట్జర్లాండ్, జూన్ 22 :** పశ్చిమాసియాలో శాశ్వత శాంతిస్థాపన ప్రయత్నాల్లో భాగంగా అమెరికా, ఇరాన్ ప్రతినిధులు ఆదివారం స్విట్జర్లాండ్‌లో భేటీ అయ్యారు. ఆ కీలక సమావేశంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ కు అవమానం జరిగినట్టుగా కొన్ని వీడియోలు వైరల్ అవుతున్నాయి. వాన్స్ ఎదురుచూస్తుండగానే ఇరాన్ విదేశాంగ మంత్రి వాకౌట్ చేయడం, ఖతార్ ప్రధాని పట్టించుకోకపోవడం వంటివి ఆ వీడియోల్లో కన్పించాయి. చర్చలు ప్రారంభం కావడానికి ముందు ఇరాన్ ప్రతినిధులతో కరచాలనం, ఫొటో సెషన్ నిర్వహించాలని యూఎస్ ప్రతినిధులు

మిగతా 2లో

## కీలక సంస్థల భద్రతలో సీఐఎస్ఎఫ్ కు పెను సవాళ్లు

- దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సంస్థలపై దాడే శత్రువుల ప్రధాన లక్ష్యం
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కండి
- ఆధునిక సాంకేతికతను సమకూర్చుకోండి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

2



### సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో

# వేగం పెంచాలి

- జిల్లాకో మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి అమలుకు యోచన
- ఏడాది కాలంలో 3.65 లక్షల పాస్‌బుక్‌ల జారీ
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, జూన్ 22 (ఎంఎస్) :** రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార , పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సోమవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 3 . 6 5 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు. గతంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు.

మిగతా 2లో



## బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

- లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం
- పదవిలో ఉన్నంత కాలం విలువలకు కట్టుబడి
- పనిచేశాను : రాజీనామా అనంతరం కీర్

**లండన్, జూన్ 22 :** బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత నెలకొంది. ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేశారు. లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం విలువలకు

మిగతా 2లో

# ఇంటింటికీ సంక్షేమం

- పదేళ్ల గత పాలకుల నిర్లక్ష్యానికి చెక్
- ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు అండ
- మహిళా సాధికారతకు కాంగ్రెస్ పెద్దపీట
- 30 నెలల్లో రూ. 67 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పకడ్బందీగా రీఇంబర్స్‌మెంట్ అమలు

**ఖమ్మం, జూన్ 22 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి ఇంటికీ చేరుతోందని, ఈ అద్భుత ప్రగతిని మహిళా కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా లోకానికి సమాన అవకాశాలు కల్పించడంతో పాటు, వారిని ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా ఇందిరమ్మ రాజ్యం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. గత పాలకుల పదేళ్ల నిరంకుశ పాలనలో పేద ప్రజలు ఇళ్ల కోసం ఎదురుచూసి అలసిపోయారని భట్టి విక్రమార్క విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు కట్టుకునేందుకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తోందని



గుర్తుచేశారు. "గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఘనత మా ప్రభుత్వానిదే. ఈ ఏడాది కూడా నియోజకవర్గానికి 2,000 చొప్పున ఇళ్లు కేటాయించాం.

మిగతా 2లో

# సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

మొదటి పేజీ తరువాయి

రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రిగారు సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రిగారు ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

# బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

మొదటి పేజీ తరువాయి

కట్టుబడి పని చేసినట్లు తెలిపారు. తాజా పరిణామంతో బ్రిటన్‌లో దశాబ్ద కాలంలో తమ పదవులకు రాజీనామా చేసిన ప్రధానుల సంఖ్య ఆరుకి చేరింది. కీర్ స్టార్మర్ 2024లో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ పేలవమైన ప్రదర్శన మాత్రమే ఇవ్వడం, మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో స్టార్మర్ నాయకత్వంపై ప్రశ్నలు వస్తున్నాయి. ఎప్‌స్టీన్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో యూకే రాయబారిగా నియమించాలనే స్టార్మర్ నిర్ణయంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను ప్రధాని పదవి నుంచి వైదొలగాలని సహచర మంత్రులతోపాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఒత్తిడి పెరిగింది. అయినప్పటికీ తాను పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని వాదిస్తూ వచ్చిన స్టార్మర్.. తాజాగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.మరోవైపు, బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వలసలు, ఇంధన విధానాల్లో వైఫల్యాలే అందుకు కారణమని తన పోస్టులో ఆయన పేర్కొన్నారు.

# మీరు బెదిరిస్తారు.. మేం చర్యలు తీసుకుంటాం

మొదటి పేజీ తరువాయి

పశ్చిమాసియా దేశాలకు యూఎస్ అందించిన రక్షణ సేవలకుగానూ ఆ డబ్బును తీసుకోనున్నట్లు వెల్లడించారు. హర్మూజ్‌లో నెమ్మదించిన రాకపోకలు.. ఈ హెచ్చరికలలో హర్మూజ్ లో నౌకల రాకపోకలు నెమ్మదించాయి. అంతకు ముందు రోజు 35 నౌకలు హర్మూజ్ దాటగా.. ఆదివారం కేవలం 12 మాత్రమే దాటినట్లు మారిటైమ్ ట్రాకింగ్ డేటా కంపెనీ విండ్‌వర్డ్ వెల్లడించింది. వాటిల్లో కొన్ని ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ వ్యవస్థను ఆపేసి ప్రయాణించినట్లు పేర్కొంది.

# పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వండి

## మేడ్చల్ కలెక్టర్ కు విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 21 (వుదయం ప్రతినిధి) :** జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించి వారందరికీ అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా జర్నలిస్టుల ప్రతినిధుల బృందం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా అర్బన్ జిల్లా కావడం వల్ల ప్రధాన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రతి మండలంలో ఇద్దరు కంటే ఎక్కువ మంది విలేకరులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అక్రిడిటేషన్ జీవో 252 మేరకు మండలానికి ఒకే అక్రిడిటేషన్ ఇచ్చే అవకాశం ఉండడంవల్ల ఇతరులు నష్టపోయే ప్రమాదం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన పత్రికల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా సంస్థల నుంచి ఇచ్చిన సిఫార్సు లేఖలలో పేర్లు కలిగి ఉండి జీవో మేరకు అర్హులు కాని వారిని గుర్తించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా జిల్లా జర్నలిస్టులందరికీ న్యాయం చేసిన వారు అవుతారని కలెక్టర్ ను కోరారు.

**సానుకూలంగా స్పందించిన కలెక్టర్**

జిల్లాలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల అంశంలో అన్యాయం జరగకుండా చూస్తామని కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. జర్నలిస్టుల బృందం చేసిన విజ్ఞప్తి మేరకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రవిచంద్ర, జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు రామారావు, రవీందర్, రామకృష్ణ, బాల్ రెడ్డి, సునీల్, శ్రీరాములు, రచ్చ శ్రీనివాస్, హనుమంత రెడ్డి, యూనియన్ జిల్లా నాయకులు భూపాల్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికీ సంక్షేమం

మొదటి పేజీ తరువాయి

ఇంకా ఎవరైనా అర్హులు ఉండి ఇళ్లు రాకుంటే మా దృష్టికి తీసుకురండి, వారికి తప్పకుండా మంజూరు చేస్తాం" అని హామీ ఇచ్చారు. పేద పిల్లల ఉన్నత చదువుల కోసం ఫీజు రీఇంబర్స్‌మెంట్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద వంద రోజుల పని కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. పేద కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వైద్యం కోసం ఇల్లు, భూమి, బంగారం అమ్ముకునే దుస్థితి రాకూడదనే ఉద్దేశంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఏకంగా రూ.10 లక్షలకు పెంచామని డిప్యూటీ సీఎం తెలిపారు. దీని ద్వారా పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా మెరుగైన వైద్యం అందుతోందన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని కొనియాడారు. ఐదేళ్లలో డ్వాక్రా మహిళలకు లక్ష కోట్ల రూపాయల రుణాలు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, కేవలం రెండున్నర ఏళ్లలోనే రూ.67,000 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని వెల్లడించారు. వడ్డీ లేని రుణ పరిమితిని సైతం రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే కాకుండా.. స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేయించి, మహిళలనే ఆ బస్సులకు యజమానులను చేసిన ఘనత మన ప్రజా ప్రభుత్వానికే దక్కుతుంది" అని గర్వంగా ప్రకటించారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు, మరియు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్వహణలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు. మిగతా పార్టీలలాగా కాంగ్రెస్ ఉపన్యాసాలకే పరిమితం కాదని, మహిళలకు రాజకీయంగా అత్యున్నత అవకాశాలు కల్పించిన చరిత్ర తమదేనని గుర్తుచేశారు. దేశానికి ఇందిరా గాంధీని ప్రధానిగా, సోనియా గాంధీని యూపీఏ చైర్‌పర్సన్‌గా, దేశ రాజధాని ఢిల్లీకి షీలా దీక్షిత్‌ను ముఖ్యమంత్రిగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని కొనియాడారు. సమాజంలో సగభాగమైన మహిళల అభ్యున్నతి కోసమే కాంగ్రెస్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మహిళా నాయకురాళ్లు నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. గత పదేళ్లుగా పార్టీ కోసం రోడ్లపైకి వచ్చి, ధర్నాలు, ఉద్యమాలు చేసిన ప్రతి ఒక్క మహిళా నాయకురాలికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కష్టపడిన వారి వివరాలు జిల్లాల వారీగా తమ వద్ద ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు అందరికీ సముచిత గౌరవం, పదవులు దక్కేలా చూసే బాధ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నేను (ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క) తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే, ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో మహిళలు చురుగ్గా పాల్గొని, అర్హుల ఓట్లు పోకుండా చూడాలని కోరారు. పార్టీ వ్యవస్థ మరింత బలోపేతం కావడానికి ప్రతి బూత్ లెవెల్ కమిటీలోనూ మహిళలకు కీలక ప్రాధాన్యత కల్పిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య, శాసనసభ్యులు రామదాస్ నాయక్, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం,, పువాళ్ళ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ కు అవమానం ప్లాన్ చేసినట్లు ఐఆర్‌జీసీ అనుబంధ వార్తాసంస్థ 'తస్నిమ్' పేర్కొంది. అయితే ఇజ్రాయెల్‌పై దాడులు చేయకుండా హెజ్‌బొల్లాను ఇరాన్ నిలువరించాలని.. లేదంటే ఆ దేశంపై మళ్లీ భీకర దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడాన్ని టెహ్రాన్ ప్రతినిధులు సీరియస్‌గా తీసుకున్నారు. అమెరికా ప్రతినిధులతో ఫొటో సెషన్‌కు నిరాకరించిన వారు.. ఆ తర్వాత అక్కడి నుంచి వాకౌట్ చేశారు. ఈ పరిణామాలతో చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ నేతలు నివ్వెరపోయారు. పరిస్థితి ఒకింత ఉద్రిక్తంగా మారడంతో కొంచెం దూరంలో ఉన్న జేడీ వాన్స్ వాటిని టెన్షన్‌తో గమనిస్తున్నట్లుగా వీడియోలో ఉంది. తర్వాత వాన్స్, పాక్ ప్రధాని షరీఫ్, ఆర్మీ చీఫ్ మునీర్ ఒక దగ్గరకు వచ్చి చర్చించుకోవడం అందులో కనిపించింది. మరో మధ్యవర్తిత్వ దేశం ఖతార్ నుంచి వాన్స్‌కు ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. పాక్ ప్రధాని షరీఫ్‌ను పలకరించిన ఖతార్ ప్రధాని.. పక్కనే ఉన్న వాన్స్‌ను మాత్రం విస్మరించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. 'ఇది దౌత్యపరమైన తిరస్కా రం' అని నెటిజన్లు అభిప్రాయాలు వ్యక్తం చేస్తు న్నారు. ఇలా ఉద్రిక్త వాతావరణంలో చర్చలు మొదలైనా.. శాంతిస్థాపన దిశగా ముందడుగు పడినట్లే కనిపిస్తోంది. టెహ్రాన్ అణు కార్యక్రమం, లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు సహా పలు అంశాలపై ఇరు దేశాల ప్రతినిధులు చర్చించారు.



# అన్ని వసతులతో కూడిన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయండి

మొదటి పేజీ తరువాయి

ఆదిలాబాద్‌లో భారతీయ వాయు సేన ఆధ్వర్యంలో రానున్న ఎయిర్‌పోర్ట్ దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున, దానిని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకరిస్తామని రక్షణశాఖ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయని, హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైనందున ఆ దిశగా అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తమ కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు డీఆర్‌డీవో/డీఆర్‌డీఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందున ఆ ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

# సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి

## టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



**హనుమకొండ, జూన్ 21 (వుదయం ప్రతినిధి) :** సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళ్తున్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్‌ఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# తెలంగాణ పోలీస్ అకాడమీలో ఎన్డీపీఎస్ పై ప్రత్యేక శిక్షణ

**హైదరాబాద్, జూన్ 21 (వుదయం ప్రతినిధి) :** మాదక ద్రవ్యాల నియంత్రణలో పోలీసు సామర్థ్యాల పెంపుకు ప్రత్యేక శిక్షణ మాదక ద్రవ్యాలు, మానసిక ప్రభావిత పదార్థాల చట్టం కింద నమోదయ్యే కేసుల దర్యాప్తులో పోలీసు అధికారుల నైపుణ్యాలు, చట్టపరమైన అవగాహన



మరియు దర్యాప్తు సామర్థ్యాలను మెరుగుపరచే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ అకాడమీలో 37వ బ్యాచ్ కేసుల దర్యాప్తు కోర్సు" జూన్ 22 ప్రారంభమైంది. ఈ కోర్సు ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 5,000 మందికి పైగా పోలీసు అధికారులు శిక్షణ పొందడం విశేషం. నాలుగు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం అకాడమీ డైరెక్టర్ శ్రీమతి అభిలాష బిస్త్, ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమంలో సిద్ధాంతపరమైన అవగాహనతో పాటు ప్రాయోగిక దర్యాప్తు నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతోంది. ఎన్డీపీఎస్ చట్టం, దర్యాప్తు విధానాలు, SOPలు, సన్నివేశ ఆధారిత ప్రాక్టికల్ వ్యాయామాలు, డిజిటల్ టూల్స్ వినియోగం మరియు తాజా న్యాయ తీర్పులపై శిక్షణ అందించనున్నారు.

# కీలక సంస్థల భద్రతలో సీఐఎస్ఎఫ్ కు పెను సవాళ్లు

**న్యూఢిల్లీ, జూన్ 22 (వుదయం బ్యూరో) :** ప్రస్తుతం ప్రపంచ రాజకీయాలు, భద్రతా పరిస్థితులు అత్యంత సంక్లిష్టంగా మారిన నేపథ్యంలో సీఐఎస్ఎఫ్ కు కొత్త భద్రతా సవాళ్లు ఎదురవుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆధునిక యుద్ధాలు కేవలం దేశ సరిహద్దులపైనే కాకుండా, ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే విద్యుత్ కేంద్రాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్ గ్రిడ్‌లు, వ్యూహాత్మక సంస్థలు శత్రువులకు ప్రధాన లక్ష్యాలుగా మారుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో దేశంలోని కీలక సంస్థల భద్రతా బాధ్యత మరింత పెరిగిందన్నారు. యుద్ధాల ముప్పులు కేవలం భౌతిక దాడులకే పరిమితం కావడం లేదని, సైబర్ దాడులు, డిజిటల్ విధ్వంసం, డ్రోన్ సాంకేతికత దుర్వినియోగం వంటి హైబ్రిడ్ ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సీఐఎస్ఎఫ్ నిరంతరం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ దిశగా మోదీ ప్రభుత్వం అవసరమైన అన్ని వనరులను సీఐఎస్ఎఫ్ అందించడానికి కట్టుబడి ఉందన్నారు. న్యూఢిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్ లో రూ.75.78 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం నూతన ప్రధాన కార్యాలయ భవనానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్, హోం మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కేంద్ర సాయుధ పోలీసు దళాల అధిపతులు, సీపీడబ్ల్యూడీ సీనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు. ఈ రోజు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం చరిత్రలో ఒక మైలురాయి. న్యూఢిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్‌లో సుమారు రూ.75.78 కోట్ల వ్యయంతో నిర్మించబడనున్న ఆధునిక, అన్ని సౌకర్యాలతో కూడిన 9 అంతస్తుల కొత్త సీఐఎస్ఎఫ్ కేంద్ర ప్రధాన కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేసే అవకాశం నాకు లభించింది. హైదరాబాద్‌లోని జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీ, తమిళనాడులో సుమారు రూ.60.25 కోట్ల వ్యయంతో నిర్మించిన నివాస సముదాయాలు, బ్యారక్ లు, ఆధునిక శిక్షణ సదుపాయాలను కూడా ప్రారంభించుకున్నాం. ప్రస్తుతం ప్రపంచ రాజకీయాలు, భద్రతా పరిస్థితులు అత్యంత సంక్లిష్టంగా మారాయి. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధాలు, భౌగోళిక రాజకీయ సంక్షోభాలు కొత్త భద్రతా సవాళ్లను మన ముందుంచుతున్నాయి. ఆధునిక యుద్ధాలు కేవలం దేశ సరిహద్దులపైనే కాకుండా, ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే గ్లోబల్ సప్లై చైన్లపైన, కీలక మౌలిక సదుపాయాలపైనా దాడులు జరుగుతున్నాయి. విద్యుత్ కేంద్రాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్ గ్రిడ్‌లు, వ్యూహాత్మక సంస్థలు శత్రువుల ప్రధాన లక్ష్యాలుగా మారుతున్నాయి ఈ నేపథ్యంలో దేశంలోని కీలక సంస్థల భద్రత బాధ్యత సీఐఎస్ఎఫ్ భుజాలపై ఉండటంతో తాజా పరిణామాలతో బాధ్యత మరింత పెరిగింది. ఇప్పుడు ముప్పులు కేవలం భౌతిక దాడులకే పరిమితం కావడం లేదు. సైబర్ దాడులు, డిజిటల్ విధ్వంసం, డ్రోన్ సాంకేతికత దుర్వినియోగం వంటి హైబ్రిడ్ ముప్పులు పెరుగుతున్నాయి. అందువల్ల సీఐఎస్ఎఫ్ నిరంతరం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ఈ దిశగా ప్రభుత్వం అవసరమైన అన్ని వనరులను అందించడానికి కట్టుబడి ఉంది. దేశ అవసరాలు మారుతున్న కొద్దీ సీఐఎస్ఎఫ్ బాధ్యతలు కూడా విస్తరిస్తున్నాయి. అంతర్గత భద్రత రంగంలోనూ సీఐఎస్ఎఫ్ కొత్త బాధ్యతలను చేపట్టింది. జమ్మూ కాశ్మీర్‌లోని అత్యంత సున్నితమైన జైళ్ల భద్రతను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించారు. మహన్‌పూర్, కథువాలోని అత్యంత భద్రతా జైలు సహా అనేక జైళ్లలో సీఐఎస్ఎఫ్ అభేద్య భద్రతా వలయాన్ని ఏర్పాటు చేస్తోంది. విమానాశ్రయాల నుంచి బొగ్గు గనుల వరకు, అత్యంత సున్నితమైన జైళ్ల వరకు సీఐఎస్ఎఫ్ భద్రతకు ప్రతీకగా నిలిచింది. జవాను తన విధిని పూర్తి ఏకాగ్రతతో నిర్వర్తించాలంటే అతనికి, అతని కుటుంబానికి మంచి సౌకర్యాలు అవసరం. సీహోర్‌లో 12వ రిజర్వ్ బెటాలియన్‌కు రూ.243.73 కోట్లు, నాసిక్‌లో 11వ రిజర్వ్ బెటాలియన్‌కు రూ.195.29 కోట్లు, అసోంలో 9వ రిజర్వ్ బెటాలియన్‌కు రూ.124.73 కోట్లతో మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బీహార్‌లోని కిషన్‌గంజ్‌లో కొత్త ప్రాంతీయ శిక్షణ కేంద్రం స్థాపనకు కూడా వేగం పెగింది. సీఐఎస్ఎఫ్‌లో మహిళల భాగస్వామ్యం అన్ని అర్ధసైనిక దళాల్లో అత్యంత ప్రశంసనీయమైనది. హర్యానాలోని నూహ్‌లో దేశంలోనే తొలి మహిళా రిజర్వ్ బెటాలియన్ స్థాపనకు భూమి సేకరణ మరియు నిధుల ఆమోదం లభించింది. ఇందులో 1,024 మంది మహిళా సిబ్బంది పనిచేస్తారు. సీఐఎస్ఎఫ్ తన శిక్షణ వ్యవస్థను మరింత ఆధునీకీకరించింది. భారత సైన్యం మరియు NSG సహకారంతో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ పేరిట 595 మంది సిబ్బందిని ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలకు ఎంపిక చేశారు. బెంగళూరులోని 10వ రిజర్వ్ బెటాలియన్‌ను మహిళా కమాండో శిక్షణ కేంద్రంగా అభివృద్ధి చేశారు. 100 గంటల శిక్షణ కార్యక్రమం: సీనియర్ అధికారులు స్వయంగా జూనియర్ అధికారులకు శిక్షణ అందిస్తున్నారు. సీఐఎస్ఎఫ్ ఆధునిక సాంకేతికతను ప్రధాన బలంగా మార్చుకుంటోంది. డ్రోన్ మరియు యాంటీ డ్రోన్ కేంద్రం: ఆర్టీసీ బెహ్రోర్‌ను డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేస్తున్నారు. ముఖ్యమైన సంస్థలను డ్రోన్ ముప్పుల నుంచి రక్షించడానికి సీఐఎస్ఎఫ్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోడల్ ఏజెన్సీగా ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం జవాన్ల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. విధి నిర్వహణలో గాయపడిన జవాన్లను సేవ నుంచి తొలగించడం లేదు. మానసిక ఆరోగ్యానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.సీఐఎస్ఎఫ్ కేవలం పరిశ్రమలు లేదా విమానాశ్రయాల భద్రతకే పరిమితం కాలేదు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రశాంత ఎన్నికల నిర్వహణ బాధ్యతతోపాటు అమర్‌నాథ్ యాత్ర, కుంభమేళా వంటి కార్యక్రమాల్లో భద్రతా బాధ్యతలను సైతం నిర్వహిస్తోంది. పార్లమెంట్ భవన భద్రతలో ఆధునిక వ్యవస్థలను ఏర్పాటు చేశాం. 3,300 మందికి పైగా సిబ్బంది పార్లమెంట్ భద్రతలో విధులు నిర్వహిస్తున్నారు. ఒక క్రమశిక్షణ కలిగిన సైనికుడు ప్రకృతికి కూడా రక్షకుడే. 2025లో సీఐఎస్ఎఫ్ 5.61 లక్షలకు పైగా మొక్కలు నాటడం అభినందనీయం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 60,000 మొక్కలు నాటే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం స్వాగతించదగ్గ పరిణామం. వర్షపు నీటి సంరక్షణ, వైట్ రూఫ్ కోటింగ్ వంటి పర్యావరణ అనుకూల పద్ధతుల అమలుతోపాటు జవాన్ మెస్‌లలో 30 శాతానికిపైకు పైగా చిరుధాన్యాల వినియోగిస్తుండటం అభినందనీయం. శాస్త్రీయ తేనెటీగల పెంపకం ద్వారా 1,026 కిలోలకుపైగా తేనె ఉత్పత్తి చేయడం సంతోషకరం. విమానాశ్రయాలు, ఢిల్లీ మెట్రోలో సీఐఎస్ఎఫ్ జవాన్ల మర్యాదపూర్వక ప్రవర్తన ప్రజల హృదయాలను గెలుచుకుంటోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాలు, గనులతోపాటు ముఖ్యమైన సంస్థల భద్రత సీఐఎస్ఎఫ్ చేతుల్లో సురక్షితంగా ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ "విజన్ 2047" దిశగా ముందుకు సాగుతోంది. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో సీఐఎస్ఎఫ్ "ఆర్థిక సైనికులు"గా కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో సీఐఎస్ఎఫ్ ఆధునికీకరణ, మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలకు మోదీ ప్రభుత్వం నిరంతర మద్దతు అందిస్తాం. సీఐఎస్ఎఫ్‌ను ప్రపంచంలోనే అత్యాధునిక భద్రతా దళంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన వనరులను సమకూరుస్తాం. ఈ రోజు శంకుస్థాపన చేసిన ఈ భవనాలు మీ భవిష్యత్తుకు బలమైన పునాది కాబోతున్నాయి.




# మీడియా అకాడమీలో ఎస్.ఐ.ఆర్‌పై అవగాహన సదస్సు

**హైదరాబాద్, జూన్ 21 (వుదయం ప్రతినిధి) :** ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై జర్నలిస్టులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సహకారంతో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం తరఫున బి. చెన్నయ్య, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డి. చిరంజీవి, ఐటీ మేనేజర్ పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై సమగ్ర వివరణ అందించారు.ఈ సందర్భంగా వారు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం ఉద్దేశ్యం, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణ, మార్పులు, తొలగింపులు, ఇంటింటి సర్వే తదితర అంశాలపై విపులంగా వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ఎస్.ఐ.ఆర్‌కు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితాల ప్రాధాన్యత ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు సరైన సమాచారం చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. జర్నలిస్టులు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన పెంపొందించుకుని ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమం జర్నలిస్టులకు ఎంతో ఉపయోగకరంగా, సమాచారపూర్వకంగా సాగింది. ఈ కార్యక్రమంలో నాగులపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి, తెలంగాణ మీడియా అకాడమీ, వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.



# మత్తు వదలండి.. మైదానాలు చేరండి

మొదటి పేజీ తరువాయి

క్రీడా రంగ అభివృద్ధి కోసం అవసరమైతే వంద కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. యువత టైమ్‌పాస్‌గా కాకుండా క్రీడలను సీరియస్‌గా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో స్విమ్మింగ్ పూల్ ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు మరింత చురుకుగా పనిచేసి గ్రామ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని సూచించారు. క్రీడా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా త్వరితగతిన అనుమతులు ఇచ్చి పనులను వేగవంతం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాసరెడ్డి, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షులు జితేందర్ రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి శ్రీమతి డి.జానకి, మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్,అధికారులు తదితరులు పాల్గొన్నారు

# గ్రేటర్ హైదరాబాద్





## ముస్లింల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం కలసి పనిచేద్దాం

హైదరాబాద్, జూన్ 22 (వు దయం ప్రతినిధి ):



జానోజాగోసంఘం నేత సయ్యద్ నిసార్ అహ్మద్ తో వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహీయుద్దీన్ఉభయ తెలుగు రాష్ట్రాల లోని ముస్లింల రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలపై కలసి పనిచేద్దామని జానో జాగో (ముస్లింల అభివృద్ధి సంస్థ) సంఘం జాతీయ అధ్యక్షులు సయ్యద్ నిసార్ అహ్మద్ ను కలసి వైసీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహీయుద్దీన్ కోరారు. జానో జాగో సంఘం నేత సయ్యద్ నిసార్ అహ్మద్ తో వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహీయుద్దీన్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. సయ్యద్ నిసార్ అహ్మద్ ను శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జానో జాగో సంఘం యువజన విభాగం జాతీయ కన్వీనర్ ముల్లా జాఫర్ హుస్సేన్ కూడా పాల్గొన్నారు. అనంతరం ఉభయ రాష్ట్రాలలోని ముస్లిం రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై వారి మధ్య చర్చ సాగింది. ముస్లింల రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు కాపాడే ఏ పార్టీకైనా, మత రాజకీయాలకు దూరంగా ఉండే ఏ పార్టీకైనా తమ జానో జాగో సంఘం మద్దతు ఉంటుందని సయ్యద్ నిసార్ అహ్మద్ పేర్కొన్నారు. తొలి నుంచి ముస్లింల ప్రయోజనాలను ఉభయ తెలుగు రాష్ట్రాలలో దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి కాపాడితే, ఇపుడు ఆ పనిని ఆయన తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారని సయ్యద్ గౌస్ మోహీయుద్దీన్ తెలిపారు.

## మక్తకుంట ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..

రామచంద్రాపురం, జూన్ 22(వుదయం)



తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని సందుగూడెం మక్తకుంట చెరువును ఆక్రమించేందుకు యత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం సాయంత్రం నీటిపారుదల శాఖ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి చెరువును ఆయన పరిశీలించారు. ఇటీవల కొందరు వ్యక్తులు శిఖం భూమి పేరుతో చెరువులో మట్టి నింపి ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు.గ్రామానికి అనుసంధానంగా ఉన్న చెరువు కట్ట రహదారిని ధ్వంసం చేయడం తీవ్ర అభ్యంతరకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దశాబ్దాలుగా గ్రామస్తులు ఇదే రహదారి ద్వారా అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. శిఖం పట్టా భూముల్లో వ్యవసాయం చేసుకోవచ్చని, అయితే మట్టి నింపి చెరువును ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.చెరువు కట్టను రెండు రోజుల్లో పునరుద్ధరించడంతో పాటు ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. చెరువుకు చెందిన ఒక్క గజం భూమి కూడా కబ్జా కావడానికి అవకాశం ఇవ్వబోమని ఎమ్మెల్యే తేల్చిచెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, ఏఈ జ్యోతి, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, కొమరయ్య, సీనియర్ నాయకులు రమేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుల సేవలు సమాజానికి దిక్సూచి



గుమ్మడిదల, జూన్ 22(వుదయం)

గుమ్మడిదల మండల ప్రెస్ క్లబ్‌కు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు కీలక భూమిక పోషిస్తున్నారని అన్నారు. నిష్పక్షపాత వార్తలతో ప్రజలకు సరైన సమాచారాన్ని చేరవేస్తూ సమాజానికి దిక్సూచిగా నిలుస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు పాత్రికేయుల సంక్షేమంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. పాత్రికేయుల హక్కులు, సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామనీ హామీ ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎల్ పి జి వినియోగదారులు జూన్ 30లోగా ఈ కేవైసీ చేయించుకోవాలి

మహబూబ్ నగర్ జూన్ 22 (వుదయం ప్రతినిధి)



రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్.బి హరిప్రియ అధ్యక్షతన, జిల్లా పౌరసరఫరాల అధికారి గంప శ్రీనివాస్,ఐ ఓ సి ఎల్ జిల్లా సేల్స్ ఆఫీసర్ సూర్య కిరణ్, ఎల్పిజీ డిస్ట్రిబ్యూటర్స్ తో జిల్లా కలెక్టర్ కార్యాలయం లో అదనపు కలెక్టర్ ఛాంబర్ లోసమావేశం నిర్వహించారు.కమీషనర్, పౌరసరఫరాల శాఖ వారి సూచనల మేరకు బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి చేస్తూ ఎల్.పి.జి వినియోగదారులకు ఆమె సూచనలు చేశారు. ఎల్.పి.జి కనెక్షన్ వినియోగించడం ద్వారా ప్రత్యక్ష లబ్ధి పొందుతున్న లబ్ధిదారులు అందరూ తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవడం ద్వారా వారియొక్క భవిష్యత్ లబ్ధిని కోల్పోకుండా ఉంటారని,ప్రధానమంత్రి ఉజ్వల యోజన స్కీం లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని ఆమె తెలిపారు.ఇంతవరకు ఈ కేవైసీ చేయించుకొనని ఎల్.పి.జి లబ్ధిదారులు, వినియోగదారులు ఈ నెల 30లోగా చేయించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఎల్.పి.జి ఏజెన్సీల నిర్వాహకులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, లబ్ధిదారులు ఎవరైతే ఈ కేవైసీ చేయించుకోలేదో వారిని గుర్తించి వారికి అనుకూల ప్రాంతాలలో స్పెషల్ డ్రైవ్ క్యాంపులు నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ కేవైసీ విజయవంతం చేయడానికి ఎస్ఎంఎస్, వాట్సాప్ ఫోన్ కాల్ ద్వారా వినియోగదారులను అప్రమత్తం చేయాలని కోరారు. డెలివరీ బాయ్స్ ద్వారా తగు ప్రచారం నిర్వహించాలని. ముఖ్యంగా దీపం పథకం, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, మహాలక్ష్మి పథకం వంటి ప్రత్యక్ష లబ్ధి పొందే వినియోగదారులందరూ ఎల్పిజి ఈ కేవైసీ తప్పక చేయించుకోవాలని కోరారు. ఎల్.పి.జి లబ్ధిదారులు ,వినియోగదారులు చనిపోయినట్లయితే వారి వారసులు తగు ధృవీకరణ పత్రాలతో ఎల్.పి.జి కనెక్షన్ ను వారి పేర మార్పు చేసుకొని లబ్ధిని కొనసాగించవచ్చునని తెలిపారు.

## బాలసదనంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.. పిల్లలకు మామిడి పండ్ల పంపిణీ

- పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటించిన కలెక్టర్ కే. హైమావతి
- మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని అధికారులకు ఆదేశం

సిద్దిపేట, జూన్ 22 (వుదయం బ్యూరో)



సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బాలసదనాన్ని సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలసదనంలోని పిల్లలతో కాసేపు ఆప్యాయంగా మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని మామిడి చెట్లకు కాసిన రసాల ఊరే రక రకాల మామిడి పండ్లను ఆమె స్వయంగా పిల్లలకు పంపిణీ చేశారు. బాలసదనంలో వసతులపై కలెక్టర్ పిల్లలను ఆరాతీస్తూ భోజనం ఎలా పెడుతున్నారు? రోజు పాఠశాలకు వెళ్తున్నారా?" అని పలకరించారు. దీనికి పిల్లలు స్పందిస్తూ తమకు రోజూ మంచి ఆహారం పెడుతున్నారని, క్రమం తప్పకుండా స్కూల్‌కు వెళ్తున్నామని కలెక్టర్‌కు సంతోషంగా సమాధానమిచ్చారు. వానకాలం సీజన్ ప్రారంభమైనందున పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. రోజూ కాచి చల్లార్చిన నీటిని, వేడివేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని పిల్లలకు చెప్పారు. ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, ఎల్లప్పుడూ క్రమశిక్షణతో, ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. శారీరక, మానసిక ఉల్లాసం కోసం రోజూ యోగా, ధ్యానం చేయడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని పిల్లలకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో భాగంగా కలెక్టర్ బాలసదనం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పిల్లలకు ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, బాలసదనం లోపల ఎక్కడా చెత్తాచెదారం లేకుండా, పరిసరాలను ఎల్లప్పుడూ అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా సంక్షేమ అధికారి (డిడబ్ల్యూఓ) శారదను కలెక్టర్ ఆదేశించారు.ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా సంక్షేమ అధికారి శారద, బాలసదనం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బడి పిల్లల కథలను ఆవిష్కరించిన కలెక్టర్ ఆవిష్కరణ



మహబూబ్ నగర్ జూన్ 22 (వుదయం ప్రతినిధి)

మహబూబ్ నగర్ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు రాసిన మహబూబ్ నగర్ జిల్లా బడిపిల్లల కథలు కథల సంకలనాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రాసిన కథలు చాలా చక్కగా ఉన్నాయని ప్రశంసించారు. విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలను ఆవిష్కరించడానికి ఇలాంటి రచనలు దోహదపడుతాయన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల అనుభవాలు, ఆలోచనలతో ఈ పుస్తకం రూపుదిద్దుకుందన్నారు. చిన్నారుల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి ఈ కథలు ఉపయోగపడుతాయన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ విద్యార్థులను ప్రోత్సహిస్తే వారిలో ఉన్న నైపుణ్యాలను వెలుగులోకి వస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలతో ఈ పుస్తకం వెలుగు చూసిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ హరిప్రియ, జెడ్పీ సి.ఇ.ఓ. వెంకట్ రెడ్డి, ఎ.ఓ.సువర్ణ రాజ్, వ్యవసాయ శాఖ ట్రేనింగ్ సెంటర్ డి.డి. వేంకటేశ్ ఎ.ఎం.ఓ. దుంకుడు శ్రీనివాస్, సి.ఎం.ఓ. సుధాకర్ రెడ్డి, జి.సి.డి.ఓ. అస్రాఖాద్రి, పుస్తక సంపాదకులు డా.భీంపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రథమ మహాసభలు

వుదయం, సిద్దిపేట (జూన్ 22)



బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ (BLTU) రాష్ట్ర ప్రథమ మహాసభలు 2026 జూలై 18, 19 తేదీలలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరిగాధ సిద్ధరాములు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో వివిధ ప్రభుత్వ శాఖల్లో సుమారు ఐదు లక్షల మంది యువత ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులుగా తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు 2016లో "సమాన పనికి సమాన వేతనం" చెల్లించాలని తీర్పు ఇచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని విమర్శించారు. తెలంగాణలో బీడీ, మున్సిపల్, గ్రామ పంచాయతీ, హమాలీ, ఆటో, ట్రాన్స్‌పోర్ట్, భవన నిర్మాణ, గిగ్ వర్కర్స్ తదితర అసంఘటిత రంగాల్లో సుమారు 1.5 కోట్ల మంది కార్మికులు, గ్రామీణ ప్రాంతాల్లో 60 నుంచి 70 లక్షల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారని తెలిపారు. వీరిలో అధిక శాతం మంది కనీస వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధి విధానాల వల్ల బహుజన యువతకు తగిన స్థాయిలో ఉద్యోగాలు లభించడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. కార్మికుల హక్కులు, కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై రాష్ట్ర మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఎల్‌టీయూ రాష్ట్ర నాయకులు ముదురుకోలు ఆంజనేయులు, జిల్లా నాయకులు కడవేరు శ్రీహరి, తలారి ప్రవీణ్, దెబ్బేట ఆనంద్, సడిమెల డేవిడ్, ఆంజనేయులు, రాజు, మహేష్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు వదలండి...మైదానాలు చేరండి



రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

మహబూబ్ నగర్ జూన్ 22 (వుదయం ప్రతినిధి)

మత్తు వదలండి... మైదానాలు చేరండి అని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి యువతకు పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం గ్రౌండ్ మైదానంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 12.53 కోట్ల రూపాయలతో(10.70 కోట్ల రూ.లతో అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్, ఒక కోటి రూ.లతోనాలుగు ఓపెన్ జిమ్స్,51 లక్షల రూ.లతో ఇండోర్ జిమ్, మహిళల అథ్లెటిక్స్ హాస్టల్ మిగిలిన పనులకు 32 లక్షల రూ.లు) వ్యయంతో పలు ఆధునిక క్రీడా సదుపాయాల నిర్మాణానికి ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా కు చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ క్రీడాకారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్న 400 మీటర్ల 8 లైన్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ద్వారా జిల్లాలోని యువ క్రీడాకారులకు ఉన్నత స్థాయి శిక్షణ అందే అవకాశం కలుగుతుందని అన్నారు.క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా జీవన శైలిని మార్చే శక్తివంతమైన సాధనం అని ఆయన అన్నారు. ప్రతి యువకుడు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలి" అని అన్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో వివిధ నియోజకవర్గం లలో ఇప్పటికే సుమారు 80 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు. క్రీడా రంగ అభివృద్ధి కోసం అవసరమైతే వంద కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి గారు స్పష్టం చేశారు. యువత టైమ్‌పాస్‌గా కాకుండా క్రీడలను సీరియస్‌గా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో స్విమ్మింగ్ పూల్ ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు మరింత చురుకుగా పనిచేసి గ్రామ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని సూచించారు. క్రీడా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా త్వరితగతిన అనుమతులు ఇచ్చి పనులను వేగవంతం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. లక్షలాది యువతకు క్రీడల ద్వారా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ విప్,మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి క్రీడాశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సంతకం చేసి మహబూబ్ నగర్ కు మంజూరు చేసిన ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. నాడు అడిగిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ అకాడమీతో పాటు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాను క్రీడల రంగంలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే కాకుండా ఒలింపిక్ క్రీడలలో దేశం తరుపున ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించేలా క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ ఇప్పించే ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. అవసరమైతే భూముల సేకరణ చేపట్టి క్రీడలకు సంమాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడారంగానికి ప్రాధాన్యం పెరిగిందన్నారు. గతంలో క్రీడలకు రూ.50 కోట్ల బడ్జెట్ మాత్రమే కేటాయించగా,ముఖ్యమంత్రి మొదటి సారి 350 కోట్ల రూ.లు కేటాయించి ,తరువాత 640 కోట్లకు పెంచినట్లు తెలిపారు.మహబూబ్‌నగర్ క్రీడల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందని, ఇప్పటికే వాలీబాల్ అకాడమీ, కబడ్డీ అకాడమీ మంజూరయ్యాయని చెప్పారు. జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ మంజూరు చేయాలని మంత్రిని కోరారు.,అందుకు అవసరమైన 30 ఎకరాల భూమిని ఇప్పటికే గుర్తించినట్లు ఆయన తెలిపారు. సరైన సదుపాయాలు కల్పిస్తే మహబూబ్‌నగర్ క్రీడాకారులు జాతీయ 2009 తర్వాత కోచ్‌ల నియామకాలు జరగకపోయినా, ప్రస్తుతం సుమారు 350 మంది కోచ్‌ల నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. తెలంగాణను దేశంలోనే క్రీడల హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఆధునిక ట్రాక్‌లు, మైదానాలు, స్విమ్మింగ్ పూల్స్, శిక్షణ కేంద్రాలు, నిపుణులైన కోచ్‌లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు.సీఎం కప్ పోటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తిస్తున్నామని, మొదటి ఎడిషన్‌లో 3.5 లక్షల మంది, రెండో ఎడిషన్‌లో 5.5 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారని,మూడవ ఎడిషన్ లో 10 లక్షల మంది పాల్గొంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి శ్రీమతి డి.జానకి, మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్,స్థానిక కార్పొరేటర్ ఉమర్ కొత్వాల్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు , డివైఎస్ఓ రాజశేఖర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు



- నియోజకవర్గాల సమస్యల పరిష్కారానికి వినతి

సంగారెడ్డి, జూన్ 22:వుదయం.

సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, రైతు సమస్యలు, తాగునీటి సౌకర్యం, రహదారులు, విద్యాసంస్థలు, గ్రామీణ మౌలిక వసతుల అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సదాశివపేట మండలం బొబ్బిలిగామ ప్రభుత్వ పాఠశాలలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్, దెబ్బతిన్న భవన గోడల వల్ల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని పేర్కొంటూ తక్షణ మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.5 కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాదనల పురోగతిని కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మల్కాపూర్ గ్రామంలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసి ఇంటి నంబర్లు జారీ చేసిన వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరారు.కంది మండలం ఉత్తర్‌పల్లి గ్రామంలో రహదారి నిర్మాణానికి రూ.23 లక్షల అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. సూరారం యూపీఎస్ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరగా, జిల్లాలోని పెండింగ్ బిల్లుల వివరాలను పరిశీలించి చెల్లింపులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.గిర్మాపూర్ గ్రామంలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూ బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో బయోమెట్రిక్ విధానాన్ని సడలించాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కోరారు. వృద్ధ రైతుల వేలిముద్రలు నమోదు కాకపోవడంతో పరిహారం చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని వివరించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఓలు పట్టణ ప్రాంతాల్లో ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించడం లేదని, బీఎల్ఏలకు సరైన సమాచారం అందడం లేదని ఎమ్మెల్యేలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు.2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.1.98 కోట్లతో బోర్‌వెల్ పనులకు అనుమతులు మంజూరు చేయాలని చింత ప్రభాకర్ కోరగా, జహీరాబాద్ నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ రద్దు చేయాలని వెంకటేశ్వరపల్లి గ్రామస్థుల నిరసన

కోహెడ, జూన్ 22: (వుదయం ప్రతినిధి)





కోహెడ మండల కేంద్రానికి కేటాయించిన డంపింగ్ యార్డ్‌ను వెంకటేశ్వరపల్లి గ్రామ పరిధిలో ఏర్పాటు చేయడాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వెంకటేశ్వరపల్లి గ్రామ ప్రజలు సోమవారం కోహెడ తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.గ్రామానికి సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగే అవకాశం ఉందని, గ్రామ ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు కేటాయించడం సరికాదని పేర్కొన్నారు నిరసన అనంతరం గ్రామస్థులు తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేసి డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రజల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. అధికారులు వారి వినతిని స్వీకరించి సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు.

## రైతు పంటలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

- ఏ ఐ యు కె ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి

నారాయణపేట టౌన్ జూన్ 22(వుదయం ప్రతినిధి)



రాష్ట్ర ప్రభుత్వం అనూహ్యంగా రైతుల పంటను మొత్తంగా కొనలేమని తేల్చి చెప్పి రైతాంగాన్ని తీవ్రమైన గందరగోళానికి గురి చేస్తుందని ఏఐయుకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కోటా ప్రకారమే ఇకమీదట కొనుగోలు చేస్తామని రాష్ట్ర అనధికార మంత్రివర్గం సమావేశంలో నిర్ణయం తీసుకోవడం వారి పాలనకే సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన ముఖ్యమైన హామీలను ఒక్కొక్కటిగా తుంగలో తొక్కుతుందన్నారు .రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదన్నారు. రైతు భరోసా మొత్తం వేయకపోవడంతో రాష్ట్ర రైతాంగానికి 16545 కోట్లు బకాయి పడిందన్నారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం, మొక్కజొన్న చెల్లింపులు సక్రమంగా చేయడం లేదని యాసంగిన సన్నాలకు బోనస్ ఊసే లేదన్నారు. ఎన్నికల్లో రైతుల ఓట్లను కొల్లగొట్టుటకు ఇచ్చిన వాగ్దానాలు ఒక్కొటీ కూడా సక్రమంగా నెరవేర్చడం లేదన్నారు.రాష్ట్రంలో ప్రధానంగా వరి, మొక్కజొన్న ,పత్తి ,కంది, పెసర, సోయాబీన్ ,సజ్జలు ఇలాంటి పంటలను పండిస్తున్నారు. కేంద్రం కనీస మద్దతు ధరలు ( ఎం ఎస్ పి ) ప్రకటించి వదిలేస్తున్నది కొనుగోలు బాధ్యతను పూర్తిగా తీసుకోవటం లేదన్నారు.రాష్ట్రంలో 4 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట పండితే రాష్ట్ర ప్రభుత్వం కేవలం రెండు

కేంద్ర ప్రభుత్వం కాంప్లెక్యూరియాను రైతు వారిగా ఇవ్వాలి యాప్ ల ద్వారా సరఫరా చేయడం ద్వారా నిరక్షరాస్యులు అయిన రైతాంగం ఇబ్బందులకు వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేదంటే ఏఐయుకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. రైతుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని లేదంటే ఏఐయు కె ఎస్ ఆధ్వర్యంలో చేపడతామన్నారు.కేంద్ర రాష్ట్ర పాలకులు ఎన్నికల్లో ఓట్లు వేసే వారీగా మాత్రమే రైతులను గుర్తించడం సరైంది కాదన్నారు. రైతాంగాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించుటకు రైతాంగం ముందుకు రావాలని యాదగిరి పిలుపునిచ్చారు.


IN THE COURT OF THE HON'BLE 2 nd ADDL CHIEF JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
MVOP NO. 2374 OF 2025
Between:
Srinu Darshanam ...Petitioner
Mirza Ifath Baig & Others ...Respondents
To
1).Mirza Ifath Baig, S/o:Mirza Inayath Baig., Age:Major, Occ: Business, R/o:H.No:5-26/13,Dargha Khaliz Khan, Kismathpura, Gandipet, Rangareddy-500086.
2). BAlakrishna Gillella, S/o.Ganapathaiah, Age:26 years, Occ: Rider, R/o.SY.No: 106, Drga Khalz Khan, Kishmathpur, Rajendranagar, Ranga Reddy..
Take this notice that the petitioner herein has filed the above M.V.O.P against you and another respondent by claming compensation before the above mentioned court. Hence the above M.V.O.P is posted for your appearance and counter. If you fail to appear before the above mentioned court on 02-07-2026 by 10.30 a.m., the matter will be decided in your absence.
(BY ORDER OF THE COURT)
Sd/-
PUTTA THIRUPATHI REDDY (AP/52/1996)
MA(Eco), LLM(Con)
ADVOCATE
Flat No:1, Ravi Residency Apartment, H.No:13-4-48/F/1, Opp: CentralBank of India, left side to RajadhaniTheater, Vikas Nagar, Dilsukh Nagar, Hyderabad (Town & Dist)500060. Phone:9440687160.




"* పశ్చిమాసియాలో శాశ్వత శాంతి స్థాపన దిశగా మరో ముందడుగు పడింది. ఇరు దేశాల మధ్య యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమే లక్ష్యంగా ఆ దేశంతో జరిపిన చర్చలు తుది ఒప్పందానికి మంచి పునాది వేశాయి. అమెరికా ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుంది. తమ సోయా, మొక్కజొన్న, గోధుమలను టెహ్రాన్ కొనుగోలు చేస్తే.. దానికి బదులుగా విదేశాల్లో ఉన్న ఇరాన్ ఆస్తులు విడిపిస్తాం. తాము చేసుకున్న ప్రాథమిక ఒప్పందానికి ఇరాన్ కట్టుబడి ఉందో లేదో ధ్రువీకరించడానికి ఐక్యరాజ్య సమితి అణు తనిఖీ అధికారులు ఇరాన్‌ను సందర్శిస్తారు. లెబనాన్ విషయంలో సరైన సమన్వయం ఉండేలా ఇరాన్, ఇజ్రాయెల్ నేతలతో తమ అధికారులు చర్చలు జరుపుతున్నాం. హార్మూజ్ తెరిచే ఉంది, జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయన్నారు."

* అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

## వే'మన'పద్యం

చిత్తశుద్ధి గలిగి చేసిన పుణ్యంబు
కొంచెమైన నదియు కొదువకాదు
విత్తనంబు మర్రివృక్షంబునకు నెంత
విశ్వదాభిరామ! వినురవేమ



# అలసత్వమే ప్రథమ శత్రువు

"అలసస్య కుతో విద్యా అవిద్యస్య కుతో ధనమ్ |అధనస్య కుతో మిత్రం అమిత్రస్య కుతః సుఖమ్ ||" అనేది సంస్కృతంలో ప్రసిద్ధ శ్లోకం. వ్యక్తిత్వ వికాసానికి మానవ పురోగతికి బద్ధకమే శత్రువని దీని తాత్పర్యం. అలసత్వానికి Negligence, Laziness, Slackness అనేవి ఆంగ్లంలో పర్యాయపదాలు. బద్ధకస్తుడు చదువుకోవడానికి, కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఆసక్తి చూపడు.అందుకే అతను విజ్ఞానాన్ని నైపుణ్యాలను సంపాదించ లేడు. అందువల్ల మంచి వృత్తి,ఉపాధి దొరకదు.మంచి వృత్తి,ఉపాధి లేని కారణంగా సంపాదన ఉండదు,సంపద లేనివాళ్లకు స్నేహితులు ఉండరు.స్నేహితులు, బంధువులు లేని ఒంటరి జీవితంలో ఆనందం, సుఖం ఉండవు. బద్ధకమే జీవితంలో కష్టాలన్నిటికి మూలం అంటున్న పై శ్లోకం శబ్దార్థాలను విప్పిచెప్పి ఉపాధ్యాయులు కంఠస్థం చేయించాలి. ఇంతకు అలసత్వం లేదా బద్ధకం ఎందుకు మనుషుల్లో ఏర్పడుతుందని ఆలోచిస్తే ప్రధానంగా ఐదుకారణాలు కన్పిస్తున్నాయి. అవి 1. లక్ష్యం లేకపోవడం, 2.అనారోగ్యం, 3.మానసిక ఒత్తిళ్లు,ఆందోళన,4.వాయిదావేసే తత్వం, 5.అతిగా ఫోన్ వాడటం ఇత్యాది కారణాల వల్ల వ్యక్తులకు అలసత్వం అలవడుతుంది.మొదట ప్రస్తావించినట్టు అలసత్వం ఎంతటి ప్రమాదకారో "For want of a nail the shoe was lost ఒక చిన్న మేకును నిర్లక్ష్యం చేయడం వల్ల గుర్రపు నాడా ఊడిపోయింది, Negligence is the mother of all disasters నిర్లక్ష్యం అనేది అన్ని రకాల విపత్తులకు మూలం, An idle brain is the devil's workshop పనిలేని మనుషి బుర్ర దెయ్యాలకు కార్ఖానా వంటిది Procrastination is the thief of time పనులను వాయిదా వేయడం అనేది మన అమూల్యమైన కాలాన్ని దొంగిలించడమే, A lazy man makes himself more work సోమరిపోతు ఒకే పనిని సరిగ్గా చేయక, దానిని మళ్లీ మళ్లీ చేస్తూ ఎక్కువ పని కొని తెచ్చుకుంటాడు" మొదలైన సామెతలను గమనిస్తే తెలుస్తుంది.

బద్ధకం పోవాలంటే ఏం చేయాలి? అనే ప్రశ్నకు డాక్టర్ జోసెఫ్ ఫెరారీ,డాక్టర్ పియర్స్ స్టీల్,డాక్టర్ తిమోతి పైచిల్,డాక్టర్ ఫుసియా సిరోయిస్ తదితర మనోవైద్యులు సూచించిన పరిష్కార మార్గాలు ఇవి. 1. పెద్ద లక్ష్యం దాని సాధన అలవాటు లేనందువల్ల చిన్న లక్ష్యాలలను పెట్టుకోవాలి. ఒక వేళ లక్ష్యం పెద్దదే అయితే దాన్ని చిన్న భాగాలుగా విభజించి పూర్తి చేయాలి. 2. సమయపాలన : రోజువారీ పనుల కోసం ఒక టైమ్ టేబుల్ రాసుకుని చేస్తూపోవాలి. 3.మంచి జీవనశైలి: రోజుకు 7-8 గంటలు నిద్రపోవాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. 4. వ్యాయామం: రోజుకు కనీసం ఓ ఇరవై నిమిషాలు నడవడం లేదా వ్యాయామం చేయడం వల్ల శరీరం చురుగ్గా మారుతుంది.5. మొదటి ఐదునిముషాలు: నిద్రనుంచి మేల్కొన్న మొదటి ఐదు నిమిషాలు ఏదైనా పనిని ఆపకుండా, కనీసం ఐదు నిమిషాలైనా చేయడానికి ప్రయత్నించాలి. కొన్ని రోజుల తర్వాత క్రమంగా పని అలవాటవుతుంది. 6. డిజిటల్ డిటాక్స్: చదువుకునేటప్పుడు లేదా పని చేసేటప్పుడు ఫోన్‌ను దూరంగా ఉంచాలి. ముఖ్యంగా విద్యార్థులు బద్ధకం నుండి బయటపడటానికి వ్యక్తిగత టైమ్ టేబుల్ లేదా స్టడీ ప్లాన్ తయారు చేసుకోవాలి. వ్యక్తిలో అలసత్వానికి శాస్త్రీయంగా వైద్యులు తమ ప్రయోగాల్లో మరి కొన్ని కారణాలను నిర్ధారించారు. అవి 1.డోపమైన్ అసమతుల్యత: (Dopamine Detox Lack): మన మెదడు తక్షణ ఆనందాన్ని (Instant Gratification) కోరుకుంటుంది. చదవడం లేదా పని చేయడం వల్ల ఫలితం ఆలస్యంగా వస్తుంది. కానీ ఫోన్ చూడటం, నిద్రపోవడం వల్ల వెంటనే ఆనందం లభిస్తుంది. అందుకే మెదడు సులువైన పనుల వైపు మొగ్గుచూపుతుంది. 2. భయం, పరిపూర్ణత : (Perfectionism & Fear of Failure): నేను ఈ పనిని పరిపూర్ణంగా చేయలేనేమో లేదా ఓడిపోతానేమో అనే భయం వల్ల చాలా మంది అసలు పనే ప్రారంభించరు. దీనినే 'పనిని వాయిదా వేయడం (Procrastination) అంటారు. 3.అస్పష్టత (Lack of Clarity): ఏ పనిని ఎలా ప్రారంభించాలో, ఎక్కడ ముగించాలో తెలియనప్పుడు గందరగోళం ఏర్పడి బద్ధకం ఆవహిస్తుంది. 4. శారీరక బలహీనతలు: రక్తహీనత (Anemia), విటమిన్ డి (Vitamin D) లేదా విటమిన్ బి12 (Vitamin B12) లోపాలు ఉన్నప్పుడు శరీరం ఎప్పుడూ అలసటగా అనిపించడం వల్ల పనిచేయాలనిపించదు.

బద్ధకం వదిలించుకోవడానికి నిపుణులు చెప్పిన మరికొన్ని ఆచరణాత్మక వ్యూహాలు (Action Plan) ఇవి.1. బద్ధకాన్ని కేవలం ఆలోచనలతో పోగొట్టలేము, దానికి కొన్ని పద్ధతులు పాటించాలి: పొమోడోరో టెక్నిక్ (Pomodoro Technique) ఏదైనా పనిని 25 నిమిషాల పాటు పూర్తి ఏకాగ్రతతో చేయడం. ఆ తర్వాత 5 నిమిషాలు విరామం (Break) తీసుకోవడం.ఇలా 4 సార్లు చేసిన తర్వాత 20 నిమిషాలు పెద్ద బ్రేక్ తీసుకోవాలి. ఇది మెదడు అలసిపోకుండా చూస్తుంది. 2. టు-మినిట్ రూల్ (2-Minute Rule)
మీరు చేయాల్సిన పనిని ప్రారంభించడానికి కేవలం 2 నిమిషాలు మాత్రమే పడుతుంది అనుకుంటే, దానిని వెంటనే చేయాలి (ఉదాహరణకు: పుస్తకం తెరవడం, బెడ్ సర్దడం, ఈమెయిల్ రిప్లై ఇవ్వడం).
3. ఐసెన్‌హోవర్ మ్యాట్రిక్స్ (Eisenhower Matrix):
'అత్యవసరం మరియు ముఖ్యం: ఈ రోజు ఖచ్చితంగా చేయాల్సిన పనులు.ముఖ్యమే కానీ అత్యవసరం కాదు: చదువు, వ్యాయామం (వీటికే ఎక్కువ సమయం ఇవ్వాలి).అత్యవసరం కానీ ముఖ్యం కాదు: ఇతరుల ఫోన్ కాల్స్' ఇట్లా పనులను నాలుగు భాగాలుగా విభజించుకోవడం ద్వారా బద్ధకాన్ని జయించవచ్చు.
అలసత్వం పై పనిని వాయిదా వేసే తత్వం పై బద్ధకస్తుల మనస్తత్వంపై అనాదిగా ప్రవక్తలు, పండితులు, మేధావులు, తత్వవేత్తలు అనేకమంది పలువిధాలుగా వ్యాఖ్యానించారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు బద్ధకాన్ని, వాయిదా వేయడాన్ని "తామసిక స్వభావం"గా వర్ణించి ఇది మనిషిని అజ్ఞానంలో ముంచుతుందని హెచ్చరించాడు. భర్తృహరి తన 'సుభాషిత త్రిశతి' లో "ఆలస్యం హి మనుష్యాణాం శరీరాస్థో మహాన్ రిపుః" అని పేర్కొన్నారు. అంటే, మనిషి శరీరంలో ఉన్న అన్ని శత్రువుల కంటే బద్ధకమే అత్యంత ప్రమాదకరమైన శత్రువు అని అర్థం. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద బద్ధకాన్ని 'తమో గుణం'గా అభివర్ణించారు.

అలసత్వం పై పనిని వాయిదా వేసే తత్వం పై బద్ధకస్తుల మనస్తత్వంపై అనాదిగా ప్రవక్తలు, పండితులు, మేధావులు, తత్వవేత్తలు అనేకమంది పలువిధాలుగా వ్యాఖ్యానించారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు బద్ధకాన్ని, వాయిదా వేయడాన్ని "తామసిక స్వభావం"గా వర్ణించి ఇది మనిషిని అజ్ఞానంలో ముంచుతుందని హెచ్చరించాడు. భర్తృహరి తన 'సుభాషిత త్రిశతి' లో "ఆలస్యం హి మనుష్యాణాం శరీరాస్థో మహాన్ రిపుః" అని పేర్కొన్నారు. అంటే, మనిషి శరీరంలో ఉన్న అన్ని శత్రువుల కంటే బద్ధకమే అత్యంత ప్రమాదకరమైన శత్రువు అని అర్థం. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద బద్ధకాన్ని 'తమో గుణం'గా అభివర్ణించారు. బద్ధకం వల్ల మనిషిలోని సాత్విక గుణాలు శక్తులు నిద్రపోతాయని, దానిని జయించడానికి రజోగుణంతో కూడిన నిరంతర కార్యాచరణ అవసరమని చెప్పారు.

బద్ధకం వల్ల మనిషిలోని సాత్విక గుణాలు శక్తులు నిద్రపోతాయని, దానిని జయించడానికి రజోగుణంతో కూడిన నిరంతర కార్యాచరణ అవసరమని చెప్పారు. బెంజమిన్ ఫ్రాంక్లిన్- నిన్న చేయాల్సిన పనిని ఈ రోజుకు, ఈ రోజు చేయాల్సిన పనిని రేపటికి వాయిదా వేసేవాడు తన జీవితాన్ని తానే నాశనం చేసుకుంటాడని వ్యాఖ్యానించారు. సుప్రసిద్ధ తెలుగు రచయితలు వ్యక్తిత్వ వికాస నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్, పట్టాభి రామ్ యువతలో బద్ధకాన్ని పోగొట్టడానికి రచనలు, విశ్లేషణలు అందించారు.

సాహిత్యపరంగా చూస్తే అలసత్వాన్ని అధిగమించడానికి తెలుగులో అనువాద గ్రంథాలు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. 'అతికష్టమైన పని అన్నిటికంటే ముందు' ఇది Brian Tracy రాసిన Eat That Frog!: 21 Great Ways to Stop Procrastinating and Get More Done in Less Time గ్రంథానికి మద్దూరి రాజ్యశ్రీ చేసిన అనువాదం ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడైన పుస్తకం కూడా. మనకున్న పనులలో అత్యంత కష్టమైన వాటిని ఎట్లా పూర్తి చేయాలనే విషయంపై 21 అద్భుతమైన సూత్రాలతో ఈ పుస్తకం ప్రేరణ కలిగిస్తుంది. డారియస్ ఫోరాక్స్ 'Do It Today (Overcome Procrastination, Improve Productivity)' పుస్తకంలో పనులను వాయిదా వేసే అలవాటును మానుకుని, ఉత్పాదకతను, నైపుణ్యాలను ఎట్లా పెంచుకోవాలో సులువుగా వివరించాడు.యండమూరి వీరేంద్రనాథ్ - విద్యార్థులు, యువత తమ ఏకాగ్రతను దెబ్బతీసే బద్ధకాన్ని వదిలి, విజయం వైపు ఎలా నడవాలో ఆచరణాత్మక చిట్కాలతో అలరించే పుస్తకం విజయానికి ఐదు మెట్లు. Atomic Habits అనే గ్రంథంలో జేమ్స్ క్లియర్ - చిన్న చిన్న అలవాట్లను మార్చుకోవడం ద్వారా బద్ధకాన్ని శాశ్వతంగా ఎట్లా రూపుమాపవచ్చునో శాస్త్రీయంగా నిరూపించాడు. The 5 Second Rule - మెల్ రాబిన్స్ రాసిన ఈ పుస్తకం బద్ధకం అనిపించినప్పుడు మన మెదడు వంద కారణాలు వెతుకుతుంది. అలా కాకుండా 5-4-3-2-1 అని లెక్కపెట్టి వెంటనే పనిని ప్రారంభించడమెట్లానో నేర్పుతుంది.సమయాన్ని వాయిదా వేయడం అంటే మన జీవితాన్ని మనకు మనం వెనక్కి నెట్టడమే. బద్ధకం అనేది ఒక శాశ్వత లోపం కాదు, అది కేవలం ఒక అలవాటు మాత్రమే. 'అటామిక్ హ్యాబిట్స్' చెప్పినట్టు చిన్న చిన్న మార్పులతోనైనా లేదా 'ఫైవ్ సెకండ్ రూల్' చెపుతున్న సందేహం, భయం , సంకోచాన్ని ఎదుర్కొనే విధానం తెలుసుకొనైనా, తమకు నచ్చిన మరే ఇతర మోటివేషనల్ బుక్ ద్వారానైనా సరే విద్యార్థులు తమలోని అలసత్వాన్ని తొలగించుకోవడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించాలి.విద్యార్థులు కొత్తవిద్యాసంవత్సరంలోకి పై తరగతుల్లోకి అడుగిడిన శుభసందర్భాన ఉపాధ్యాయులు సైతం అలసత్వ నివారణ గురించే తొలిపాఠం చెప్పాలి.అలసత్వం నుండి, బద్ధకం నుండి,వాయిదా వేసే స్వభావం నుండి బయటపడ్డారంటే విద్యార్థుల్లో inner enrichment మొదలైనట్టే.



- డా.బెల్లి యాదయ్య
9848392690

# వామపక్ష ఐక్యత.. చారిత్రక ఆటంకాలు

* ఒకప్పుడు కమ్యూనిస్టులకు బలంగా ఉన్న పశ్చిమ బెంగాల్, త్రిపుర చేజారిపోవడం, కేరళలో పరిమితమవ్వడం వామపక్షాల బలహీనతను సూచిస్తోంది. ప్రజలకు, శ్రమ సంస్కృతికి కమ్యూనిస్టులు కొంత దూరమవ్వడమే నేడు వారు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు. ఇలాంటి ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్షాల మధ్య తక్షణమే 'పూర్తి విలీనం' సాధ్యం కాకపోవచ్చు. సిద్ధాంత భేదాలు, సంస్థాగత ప్రయోజనాలు అందుకు అడ్డురావచ్చు. కానీ, దేశ ప్రయోజనాల దృష్ట్యా కింది అంశాలపై కనీస ఉమ్మడి కార్యక్రమం ద్వారా ఐక్యంగా పోరాడడం సాధ్యమే. గతాన్ని వీడి.. వర్తమానంలోకి రావాలనే ఆలోచన బలంగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. 1960లలో జరిగిన చర్చల చుట్టూనే ఇంకా తిరగడం వల్ల ప్రయోజనం లేదు.



భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి శతాబ్ద కాలపు ఘనమైన చరిత్ర ఉంది. కార్మికులు, రైతులు, విద్యార్థులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఈ ఎర్రజెండా సాగించిన పోరాటాలు సామాన్యమైనవి కావు. ఎందరో మహానుభావుల త్యాగాలు, రక్తాశ్రువుల మీదుగా నిర్మితమైన ఈ ఉద్యమం.. కాలక్రమంలో అనేక చీలికలు, సిద్ధాంతపరమైన ఘర్షణలను కూడా చవిచూసింది. నేడు భారత వామపక్ష రాజకీయాల్లో ప్రధానంగా మూడు ధోరణులు కనిపిస్తున్నాయి: ఒకటి సిపిఐ, రెండు సిపిఎం, మూడు సిపిఐ ఎంఎల్ వర్గాలు. ఈ మూడు ప్రవాహాలు 'మార్క్సిజం' అనే ఒకే తత్వశాస్త్రం ఆధారంగా పనిచేస్తున్నప్పటికీ, నేటికీ పూర్తి ఐక్యత సాధ్యం కాలేదు. అసలు ఈ చారిత్రక విభజనకు కారణాలేమిటి..? వర్తమాన పరిస్థితుల్లో ఐక్యత సాధ్యమేనా..? అనే ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిన అత్యంత కీలకమైన సమయం ఆసన్నమైంది. విభజనల నేపథ్యం - సిద్ధాంతాల ఘర్షణభారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం (1920 లేదా 1925) గురించిన భిన్నాభిప్రాయాల నుండే భేదాలు మొదలయ్యాయి. స్వాతంత్ర్యానంతరం దేశ స్వభావం ఏమిటి..? నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ పట్ల ఎలాంటి వైఖరి అవలంబించాలి..? భారత విప్లవ వ్యూహం ఎలా ఉండాలి..? పార్లమెంటరీ ఎన్నికల్లో పాల్గొనాలా, వద్దా..? అనే అంతర్గత చర్చలు చివరకు 1964లో పెద్ద చీలికకు దారితీసి సిపిఐ నుండి సిపిఎం ఆవిర్భవించింది. ఈ చారిత్రక చీలిక వెనుక మూడు ప్రధాన కారణాలుగా చూడొచ్చు.ఒకటి అంతర్జాతీయ ప్రభావం : నాటి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం సోవియట్ యూనియన్ (రష్యా) పంథా, చైనా పంథాగా విడిపోయింది. సిపిఐ నాటి సోవియట్ వైఖరిని సమర్థించగా, సిపిఎం దానిని తీవ్రంగా విమర్శించింది. రెండోది రాజ్యం పై భిన్న విశ్లేషణ : భారత ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉంటూ ప్రజల ప్రయోజనాల కోసం పోరాడవచ్చని సిపిఐ భావిస్తే.. ఇక్కడి రాజ్యాంగం పాలకవర్గాల ప్రయోజనాల కోసమే ఉందని, మరింత తీవ్రమైన ప్రజా పోరాటాలు అవసరమని సిపిఎం నమ్మింది. మూడోవది, నక్సల్‌బరీ ఊపు - ఎంఎల్ వర్గాల పుట్టుక : 1967లో పశ్చిమ బెంగాల్‌లోని 'నక్సల్‌బరీ' గ్రామంలో జరిగిన తిరుగుబాటు ఉద్యమంలో మరో కొత్త మలుపు వచ్చింది. కేవలం ఎన్నికల రాజకీయాల ద్వారా మార్పు సాధ్యం కాదని, సాయుధ పోరాటం ద్వారా 'గ్రామాలతో నగరాలను చుట్టుముట్టడమే' మార్గమని నమ్మిన విప్లవకారులు సిపిఐ (ఎంఎల్)గా అవతరించారు.ఆ విశ్లేషణే నేటికీ పెద్ద ఆటంకంగా ఉన్నాయని చెప్పవచ్చు. భారత సమాజ స్వభావంపై నేటికీ ఈ మూడు పార్టీలకూ భిన్నమైన అంచనాలు ఉన్నాయి. భారతదేశం పెట్టుబడిదారీ అభివృద్ధి దిశలో ఉందనేది సిపిఐ వాదన. పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడినా భూస్వామ్య అవశేషాలు ఇంకా ఉన్నాయనేది సిపిఎం విశ్లేషణ. అసలు దేశం ఇప్పటికీ 'అర్ధ సామంత, అర్ధ వలస' సమాజంగానే ఉందనేది సిపిఐ ఎంఎల్ వర్గాల నమ్మకం. సమాజ స్వభావాన్ని చూసే చూపులోనే తేడా ఉన్నప్పుడు, వారి పోరాట వ్యూహాలు కూడా భిన్నంగా ఉండడం సహజం. దీనికి తోడు దశాబ్దాలుగా పేరుకుపోయిన పరస్పర అవిశ్వాసం, ఒకరినొకరు 'సవరణవాదులు', 'అతివాదులు' అని విమర్శించుకోవడం సంస్థాగత సంస్కృతిలో భాగమైపోయింది. వర్తమాన సంక్షోభం - ముంచుకొస్తున్న సవాళ్లుగతాన్ని నెమరువేసుకోవడం ఎలా ఉన్నా, నేటి నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, శరవేగంగా పెరుగుతున్న కార్పొరేటీకరణ వామపక్షాల ముందు మునుపెన్నడూ లేని సవాళ్లను నిలిపాయి. ఆర్థిక రంగంలో కాంట్రాక్టు వ్యవస్థ, గిగ్ ఎకానమీ పెరిగిపోవడం, నిరుద్యోగం, కార్మిక చట్టాల నిర్వీర్యం పాత తరహా ట్రేడ్ యూనియన్ పోరాటాలను దెబ్బతీశాయి. సామాజిక, రాజకీయ రంగాల్లో ఒకవైపు కుల వివక్ష, మహిళలపై హింస, ఆదివాసీల హక్కుల హరణ కొనసాగుతుండగానే.. మరోవైపు కార్పొరేట్ శక్తులు, మతోన్మాద శక్తులు చేతులు కలిపి దేశాన్ని శాసిస్తున్నాయి. ఒకప్పుడు కమ్యూనిస్టులకు బలంగా ఉన్న పశ్చిమ బెంగాల్, త్రిపుర చేజారిపోవడం, కేరళలో పరిమితమవ్వడం వామపక్షాల బలహీనతను సూచిస్తోంది. ప్రజలకు, శ్రమ సంస్కృతికి కమ్యూనిస్టులు కొంత దూరమవ్వడమే నేడు వారు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు. ఇలాంటి ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్షాల మధ్య తక్షణమే 'పూర్తి విలీనం' సాధ్యం కాకపోవచ్చు. సిద్ధాంత భేదాలు, సంస్థాగత ప్రయోజనాలు అందుకు అడ్డురావచ్చు. కానీ, దేశ ప్రయోజనాల దృష్ట్యా కింది అంశాలపై కనీస ఉమ్మడి కార్యక్రమం ద్వారా ఐక్యంగా పోరాడడం సాధ్యమే. గతాన్ని వీడి.. వర్తమానంలోకి రావాలనే ఆలోచన బలంగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. 1960లలో జరిగిన చర్చల చుట్టూనే ఇంకా తిరగడం వల్ల ప్రయోజనం లేదు. గత చరిత్రలో ఇరుక్కుపోకుండా, నేటి తరం ఎదుర్కొంటున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, విద్యా రంగాల ప్రైవేటీకరణ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. ఇక మార్క్స - అంబేద్కర్ దృక్పథాల కలయిక అత్యంత కీలకమైన విస్మరించరాని అంశం. భారతదేశంలో వర్గ సమస్యతో పాటు కుల సమస్య అత్యంత ప్రధానమైనది. అందుకే బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను, మార్క్సిస్టు దృక్పథంతో కలిపి కార్యాచరణ రూపొందించాలి.కేవలం పైస్థాయి నాయకుల మధ్య ఒప్పందాల కంటే.. కార్మిక, రైతు, విద్యార్థి, మహిళా సంఘాలు క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయడం ద్వారానే అసలైన ఐక్యత బలపడుతుంది. గతంలో ఏ.బి. బర్ధన్ (సిపిఐ), పుచ్చలపల్లి సుందరయ్య (సిపిఎం), మద్దికాయల ఓంకార్ (ఎంసిపిఐ), సీతారాం ఏచూరి, తెలంగాణలో తమ్మినేని వీరభద్రం వంటి నాయకులు ఈ దిశగా గట్టి కృషి చేశారు. భారత వామపక్ష ఉద్యమం ముందున్న అసలు ప్రశ్న.. 1964లో ఎవరు సరైన వారు..? లేదా 1967లో ఎవరు తప్పు చేశారు..? అనేది కాదు. అసలైన ప్రశ్న ఒక్కటే, "నేటి భారతదేశంలో కార్మికులు, రైతులు, నిరుద్యోగులు, దళితులు, ఆదివాసీలు, మహిళల సమస్యలపై వామపక్షాలన్నీ సమిష్టిగా ఒక ప్రత్యామ్నాయాన్ని చూపగలవా..?" ఈ ప్రశ్నకు సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్, ఇతర వామపక్ష శక్తులు కలిసికట్టుగా కార్యాచరణ ద్వారా సమాధానం చెప్పగలిగితే.. పార్టీల పూర్తి విలీనం జరగకపోయినా, భారతదేశంలో ఒక నూతన వామపక్ష పునరుజ్జీవనం ప్రారంభం కావడం ఖాయం..!



మాలోతు సాగర్
70138 05411

# వివాహ బంధంలో స్త్రీ అస్తిత్వం

పెళ్లి... భారతీయ సామాజిక జీవనంలో ఇదొక అత్యున్నత సంస్కారం, ఒక పవిత్ర ఘట్టం. వేద మంత్రాలు, అగ్ని సాక్షి, పెద్దల ఆశీర్వాదాల మధ్య మొదలైన ఈ బంధం, ఆధునిక కాలంలో ప్రభుత్వ కార్యాలయం నుంచి జారీ అయ్యే ఒక 'వివాహ ధృవీకరణ పత్రం' (Marriage Certificate) తో చట్టబద్ధమైన గుర్తింపును పొందుతోంది. చట్టం దృష్టిలో, సమాజం దృష్టిలో ఆ కాగితమే ఫైనల్. కానీ, ఒక స్త్రీగా తన అంతరంగం లోతుల్లోంచి ఒక ప్రశ్న నిరంతరం తలెత్తుతోంది - సమాజం ఇచ్చే ఆ కాగితపు గుర్తింపు, తన (మహిళా) మనసు కోరుకునే ఆత్మిక అనుబంధం... ఈ రెండింటిలో ఏది నిజం..? అసలు ఆలుమగల మధ్య ఉండాల్సిన సంబంధం ఏమిటి..? వివాహ వ్యవస్థతో స్త్రీకి, సమాజానికి ఉన్న ముడి ఎలాంటిది..? ఈ బంధంలో స్త్రీ తన సొంత అస్తిత్వాన్ని (Identity) ఎలా కాపాడుకుంటోంది..? అనేది కోణాన్ని పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రోజుల్లో ఒక స్త్రీ ఎంత చదువుకున్నా, ఎంత సంపాదించినా, సమాజం ఆమె స్వతంత్ర అస్తిత్వాన్ని అంగీకరించడానికి ఎందుకు అంతగా సంకోచిస్తుంది అనడానికి మన కళ్ల ముందే ఎన్నో ఉదాహరణలు కనిపిస్తుంటాయి. ఒక మహిళ తన స్వశక్తితో సంపాదించిన డబ్బును దాచుకోవడానికి బ్యాంకుకు వెళ్తుంది. అక్కడ కేవలం ఒక ఖాతా తెరవడానికి లేదా నామినీ పేరు మార్చడానికి వెళ్తే, అక్కడి సిబ్బంది 'మ్యారేజ్ సర్టిఫికెట్' అడుగుతారు. ఇది నిజంగా విడ్డూరం కాదా..? చట్టపరంగా భద్రత కోసమే అయినా, సైకలాజికల్ కోణంలో చూస్తే "నువ్వు ఎంత ఎదిగినా, నీకంటూ ఒక సొంత సంపాదన ఉన్నా... ఒక పురుషుడితో నీకున్న వివాహ బంధం రుజువైతేనే కానీ ఈ సమాజంలో నీ ఉనికికి విలువ లేదు" అని పరోక్షంగా హెచ్చరించినట్లే కదా..!? అంతేకాదు పెళ్లయ్యాక పాస్‌పోర్ట్ కోసం వెళ్లినప్పుడు లేదా ఉద్యోగ పత్రాలలో మార్పుల కోసం చూసినప్పుడు, భర్త సంతకమో, మ్యారేజ్ సర్టిఫికెట్టో తప్పనిసరి అంటారు. స్త్రీ చదువుకు, ఆమె ప్రతిభకు లేని విలువ, కేవలం ఒకరి భార్యగా మారినప్పుడే వస్తుందా అనే ఘర్షణ ప్రతి ఆధునిక మహిళా హృదయంలోనూ నడుస్తూనే ఉంది.

ఆలుమగల సంబంధం అనేది ప్రపంచంలోనే అత్యంత సంక్లిష్టమైనది, అదే సమయంలో అత్యంత మధురమైనది. రెండు వేర్వేరు వాతావరణాల్లో పెరిగిన ఇద్దరు వ్యక్తులు జీవితాంతం కలిసి నడవడమే వివాహం. దీనికి కేవలం ఒక సర్టిఫికెట్ సరిపోతుందా..? చట్టం ఇచ్చే సర్టిఫికెట్ ఇద్దరు వ్యక్తులను ఒకే ఇంట్లోకి చేర్చగలదు, సామాజికంగా భార్యాభర్తలుగా ముద్ర వేయగలదు. కానీ, వారి మనసులను కలపలేదు. నిజమైన ఆలుమగల బంధం అనేది ఒకరినొకరు అర్థం చేసుకోవడంలో, ఒకరి లోపాలను మరొకరు సానుభూతితో అంగీకరించడంలో ఉంటుంది. ఏ బంధంలోనైతే కేవలం 'బాధ్యత' లేదా 'చట్టపరమైన బంధనం' మాత్రమే ఉండి 'ప్రేమ, గౌరవం' కరువవుతాయో, అక్కడ వివాహం ఒక యాంత్రికమైన బతుకుగా మారిపోతుంది. మన సామాజిక నిర్మాణంలో పెళ్లి అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత విషయం కాదు, అదొక బలమైన సామాజిక వ్యవస్థ. సమాజం ఎప్పుడూ ఒక స్త్రీని ఒంటరిగా లేదా స్వతంత్రంగా చూడటానికి అంత సులభంగా ఇష్టపడదు. ఆమెకు ఒక 'రక్షణ' లేదా ఒక 'సామాజిక చిరునామా' కావాలని కోరుకుంటుంది. ఆ చిరునామానే 'వివాహం'. ఇక్కడ మనం రెండు కోణాలను గమనించాలి. సమాజం దృష్టిలో వివాహ సర్టిఫికెట్ అనేది స్త్రీకి ఒక భద్రతా కవచం. ఆ కాగితం ఉంటేనే ఆమెకు సామాజిక హోదా దక్కుతుంది, రేపు పుట్టబోయే పిల్లలకు చట్టబద్ధత లభిస్తుంది, ఆర్థికపరమైన హక్కులు వస్తాయి. కానీ స్త్రీ అంతరంగం నుంచి చూస్తే, సమాజం నిర్దేశించిన ఈ భద్రత ఒక్కోసారి ఆమెకు ఊపిరాడకుండా చేస్తుంది. సమాజం కేవలం 'వ్యవస్థ' నిలబడిందా లేదా అని చూస్తుంది తప్ప, ఆ వ్యవస్థ లోపల ఉన్న 'మనుషులు' సంతోషంగా ఉన్నారా లేదా అని అడగదు. సమాజం కోసం, చేతిలో ఉన్న సర్టిఫికెట్ కోసం ఒకే ఇంట్లో అపరిచితుల్లా బతుకుతూ, లోపల నరకం అనుభవించే స్త్రీలు ఎందరో ఉన్నారు. కాబట్టి, సామాజిక ఆమోదం అవసరమే కావచ్చు, కానీ అదే జీవిత పరమావధి కాలేదు.



నేడు ఈ సమాజంలో ప్రతి చోటా మహిళా సొంత పేరు కంటే, 'ఫలానా వారి భార్య' అనే ట్యాగ్ లైన్ కోసమే వ్యవస్థ ప్రాకులాడుతుంది. భర్త నీడలో, అతని గుర్తింపు వెనుక దాక్కొని బతకడం కాదు... భర్తతో సమానంగా, పక్కపక్కన నడవడం స్త్రీ కోరుకునే అసలైన ఐడెంటిటీ. ఏ రోజైతే ఒక పురుషుడు తన భార్యను 'తన ఆధీనంలో ఉన్న ఆస్తి'గా కాకుండా, ఒక 'స్వతంత్ర వ్యక్తి'గా గుర్తిస్తాడో, ఆ రోజే ఆ వివాహ బంధంలో స్త్రీ అస్తిత్వానికి నిజమైన రక్షణ దక్కుతుంది. చివరగా చెప్పేదేమిటంటే వివాహ సర్టిఫికెట్ అనేది సమాజంతో, చట్టంతో, బ్యాంకులతో వ్యవహరించడానికి అవసరమైన ఒక అధికారిక సాక్ష్యం మాత్రమే. అది కేవలం ఒక ఆరంభం. కానీ జీవిత ప్రయాణంలో అది మాత్రమే ఫైనల్ కానే కాదు. కాగితం మీద సంతకాలు ఎన్ని ఉన్నా, ఒకరి మనసులో ఒకరికి స్థానం లేనప్పుడు, ఒకరినొకరు గౌరవించుకోలేనప్పుడు ఆ బంధం శూన్యం. సమాజపు విడ్డూరాల కోసం, చట్టాల కోసం సర్టిఫికెట్లు అవసరమే కావచ్చు... కానీ, ఇద్దరు మనుషులు ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకుని, ఒకరి ఎదుగుదలలో మరొకరు తోడుగా నిలుస్తూ సాగించే సజీవ ప్రయాణమే వివాహ బంధానికి అసలైన, అత్యంత శక్తివంతమైన 'ఫైనల్' రూపం..!



కస్తూరిదారా

# థైరాయిడ్ తో
## 42 మిలియన్ల భారతీయులు

25 మే 1965న ఏర్పడిన 'యూరోపియన్ థైరాయిడ్ అసోసియేషన్'కు గుర్తుగా ప్రతి ఏటా 25 మే రోజున 'ప్రపంచ థైరాయిడ్ దినం' నిర్వహిస్తూ, థైరాయిడ్ రుగ్మతలకు గల కారణాలను, నివారణ మార్గాలను, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం జరుగుతున్నది. 25 నుంచి 31 మే వరకు ప్రతి ఏట 'అంతర్జాతీయ థైరాయిడ్ అవగాహన వారం' కూడా నిర్వహించడం అనవాయితీగా మారింది. 25 మే 2008 నుండి ప్రారంభమైన ప్రపంచ థైరాయిడ్ దినం వేదికగా థైరాయిడ్ రుగ్మతలు, జాగ్రత్తల పట్ల ప్రజల్లో అవగాహన కోసం ప్రసార మాధ్యమాలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమ వేదికలు, సభలు, సమావేశాలు, చర్చలు, విద్యాలయాల్లో పోటీలు లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. సీతాకోక చిలుక ఆకారంలో ఉన్న థైరాయిడ్ వినాళ గ్రంథి మానవ మెడ కింది భాగంలో ఉంటుంది. ఎండోక్రైన్ వ్యవస్థలో భాగమైన థైరాయిడ్ గ్రంథిలో రెండు రెక్కల్లాంటి ఆకారాలను 'లోబ్చ' అని, వాటిని కలిపే కణజాలాన్ని 'థైరాయిడ్ ఇస్తుమస్' అని అంటారు. శరీరంలో జరిగే జీవక్రియలను నియంత్రించే 64 (థైరాక్సిన్), టి3 (ట్రై అయొడో థైరోనిన్) మరియు పెప్టెడ్ హార్మోన్ అనబడే కాల్సిటోనిన్ హార్మోన్లను స్రవిస్తుంది. థైరాయిడ్ హార్మోన్లతో సక్రమ జీవ క్రియ రేటు, గుండె పనితనం, మహిళల్లో రుతు చక్ర నియంత్రణ, కండర మరియు జీర్ణ క్రియ విధులు, మెదడు అభివృద్ధి, ఎముకల పటిష్టత, ప్రోటీన్ సంశ్లేషణం, పిల్లల శారీరక అభివృద్ధి లాంటి ముఖ్య విధులను నిర్వహిస్తాయి. మెదడు కింది భాగాన ఉన్న పిట్యూటరీ గ్లాండ్ స్రవించే క్రియాశీలత ఆధారపడి ఉంటుంది. థైరాయిడ్ హార్మోన్లు అవసరం కన్న అధికంగా లేదా తక్కువగా స్రవించడం వల్ల పలు రుగ్మతలు కలుగుతాయి. అయోడిన్ లోపంతో థైరాయిడ్ వాపు (థైరాయిడిటిస్), గాయిటర్ (థైరాయిడ్ ఎన్లార్జ్ మెంట్), థైరాయిడ్ నోడ్యూల్స్, కాన్సరస్ ట్యూమర్, థైరాయిడ్ సర్జరీ, జెనెటిక్ ప్రీడిస్పొజిషన్, ఆటో ఇమ్యున్ గ్రేవ్స్ డిసీజ్, కాంజెనిటల్ సమస్యలు, థైరాయిడ్ స్టార్మ్ లాంటివి థైరాయిడ్ రుగ్మతలకు కారణం అవుతాయి. థైరాయిడ్ గ్రంథి అతి చురుకుగా పని చేసినప్పుడు 'హైపర్ థైరాయిడిజమ్' రుగ్మత కలిగి చెమట పట్టడం, ఆందోళనలు, రుతు స్రావం తగ్గడం, ఆకలి పెరగడం లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. థైరాయిడ్ గ్రంథి చురుకుదనం అతిగా తగ్గితే ఆహారం, పాల ఉత్పత్తులు, అయొనైజ్డ్ 'హైపోథైరాయిడిజమ్' రుగ్మత కలిగి బరువు తగ్గడం, ఒత్తిడి పెరగడం అతిగా రుతుస్రావం లాంటి లక్షణాలు కలుగుతాయి. ఆకలి పెరగడం లాంటి రోగ లక్షణాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. భారత దేశ జనాభాలో 42మిలియన్ల ప్రజలు థైరాయిడ్ రుగ్మతలతో బాధ పడుతున్నారు. థైరాయిడ్ రుగ్మతల్లో హైపర్ థైరాయిడిజమ్, హైపో థైరాయిడిజమ్, గాయిటర్, థైరాయిడ్ కాన్సర్, థైరాయిడిటిస్ లాంటి రుగ్మతలు ముఖ్యమైనవి. థైరాయిడ్ రుగ్మత ఉందని తెలియని ప్రజలు కూడా అసంఖ్యాకంగా ఉండటం విచారకరం. ఉత్తర భారతంలో హైపో థైరాయిడిజమ్ రుగ్మత అధికంగా బయట పడుతున్నది. ప్రతి 8మంది మహిళల్లో ఒకరికి థైరాయిడ్ సమస్య టి ఎస్ హెచ్ ఉందని అంచనా... అయోడిన్ లోపం వల్ల గాయిటర్ వ్యాధి 200 మిలియన్ ప్రజల్లో ఉందని తేలింది. థైరాయిడ్ సంబంధ వ్యాధి నిర్ధారణకు టి3, టి4 మరియు టియసాచ్ హార్మోన్ల స్థాయిని నిర్ధారిస్తారు. కాల్సిటోనిన్ స్థాయిని బట్టి థైరాయిడ్ కాన్సరు నిర్ణయిస్తారు. థైరాయిడ్ రుగ్మతలకు చికిత్సలుగా థైరాయిడ్ సర్జరీ, మెడికేషన్, రేడియో ఆక్టివ్ అయోడిన్, రేడి యేషన్, హార్మోన్ పిల్స్, రీకాంబినంట్ హుమన్ టియస్ హెచ్ విధానాలను వాడతారు. థైరాయిడ్ సమస్యలకు విరుగుడుగా ప్రోటీన్, కాల్సియమ్, అయోడిన్, మెగ్నీసియం, విటమిన్ల ఆహారాన్ని తీసుకునేలా జీవన శైలిని అలవర్చుకోవాలి.

సంగనబట్ల
9440595494





# జాతీయం-అంతర్జాతీయం






## మహారాష్ట్ర అసెంబ్లీ గరంగరం

### రైతుల భూములపై ప్రతిపక్షాల ఆందోళన

**ముంబయి, జూన్ 22 (ఎ.ఎం.ఎస్):** మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో తొలిరోజైన సోమవారం ప్రతిపక్షాలు ఆందోళన బాటపట్టాయి. ఫడ్నవీస్ ప్రభుత్వం, రైతుల 7/12 భూమి రికార్డులను సరి చేయాలని శివసేన (యూబీటీ), ఎమ్మెల్యే ఆదిత్య థాకరే, కాంగ్రెస్ నాయకుడు విజయ్ వడెట్టివార్ ఇతర నాయకులు మరాఠీలో నినాదాలు చేశారు. జూన్ 2న, మహారాష్ట్ర మంత్రివర్గం 'పుణ్యశ్లోక్ అహల్యాదేవి హోల్కర్ రైతు రుణ విముక్తి పథకం'కు ఆమోదం తెలిపిందని, కానీ ప్రస్తుతం రూ. 2 లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేయకుండా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. బ్యానర్ చేతబూని అసెంబ్లీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**లక్నో, జూన్ 22**: ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలోని ఓ కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది . ఈ ఘటనలో పలువురు విద్యార్థులు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. కొందరు తమ ప్రాణాలను కాపాడుకొనేందుకు భవనం పైఅంతుస్తుల నుంచి కిందికి దూకారు. ఈ ప్రమాద దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. లఖ్‌నవూలోని అలీగంజ్ ప్రాంతంలోని మూడంతస్తుల భవనం కిందిభాగంలో తొలుత మంటలు చెలరేగాయి. తర్వాత పైఅంతస్తులో ఉన్న కోచింగ్ సెంటర్‌కు ఎగబాకాయి. భవనమంతా మంటల్లో చిక్కుకుపోవడంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు అలముకున్నాయి. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని, లోపల ఎంతమంది చిక్కుపోయారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని అధికారులు వెల్లడించారు.

### విజయ్ బాటలోనే

## చేతన్ అహింసా..

- కర్నాటకలో త్వరలో కొత్త పార్టీ
- 2028 ఎన్నికల్లో పోటీకి సిద్ధమంటూ ప్రకటన



**బెంగళూరు,జూన్ 22 (ఎ.ఎం.ఎస్):** కన్నడ చిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకుని, గత కొంతకాలంగా సామాజిక అంశాలపై నిరంతరం గళమెత్తుతున్న సామాజిక కార్యకర్త చేతన్ అహింసా.. తమిళనాడు సీఎం విజయ్ బాటలో నడుస్తున్నారు. ముఖ్యంగా ఆయనలాగే ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. కర్ణాటకలో ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను మార్చేందుకే తాను రాజకీయాల్లోకి వస్తున్నాని చెబుతూ.. సరికొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. అంతేకాకుండా రాబోయే 2028 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 224 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు.

తాను రాజకీయ పార్టీని ప్రకటించబోతున్నట్లు.. చేతన్ అహింసా ఎక్స్ వేదికగా అధికారికంగా ప్రకటించారు. "ప్రస్తుతం కర్ణాటకలో ఉన్న అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు అవినీతిలో కూరుకుపోయాయి. ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అందుకే కర్ణాటక 2028 ఎన్నికల కోసం మేము ఒక సరికొత్త అవినీతి రహిత రాజకీయ పార్టీని నిర్మిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్థానాల్లోనూ ప్రజా పక్షాన నిలిచే అభ్యర్థులను నిలబెడతాం" అని ఆయన పేర్కొన్నారు. 'ఆ దినగలు', 'మైనా' వంటి విజయవంతమైన చిత్రాలతో కన్నడ ప్రేక్షకులకు దగ్గరైన చేతన్.. గత కొన్నేళ్లుగా సినిమాల కంటే సామాజిక ఉద్యమాల్లోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. కుల వివక్ష, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కులు, వాక్ స్వాతంత్ర్యం వంటి అంశాలపై ఆయన నిరంతరం పోరాడుతున్నారు.

చేతన్ అహింసా స్థాపించబోయే ఈ నూతన పార్టీ ప్రధానంగా 'ఉత్తర కర్ణాటక' ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించనుంది. మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనలో దశాబ్దాలుగా ఈ ప్రాంతం తీవ్ర వివక్షకు గురవుతోందని, దక్షిణ జిల్లాలతో పోలిస్తే ఉత్తర కర్ణాటక ఎంతో వెనుకబడి ఉందనే అసంతృప్తి స్థానికుల్లో బలంగా ఉంది. ఈ ప్రాంత ప్రజల గొంతుకగా నిలిచి, వారి హక్కుల సాధన కోసం తమ పార్టీ అగ్ర ప్రాధాన్యత ఇస్తుందని చేతన్ వివరించారు. కర్ణాటక రాజకీయాల్లో కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ వంటి దిగ్గజ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు గతంలో చాలామంది ప్రముఖులు ప్రయత్నించినప్పటికీ.. ఆ ప్రయత్నాలు పెద్దగా సఫలం కాలేదు. ఈ నేపథ్యంలో చేతన్ అహింసా అడుగులు ఏ మేరకు ప్రభావం చూపుతాయనేది ఆసక్తికరంగా మారింది.

సామాజిక అంశాలపై చేతన్ చేసే వ్యాఖ్యలు ఆయన్ను పలుమార్లు వివాదాల్లోకి నెట్టాయి. 2021లో బ్రాహ్మణత్వానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యల కారణంగా ఆయన అరెస్ట్ అయ్యారు. ఆ తర్వాత 2022లో కర్ణాటకలో తీవ్ర దుమారం రేపిన హిజాబ్ వివాదం సమయంలో హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినందుకు గానూ పోలీసులు ఆయనను రెండోసారి అదుపులోకి తీసుకున్నారు. ఈ వివాదాల తీవ్రత కారణంగా 2023లో కేంద్ర ప్రభుత్వం ఆయనపై 'దేశ వ్యతిరేక కార్యకలాపాల' ఆరోపణలు మోపుతూ.. ఆయనకు ఉన్న ఓవర్సీస్ సిటిజన్ షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) హోదాను రద్దు చేసింది. అయితే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని చేతన్ కోర్టులో సవాలు చేశారు. ప్రభుత్వం తన అసమ్మతి గొంతును నొక్కేందుకే రాజకీయ ప్రేరేపితంగా ఈ చర్యకు పాల్పడిందని ఆయన గట్టిగా వాదిస్తున్నారు. ఈ అన్ని ఆటంకాలను ఎదుర్కొంటూనే.. ఇప్పుడు ఏకంగా పొలిటికల్ పార్టీ స్థాపించి ఎన్నికల బరిలోకి దిగుతుండటంతో కన్నడనాట రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది.

## ముగిసిన తొలి విడత చర్చలు

- అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై సంతకాలు పూర్తి
- ప్రత్యేక సెల్ ఏర్పాటు



స్విట్జర్లాండ్‌లోని బుర్గెన్‌స్టాక్ రిసార్ట్స్‌లో అమెరికా - ఇరాన్ మధ్య తొలి విడత ఉన్నత స్థాయి చర్చలు ముగిశాయి. వంద రోజులకు పైగా సాగిన భీకర యుద్ధం తర్వాత శాంతి ఒప్పందం కుదరడం, ఆ వెంటనే చర్చలు జరుగుతుండటం ఇరు దేశాలతో పాటు ప్రపంచ దేశాలకు కొంత సానుకూలమైన వాతావరణం అని చెప్పొచ్చు. పాకిస్థాన్, ఖతార్ మధ్యవర్తిత్వంలో జరిగిన ఈ సమావేశంలో ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గించేందుకు పలు కీAZలక నిర్ణయాలు తీసుకున్నా ఈ చర్చలను పర్యవేక్షించేందుకు ఓ హై లెవెల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చర్చల ప్రక్రియను రాజకీయ స్థాయిలో పర్యవేస్తుంది. అదేవిధంగా అణు కార్యక్రమం, ఆంక్షలు, పర్యవేక్షణ వ్యవస్థలు, వివాద పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక వర్కింగ్ గ్రూపులు పనిచేస్తాయి. అంతిమ ఒప్పందాన్ని 60 రోజుల్లో పూర్తి చేయడానికి రోడ్‌మ్యాప్‌కు కూడా కమిటీ ఆమోదం తెలిపింది. ఇరాన్ మధ్య తొలి విడత ఉన్నత స్థాయి చర్చలు ముగిశాయి. వంద రోజులకు పైగా సాగిన భీకర యుద్ధం తర్వాత శాంతి ఒప్పందం కుదరడం, . ఈ చర్చలను పర్యవేక్షించేందుకు ఓ హై లెవెల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చర్చల ప్రక్రియను రాజకీయ స్థాయిలో పర్యవేస్తుంది.

**స్విట్జర్లాండ్, జూన్ 22:** అమెరికా ఇరాన్ మధ్య తొలి విడత చర్చలు ముగిశాయి. శాంతి ఒప్పందంపై సంతకాలు పూర్తయిన తర్వాత ఇరు దేశాలు ఇప్పుడు స్విట్జర్లాండ్ వేదికగా చర్చలు చేస్తున్నాయి. తొలి విడత చర్చల్లో లెబనాన్‌లో కాల్పుల విరమణ అంశంపై ప్రస్తావించారు. దీని కోసం ఓ ప్రత్యేక సెల్ కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా హోర్ముజ్ నుంచి వెళ్లే వాణిజ్య నౌకలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని నిర్ణయించారు. కీలకమైన అణు ఒప్పందంపై సుదీర్ఘ చర్చలు సాగే అవకాశం ఉంది. స్విట్జర్లాండ్‌లోని బుర్గెన్‌స్టాక్ రిసార్ట్స్‌లో అమెరికా ఇరాన్ మధ్య తొలి విడత ఉన్నత స్థాయి చర్చలు ముగిశాయి. వంద రోజులకు పైగా సాగిన భీకర యుద్ధం తర్వాత శాంతి ఒప్పందం కుదరడం, ఆ వెంటనే చర్చలు జరుగుతుండటం ఇరు దేశాలతో పాటు ప్రపంచ దేశాలకు కొంత సానుకూలమైన వాతావరణం అని చెప్పొచ్చు. పాకిస్థాన్, ఖతార్ మధ్యవర్తిత్వంలో జరిగిన ఈ సమావేశంలో ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ చర్చలను పర్యవేక్షించేందుకు ఓ హై లెవెల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చర్చల ప్రక్రియను రాజకీయ స్థాయిలో పర్యవేస్తుంది.

అదేవిధంగా అణు కార్యక్రమం, ఆంక్షలు, పర్యవేక్షణ వ్యవస్థలు, వివాద పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక వర్కింగ్ గ్రూపులు పనిచేస్తాయి. అంతిమ ఒప్పందాన్ని 60 రోజుల్లో పూర్తి చేయడానికి రోడ్‌మ్యాప్‌కు కూడా కమిటీ ఆమోదం తెలిపింది.

చర్చల సమయంలో ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా హోర్ముజ్ జలసంధి భద్రతకు ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

దీని ప్రధాన లక్ష్యం హోర్ముజ్ నుంచి వెళ్లే వాణిజ్య నౌకలను సురక్షితంగా గమ్యస్థానం చేర్చడం. అదేవిధంగా సముద్ర మార్గంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా చూడటం. తొలి విడత చర్చల్లో ప్రధానంగా లెవనెత్తిన అంశం లెబనాన్‌లో కాల్పుల విరమణ. లెబనాన్‌లో సైనిక చర్యల విరమణను అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఓ సెల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సెల్‌లో చర్చల్లో పాల్గొంటున్న ఇరుపక్షాలు, లెబనాన్ ప్రభుత్వం కూడా భాగస్వాములుగా ఉండనున్నాయి. దీనికి ఖతార్, పాకిస్థాన్ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తాయి. అమెరికా ఇరాన్ మొదటి విడత సమావేశాలు ముగిసినప్పటికీ చర్చలు ఇంకా కొనసాగనున్నాయి. ముఖ్యంగా అణు ఒప్పందం, ఆంక్షలు, భద్రతా అంశాలపై సాంకేతిక స్థాయి చర్చలు ఈ వారం మొత్తం బర్గెన్‌స్టాక్‌లో కొనసాగనున్నాయి. ఈ మేరకు ఇరు దేశాలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపాయి.

ఈ చర్చల ప్రధాన ఉద్దేశం మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో శాంతిని నెలకొల్పడమేనని అధికారులు తెలిపారు.

- బీహార్ లో పట్టుబడ్డ 9 మంది
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు



## నీట్‌లో నకిలీ అభ్యర్థులు

**పాట్నా, జూన్ 22(ఎ.ఎం.ఎస్):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ వైద్య విద్యా ప్రవేశ పరీక్షల వివాదాలు సమిసిపోయి.. మళ్లీ పరీక్ష నిర్వహించింది ఎన్టీఏ. అయితే దురదృష్టవశాత్తు ఈ రీ ఎగ్జామ్‌లోనూ అక్రమార్కులు తమ పంథా మార్చుకోలేదు. బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద నిర్వహించిన పకడ్బందీ తనిఖీల్లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. అసలైన విద్యార్థులకు బదులుగా పరీక్షలు రాసేందుకు రంగంలోకి దిగిన 'సాల్వర్ గ్యాంగ్' (నకిలీ అభ్యర్థుల ముఠా) నెట్‌వర్క్‌ను జిల్లా యంత్రాంగం, పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. వివిధ పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్, ఐడెంటిటీ వెరిఫికేషన్ సమయంలో దొరికిపోయిన 9 మంది నకిలీ అభ్యర్థులు సహా ఈ మోసంతో సంబంధం ఉన్న మొత్తం 30 మందిని అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. లఖిసరాయ్ జిల్లాలోని వేర్వేరు పరీక్షా కేంద్రాల్లో పక్కా సమాచారంతో అధికారులు ఏకకాలంలో ఈ తనిఖీలు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. కేఆర్కే హైస్కూల్ పరీక్షా కేంద్రం నుంచి ఒకరు, కేంద్రీయ విద్యాలయ కేంద్రం నుంచి అత్యధికంగా ఏడుగురు, అలాగే హసన్‌పూర్ స్కూల్ పరీక్షా కేంద్రం నుంచి మరొక నకిలీ అభ్యర్థిని అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్ట్ అయిన ఈ తొమ్మిది మంది నిందితులు బీహార్‌లోని విభిన్న జిల్లాలకు చెందిన వారని, అసలు అభ్యర్థుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని, వారి స్థానంలో పరీక్ష రాయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

కేవలం పరీక్ష రాస్తున్న వారినే కాకుండా, కేంద్రాల వెలుపల ఉంటూ వారికి సాంకేతిక సాయం అందిస్తున్న, అలాగే అభ్యర్థులను చేరవేస్తున్న ముఠా సభ్యులపై కూడా పోలీసులు ఉక్కుపాదం మోపారు. మాల్‌ప్రాక్టీస్, పరీక్షా మోసాలకు సహకరించిన మొత్తం 21 మందిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని అదుపులోకి తీసుకోగా.. ఈ ముఠా వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ప్రస్తుతం లఖిసరాయ్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ప్రభాకర్ కుమార్, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శివం కుమార్‌ల ప్రత్యక్ష పర్యవేక్షణలో నిందితులను రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. "నీట్ పునఃపరీక్షలో అక్రమాలకు పాల్పడుతూ 30 మంది దొరికిపోయారు. అందులో 9 మంది ఒకరి బదులు మరొకరు ఎగ్జామ్ రాస్తుండగా.. 21 మంది వీరికి వ్యూహాత్మకంగా సహకరించినట్లు తేలింది" అని ఎస్డీపీఓ శివం కుమార్ ధృవీకరించారు.

విచారణలో నిందితులు వెల్లడించిన వివరాల ఆధారంగా లఖిసరాయ్ జిల్లా వ్యాప్తంగా, పొరుగు జిల్లాల్లోనూ ప్రత్యేక పోలీసు బృందాలు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నాయి. ఈ ఆపరేషన్‌ను జిల్లా కలెక్టర్ శైలేంద్ర కుమార్, ఎస్పీ ప్రేరణా కుమార్‌లు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. 24 గంటలూ కష్టపడి చదివే విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఈ ముఠా వెనుక కొంతమంది కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు, విద్యాశాఖ అధికారుల హస్తం కూడా ఉండవచ్చని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, పూర్తి నెట్‌వర్క్ వివరాలను త్వరలోనే మీడియాకు అధికారికంగా వెల్లడిస్తామని యంత్రాంగం పేర్కొంది.

## బ్రిటన్ ప్రధాని స్టార్మర్ రాజీనామా

- లేబర్ పార్టీలో వ్యతిరేకతతో నిర్ణయం
- డౌనింగ్ స్ట్రీట్ ప్రకటనలో వెల్లడి



**లండన్, జూన్ 22:** బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. కొంతకాలంగా పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు, అధికార లేబర్ పార్టీలో వత్యిరేకతతో పదవి నుంచి తప్పుకోవాలని స్టార్మర్ నిర్ణయించుకున్నారు. దీంతో అధికార లేబర్ పార్టీలో నెలకున్న విబేధాలు కొత్త మలుపు తీసుకున్నాయి. యూకే ప్రధాని కార్యాలయం డౌనింగ్ స్ట్రీట్ విడుదల చేసిన ఒక ప్రకటనలో.. "తన నిర్ణయం గురించి రాజుకు తెలియజేశాను... తదుపరి ప్రధానిని ఎన్నుకునే వరకు పదవిలో కొనసాగుతాను" స్టార్మర్ తెలిపారు. 10డౌనింగ్ స్ట్రీట్ వెలుపల స్టార్మర్ మాట్లాడుతూ.. తన నాయకత్వంపై వ్యతిరేకత, పార్టీలో తలెత్తిన అంతర్గత విబేధాలను అంగీకరించారు. " లేబర్ పార్టీ ని ముందుకు నడిపించడానికి ఎవరు అత్యంత సమర్థులు అనేదే ఇప్పుడు అడుగుతున్న ప్రశ్న అని నాకు తెలుసు. రాబోయే ఎన్నికలలో పార్టీకి నాయకత్వం వహించడానికి నేను సరైన స్థానంలో ఉన్నానా లేదా అని పార్టీ అడుగుతోంది....నా పార్టీ సహచరుల నుంచి నేను ఆ సమాధానం విన్నాను, దానిని నేను అంగీకరిస్తున్నాను. నేను తీసుకున్న ప్రతి నిర్ణయం నేను ప్రేమించే దేశానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడానికే. అందుకే నేను లేబర్ పార్టీ నాయకుడిగా రాజీనామా చేస్తున్నాను..."అని తెలిపారు. "నా నిర్ణయం గురించి రాజుకు తెలియజేశాను.. సెప్టెంబరులో జరిగే తదుపరి పార్లమెంట్ సమావేశానికి ముందే కొత్త నేత బాధ్యతలు స్వీకరించేలా ప్రక్రియను ప్రారంభించమని పార్టీ జాతీయ కార్యవర్గాన్ని కోరతాను... లేబర్ పార్టీ రెండోసారి అధికారంలోకి రావడానికి దోహదపడేలా, మరింత బలమైన బ్రిటన్‌ను నా వారసుడు వారసత్వంగా పొందుతాడని నాకు తెలుసు.. అందుకు పూర్తి మద్దతు ఇస్తాను. నాకు మద్దతు ఇచ్చిన నా సహచరులందరికీ ధన్యవాదాలు" అని ఆయన అన్నారు. వరుస రాజకీయ ఎదురుదెబ్బలు, తగ్గుతున్న ప్రజా మద్దతు, లేబర్ పార్టీలో నాయకత్వ మార్పు కోసం పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో స్టార్మర్ భవిష్యత్తుపై సాగుతున్న ఊహాగానాల నడుమ ఆయన నుంచి రాజీనామా ప్రకటన వెలువడింది. 2024 ఎన్నికల్లో లేబర్ పార్టీని విజయం దిశగా నడిపించిన స్టార్మర్.. 14 ఏళ్ల కన్జర్వేటివ్ పాలనకు ముగింపు పలికి ప్రధాన మంత్రి అయ్యారు. ఆయన ప్రభుత్వానికి మొదట్లో భారీ ప్రజా మద్దతు లభించినప్పటికీ, ఆ తర్వాత ఆర్థిక వ్యవస్థ, ప్రజా సేవలు, పార్టీ అంతర్గత విభేదాల విషయంలో సవాళ్లను ఎదుర్కొంది. స్టార్మర్ వారసుడిగా ఆండీ బర్న్‌హామ్ పగ్గాలు చేపట్టే అవకాశం ఉంది. లేబర్ పార్టీలో బర్నహామ్‌కు మద్దతు ఇస్తున్న ఎంపీల సంఖ్య 300కు చేరుకుందని ది గార్డియన్ నివేదించింది. ఇక, జులై 2024లో కీర్ స్టార్మర్ యూకే ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. బ్రిటన్ 58వ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పుడు మార్పు తీసుకువస్తానని స్టార్మర్ వాగ్దానం చేశారు. తన మొదటి ప్రసంగంలో మాజీ ప్రధాని రిషి సునక్ అంకితభావం, కృషిని కొనియాడారు. ఇదిAలా ఉండగా, పదవి నుంచి వైదొలగాలంటూ కీర్ స్టార్మర్‌పై కొన్నిరోజులుగా ఒత్తిడి పెరుగుతోంది. దీంతో ఆయన రాజీనామా చేస్తారనే ప్రచారం జరిగింది. లేబర్ పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గతుండగా.. నైజెల్ ఫరాజ్ నేతృత్వంలోని రిఫార్మ్ యూకే పార్టీకి భారీగా ఆదరణ పెరుగుతున్నట్లు సర్వేలు వెల్లడించాయి.

## కాంగ్రెస్ శ్రేణులపై ఖర్గే ఫైర్

- డీకే మద్దతుదారులపై ఆగ్రహం
- సభలో నినాదాలు చేసిన వారిపై అసహనం




**బెంగళూరు, జూన్ 22(ఎ.ఎం.ఎస్):** కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, ఆధిపత్య పోరు మరోసారి బహిర్గతం అయ్యాయి. పార్టీ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా బి.కె. హరిప్రసాద్ ప్రమాణ స్వీకార మహోత్సవ వేదికపైనే హైడ్రామా చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ మద్దతుదారులు సభలో నినాదాలు చేస్తూ రచ్చ చేయడంతో.. ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా అసహనం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ తప్పి ప్రవర్తిస్తున్న సొంత పార్టీ కార్యకర్తలపై స్టేజ్ పైనే మైకులో విరుచుకుపడ్డారు. "నోరు మూస్కుని కూర్చోండి.. దేశమంతా మీ చేతుల్లోకే వచ్చేసినట్లు ప్రవర్తిస్తున్నారు. పనికిమాలిన వెధవల్లారా" అంటూ ఖర్గే తీవ్ర పదజాలంతో మండిపడటం ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. ముఖ్యంగా ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కర్ణాటక కాంగ్రెస్ నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం బెంగళూరులో అట్టహాసంగా ప్రారంభమైంది. వేదికపై జాతీయ, రాష్ట్ర స్థాయి సీనియర్ నాయకులంతా ఆసీనులయ్యారు. అయితే కార్యక్రమం సాగుతున్న సమయంలో ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ అనుకూల వర్గానికి చెందిన కొందరు కార్యకర్తలు ఒక్కసారిగా లేచి 'డీకే.. డీకే..' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేయడం ప్రారంభించారు. దీనివల్ల సభాప్రాంగణంలో తీవ్ర గందరగోళం నెలకొంది. కార్యకర్తల అతి ఉత్సాహం చూసి విసిగిపోయిన మల్లికార్జున ఖర్గేకు చిర్రెత్తుకొచ్చింది. వేదికపై ఉన్న సీఎం డి.కె. శివకుమార్ స్వయంగా లేచి, కార్యకర్తలను శాంతించాల్సిందిగా చేతులు జోడించి సైగలు చేసినప్పటికీ వారు వినలేదు. తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఖర్గే మైక్ అందుకుని క్యాడర్‌కు గట్టి క్లాస్ పీకారు. "ఇది కాంగ్రెస్ పార్టీ అధికారిక కార్యక్రమం. ఎవరో ఒక్క వ్యక్తి కోసం ఏర్పాటు చేసిన వ్యక్తిగత సభ కాదు. పార్టీని బలోపేతం చేయడానికి, అందరినీ ఏకం చేయడానికి మేమంతా ఇక్కడికి వచ్చాం. ఒకరు ఒకరి పేరు, ఇంకొకరు మరొకరి పేరు అరుస్తూ కూర్చుంటే.. ఇక్కడికి వచ్చిన మిగతా నాయకులు, ప్రజలు ఏమైనా చెత్త ఊడ్వడానికి వచ్చారా?" అంటూ తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. తన సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని గుర్తు చేస్తూ.. పార్టీ వల్లే మీకంటూ ఒక గుర్తింపు ఉందన్న విషయాన్ని మరవద్దని హెచ్చరించారు.

ఈ రచ్చ వెనుక కర్ణాటక కాంగ్రెస్‌లో గత కొంతకాలంగా సాగుతున్న అధికార మార్పిడే అని తెలుస్తోంది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినప్పటి నుంచి సిద్ధరామయ్య, డి.కె. శివకుమార్ మధ్య సీఎం కుర్చీ కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఆ సమయంలో అధిష్టానం రెండున్నరేళ్ల 'రొటేషనల్ ఫార్ములా' (ముఖ్యమంత్రి మార్పిడి ఒప్పందం) ప్రతిపాదించి సిద్ధరామయ్యకు తొలి అవకాశం ఇచ్చింది. గత ఏడాది నవంబర్‌లో ఆ గడువు ముగియడంతో డీకే క్యాంప్ ఢిల్లీపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. దాంతో హైకమాండ్ దిగివచ్చి.. మే 28వ తేదీన సిద్ధరామయ్య చేత రాజీనామా చేయించి, జూన్ మొదటి వారంలో డి.కె. శివకుమార్‌ను సీఎంగా కూర్చోబెట్టింది. అయితే ఈ గొడవలు, సమస్యలు అన్నింటినీ ఆపేసి.. 2028 మేలో రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీAని సిద్ధం చేయాలని అధిష్టానం భావిస్తోంది. ఇలాంటి తరుణంలో కార్యకర్తలు గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడంపై ఖర్గే సీరియస్ అయ్యారు.

## టెక్నాలజీ విధ్వంసం..

- ఇంట్లోకి దూసుకొచ్చిన కారు వృద్ధురాలు దుర్మరణం



**టెక్సాస్, జూన్ 22:** ఆధునిక సాంకేతికత, సెల్ఫ్ డ్రైవింగ్ ఫీచర్లు మానవ జీవితాలను మరింత సులభతరం చేస్తున్నాయని భావిస్తున్న తరుణంలో.. అదే టెక్నాలజీ ఎంతటి విధ్వంసాన్ని సృష్టింగలదో చూపించిందో ఘటన. ముఖ్యంగా ఓ 76 ఏళ్ల వృద్ధురాలి ప్రాణాలు పోయేందుకు ఈ టెక్నాలజీయే కారణం అయింది. అమెరికాలోని టెక్సాస్ స్టేట్‌లో అటోపైలట్ మోడ్‌లో ఉన్న ఒక టెస్లా కారు నియంత్రణ కోల్పోయి.. ఇంట్లోకి దూసుకెళ్లింది. రోడ్డుపై వెళ్లాల్సిన వాహనం ఏకంగా ఇటుక గోడలను బద్దలు కొట్టుకుంటూ బెడ్రూమ్‌లోకి దూసుకురావడంతో.. ఈ దుర్ఘటనలో వృద్ధురాలు చనిపోయింది.

హారిస్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో హ్యూస్టన్‌కు పశ్చిమంగా 30 మైళ్ల దూరంలో ఉన్న కేటీ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. మైకేల్ బట్లర్ అనే వ్యక్తి తన టెస్లా మోడల్ 3 కారులో రోడ్డుపై ప్రయాణిస్తున్నాడు. అయితే ఆ సమయంలో ఆయన కారును 'ఆటోమేటెడ్ డ్రైవింగ్ అసిస్టెన్స్ సిస్టమ్' (అటోపైలట్) మోడ్‌లో ఉంచాడు. ఈక్రమంలోనే కారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి, అత్యంత వేగంగా రోడ్డు పక్కన ఉన్న ఒక ఇంటి వైపు దూసుకెళ్లింది. కారు వేగానికి ఇంటి ముందున్న ఇటుక గోడలు పూర్తిగా ధ్వంసమై.. కారు నేరుగా ఇంట్లోకి చొరబడింది. ముఖ్యంగా బెడ్రూమ్‌లోకి కారు దూసుకెళ్లగా.. అక్కడే నిలబడి ఉన్న మార్తా అవిలా అనే 76 ఏళ్ల వృద్ధురాలు ప్రమాదానికి గురైంది. కారు బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది.

ప్రమాద తీవ్రతకు తీవ్రంగా గాయపడిన మార్తా అవిలాను వెంటనే మెడికల్ హెలికాప్టర్ ద్వారా అత్యవసరంగా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో ఆమె చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. బాధితురాలి కుమార్తె జెన్నిఫర్ బార్బర్ ఈ ప్రమాదానికి సంబంధించిన భయంకరమైన సీసీటీవీ విజువల్స్‌ను తన ఫేస్‌బుక్ ఖాతాలో షేర్ చేస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "ఆ టెస్లా డ్రైవర్ మా ఇంట్లోకి దూసుకొచ్చిన దృశ్యమిది. మా అమ్మకు ఇలాంటి ఘోర చావు రావాల్సింది కాదు. 76 ఏళ్ల వయసులోనూ ఆమె ఎలాంటి మందులు వాడకుండా ఎంతో ఆరోగ్యంగా ఉండేది. మా నానమ్మలాగే అమ్మ కూడా వందేళ్లు బతుకుతుందని అనుకున్నాం.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలి..జిల్లా కలెక్టర్



**ములుగు, జూన్ 22 (వుదయం ప్రతినిధి):**

ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వీధి ఆహార విక్రయ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సంబధిత అధికారులను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధ్యక్ష తన ఫుడ్ సేఫ్టీపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ఆహార పదార్థాల తయారీ జరిగే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆహార పదార్థాల తయారీలో పనిచేసే సిబ్బందికి ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.హాస్టళ్లలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల నీటిని క్రమం తప్పకుండా పరీక్షించి, అవి భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా వీధి ఆహార విక్రయ కేంద్రాలను ప్రతి వారం కనీసం 10 నుండి 15 వరకు తనిఖీ చేసి, ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జీ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం సంపత్ రావు, ఫుడ్ సేఫ్టీ అధికారి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## హసన్‌పర్తిలో పోలీసుల విస్తృత తనిఖీలు

### డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం : సీఐ మహేందర్



**హసన్‌పర్తి, జూన్22(వుదయం ప్రతినిధి):**

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా పోలీస్ కమిషనర్ వరంగల్ సన్ ప్రీత్ సింగ్ అదేశానుసారం సోమవారం హసన్‌పర్తి పరిధిలోని నేషనల్ హైవే 563 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల పరిసర ప్రాంతాల్లో స్థానిక పోలీసులు మరియు డాగ్ స్క్వాడ్ (Sniffer Dogs) బృందం సంయుక్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి ఇన్స్పెక్టర్ ఏ. మహేందర్ మాట్లాడుతూ...,యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని, డ్రగ్స్ రవాణా మరియు విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా స్థానిక కిరాణా షాపులు, హోటళ్లు, అనుమానాస్పద ప్రాంతాలు, వాహనాలను ప్రత్యేకంగా శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్స్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజా సహకారం అవసరమని సీఐ అన్నారు. మీ ప్రాంతంలో ఎవరైనా డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయించినా, రవాణా చేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయనీ అన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినమైన శిక్షలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, పోలీస్ సిబ్బంది, అధికారులు, డాగ్ స్క్వాడ్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దామెరలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం..

### కాంగ్రెస్ పాలనకు ప్రజలే చరమగీతం పాడతారు: కేటీఆర్



**పరకాల జూన్ 22 (వుదయం ప్రతినిధి):**

హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని ఏఎన్ఆర్ గార్డెన్స్‌లో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు.ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించిన కేటీఆర్, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోందన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. గత రెండేళ్లలో పరకాల అభివృద్ధికి ఎమ్మెల్యే చేసిన కృషి ఏమిటో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమైందని పేర్కొన్న కేటీఆర్, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రవాణా శాఖ అధికారి వెంకన్న మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే



**భూపాలపల్లి, జూన్ 22 (వుదయం విలేకరి)**

భూపాలపల్లి రవాణా శాఖ అధికారి వెంకన్న మృతి పట్ల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్లు సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం చెల్పూర్ గ్రామ సమీపంలో ఉన్న ఆర్టీఓ కార్యాలయం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో రవాణా శాఖ అధికారి వెంకన్న తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ,కొద్దిసేపటికే మృతి చెందారు. ఈ విషాదకర ఘటన గురిం చి తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వెంకన్న పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.అనంతరం ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# లారీ ప్రమాదంలో జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి వెంకన్న మృతి

### తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

### వెంకన్న మృతి చెందడంతో భావోద్వేగానికి గురైన జిల్లా కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి జూన్ 22(వుదయం జిల్లా ప్రతినిధి)**

రోడ్డు ప్రమాదంలో జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి వెంకన్న మృతిచెందారు సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అతివేగంగా వచ్చిన బొగ్గు లారీ ఘణపురం మండలం చెల్పూర్ శివారులోని ఆర్టీఓ కార్యాలయం వద్ద జరిగిన దుర్ఘటనలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న మరణించడం పట్ల రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సంఘటనపై మంత్రి హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఫోన్ చేసి ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన ఎంతో విషాదకరమని పేర్కొంటూ, మరణించిన అధికారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రహదారి భద్రతపై నెల రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమాలలో వెంకన్న చాలా చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఘటనపై తగిన విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మరణించిన వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు.జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న లారీ ప్రమాదంలో మరణించడం పట్ల జిల్లా కలెక్టర్ రాహూల్ శర్మ సంతాపం తెలిపారు. సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో రవాణాశాఖ కార్యాలయం వద్ద జరిగిన దుర్ఘటనలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న మరణించటం చాలా బాధాకరమని అన్నారు. ప్రధాన ఆసుపత్రిలో ఉంచిన వెంకన్న పార్థివ దేహాన్ని సర్కించిన కలెక్టర్ భావోద్వేగానికి గురయ్యారు. సాధారణ బదిలీలలో భాగంగా జగిత్యాల జిల్లా నుండి ఇటీవల మన జిల్లాకు బదిలీపై వచ్చిన వెంకన్న విధుల నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన అధికారిగా గుర్తింపు పొందారని తెలిపారు. అలాంటి నిబద్ధత కలిగిన అధికారిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.వెంకన్న.మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన వ్యక్తి అని, 2012లో రవాణా శాఖలో ఏఎంవిఐగా ఉద్యోగం సాధించారని తెలిపారు. ప్రమాదంలో మరణించిన వెంకన్నకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.అనంతరం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో వెంకన్న సంతాప సభ నిర్వహించి వెంకన్న చిత్రపటానికి పూల మాలలు వేసి 2 నిమిషాలు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , డిఆర్ఓ వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు పై భూతు బి ఎల్ ఓ లకు అవగాహన కల్పించిన – బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్

### ఓటు పై భూతు బి ఎల్ ఓ లకు అవగాహన కల్పించిన

### - బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### ఓటు హక్కును ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి

### ఎస్ ఐ ఆర్ పేరుతో ఓటు హక్కులను హరించే బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలి


### ప్రతి తప్పనిసరిగా ఏనుమేరేషన్ ఫారం నింపి ఓటర్ల హక్కులను కాపాడాలి



**పర్వతగిరి, జూన్ 22 (వుదయం ప్రతినిధి ):**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం లో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన టిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్ పాల్గొని బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించి బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల లక్ష్యం ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకం అని అన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్ మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేటీర్ విమర్శించారు.ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు. యస్ ఐ ర్ పేరుతో ఓటరు జాబితాల్లో మార్పులు చేసి ప్రజల ఓటు హక్కులను హరించే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ స్థాయి కార్యకర్త, బూత్ లెవెల్ ఏజెంట్ తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఏనుమేరేషన్ ఫారం ను తప్పనిసరిగా సక్రమంగా నింపాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి అక్రమాలు, తొలగింపులు లేదా మార్పులు జరిగినా వెంటనే స్పందించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో కెసిఆర్ ను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కేటీర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, టి. రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి పర్వతగిరి, వర్ధన్నపేట, ఐనవోలు, హాసన్ పర్తి, వరంగల్ జి ఎచ్ యం సీ పరిధిలో భూతు బిఎల్ ఓ లు, సోషల్ మీడియా కన్వీనర్ లు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో అందిన ప్రతి వినతికి సత్వర పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 22 (వుదయం ప్రతినిధి)**

ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిగణించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్లు వేణు గోపాల్, విద్యాచందనలతో కలిసి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, సామూహిక సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వెంటనే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం పెంపొందించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియ వేగవంతమవుతుందని పేర్కొన్నారు.ప్రతి సమస్య వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని, ప్రజాసేవలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత అవసరమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత సుల భ త ర మ వుతుంద ని తెలిపారు.ఉపాధి, గృహాలు, జీవనోపాధిపై ప్రధానంగా వినతులుప్రజావాణిలో కొత్తగూడెంకు చెందిన వేపల లక్ష్మి కుటుంబ పరిస్థితులను వివరిస్తూ అంగన్‌వాడీ టీచర్ పోస్టు కల్పించాలని కోరగా, ఉపాధి కల్పన అధికారికి కలెక్టర్ దరఖాస్తును ఎండార్స్ చేశారు. షేక్ సఫియా తమ శిథిలావస్థలో ఉన్న ఇంటి స్థానంలో ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని కోరగా, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు పంపించారు. దమ్మపేట మండలం మల్లారం మోడల్ కాలనీకి చెందిన మోదంపరుపు సత్యవతి కూడా ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా, సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచనలు జారీ చేశారు.టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామస్తులు కొత్త గ్రామపంచాయతీ పేరుతో గిరిజన మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా, జిల్లా మత్స్యశాఖ అధికారికి దరఖాస్తును పంపించారు.అలాగే పాల్వంచలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో పార్ట్‌టైమ్ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేసిన విజయనిర్మల తన తొలగింపుపై న్యాయం చేయాలని కోరగా, సంబంధిత ఆర్‌సీఓ విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సమగ్ర సవరణ విధులకు హాజరు తప్పనిసరి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం



**నల్గొండ, 22-06, వుదయం:**

ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లుగా నియమితులైన వారు తప్పనిసరిగా విధులకు హాజరయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు కొంతమంది అధికారులను కూడా ఓటరు జాబితా సమగ్ర సవరణ విధులకు నియమించినట్లు తెలిపారు. నియమితులైన వారందరూ ఎన్నికల విధుల్లో తప్పనిసరిగా పాల్గొనాలని, ఎవరికి విధుల నుంచి మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు.ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించేందుకు జిల్లా ప్రత్యేక అధికారి, ఐఏఎస్ గౌరవ్ ఉప్పల్ ఈ నెల 24న జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి, తమ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో కూడిన నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడంతో పాటు విజయగాథలను కూడా సమర్పించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు సైతం ఈ సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి హెచ్‌ఎం రోడ్ల శంకుస్థాపన కార్యక్రమం కోసం జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున, వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను వెంటనే సీపీఓకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను కూడా ముందస్తుగా చేపట్టాలని సూచించారు.మండల ప్రత్యేక అధికారులు నెలాఖరులోగా టూర్ డైరీలను సమర్పించాలని, హాస్టళ్ల తనిఖీలతో పాటు ఆహార భద్రతపై ఏర్పాటు చేసిన కమిటీ సమావేశాల వివరాలను కూడా అందజేయాలని ఆదేశించారు.సమావేశంలో పైలట్ పద్ధతిలో మిర్యాలగూడలో చేపట్టిన నక్ష కార్యక్రమం పురోగతి, భూసేకరణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

## ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్



**మహబూబాబాద్ జిల్లా జూన్ 22వుదయం జిల్లా ప్రతినిధి**

గూగుల్ మీటి ద్వారా దరఖాస్తుల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్,సోమవారం జిల్లా కలెక్టర్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నితీష్ , జిల్లా అధికారులు, అన్ని విభాగాల సిబ్బందితో కలిసి కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా వ్యాప్తంగా ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేయాలని అన్నారు.భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పెన్షన్లు, పంచాయతీరాజ్, మున్సిపల్ సంబంధిత విభాగాలపై అధిక శాతం దరఖాస్తులు వస్తున్నా యని, జిల్లా కలెక్టరేట్ తో పాటు, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయలు తొర్రూరు డివిజన్, మహబూబాబాద్ డివిజన్ పరిధిలో కూడా ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని, ప్రజలకు వేగంగా, సత్వర సేవలను అందించాలనే ప్రధాన లక్ష్యంతో పారదర్శకంగా దరఖాస్తులను ఆన్లైన్ చేసి విభాగాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ సోమవారం గార్ల మండలం కోట్యా నాయక్ తండాకు చెందిన దారావత్ నరసింహ తన భూమికి సంబంధించి సర్వే ల్యాండ్ రికార్డు వారికి దరఖాస్తు చేసుకున్నానని ఇంతవరకు తన భూమిని సర్వే చేయలేదని తన భూమిని సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు. మహబూబాబాద్ మండలం వి.ఎస్.లక్ష్మీపురం కు చెందిన ఆనంద్ తనకున్న వ్యవసాయ భూమి హోల్డ్ లో ఉందని అట్టి హోల్డ్ లో నుండి తీసివేసి తనకు న్యాయం చేయాలని కోరారు. మరిపెడ మండలం లక్ష్మా తండ గ్రామానికి చెందిన లునావత్ సుక్కీ తాను గతంలో లక్ష్మా తండ లో అంగన్‌వాడీ ఆయా గా పనిచేశానని, తాను ఇప్పుడు పదవ తరగతి పాసై ఉన్నానని అదే కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ గా తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరారు.

# కార్పొరేట్ స్కూళ్ల దోపిడీకి చెక్ పెట్టండి


### ఫీజు నియంత్రణ చట్టం తేవాలని కలెక్టర్‌కు విద్యార్థి జన సమితి వినతి



**సూర్యాపేట జూన్ 22, వుదయం ప్రతినిధి**

రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు వెంటనే ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యార్థి జన సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినయ్ గౌడ్ మాట్లాడుతూ "రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయి. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం పదేపదే హామీలు ఇస్తున్నప్పటికీ, అవి కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి" అని మండిపడ్డారు. "మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం రోజురోజుకూ భారంగా మారుతోంది. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నా వారిపై కఠిన చర్యలు లేకపోవడం దురదృష్టకరం" అని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజుల భారం వల్ల వేలాది మంది తల్లిదండ్రులు అప్పుల పాలవుతుండగా, విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, హాస్టల్ మరియు ఇతర పేర్లతో భారీగా డబ్బులు వసూలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు.అధిక ఫీజులు వసూలు చేస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి నాయకులు దినేష్ నాయక్, ఈశ్వర్ సింగ్, వరుణ్, హర్ష రింగు, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్



**యాదాద్రి భువనగిరి జిల్లా, 22.06, వుదయం:**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం రోజు కలెక్టర్ ఛాంబర్ లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను ప్రజల నుండి స్వీకరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 94 అర్జీలను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 63, జిల్లా గ్రామీణభివృద్ధి 8, మున్సిపాలిటీ 6,సర్వే ల్యాండ్ 6, జిల్లా పరిషత్ 2, ఈఈ ఆర్ అండ్ బి 2, విద్యా 2, ఏ డి మైన్స్,సంక్షేమ శాఖ, సోషల్ వెల్ఫేర్, ఎక్సైజ్, ప్రణాళికా శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కల్పనా,జడ్పీ సీఈవో శోభారాణి , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

## పారదర్శకత, జవాబుదారీతనంతో సేవలు అందించాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, జూన్ 22 ( వుదయం కరస్పాండెంట్):**



ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు జె. అరుణ శ్రీ, కొప్పుల వెంకట్ రెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో నిర్వహించిన పరిపాలనా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజావాణి ద్వారా వచ్చే వినతులు, ఫిర్యాదుల పరిష్కారంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని, ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులో పరిష్కరించి తప్పనిసరిగా సమాధానం అందించాలని ఆదేశించారు. పారదర్శకత, జవాబుదారీతనం ప్రతి అధికారిలో ఉండాలని, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. సమాచారహక్కు చట్టం (ఆర్టీఐ) కింద వచ్చే దరఖాస్తులకు కూడా నిర్ణీత సమయంలో సమాధానాలు అందించాలని సూచించారు. జిల్లా పరిపాలనలోని అధికారులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలని, ఫీల్డ్ సిబ్బంది హాజరు, పనితీరును శాఖాధిపతులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.కొన్ని శాఖల్లో ఫైళ్ల పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్న కలెక్టర్, పెండింగ్ ఫైళ్లను క్రమం తప్పకుండా సమీక్షించి జాప్యాలకు కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కొంతమంది ఫీల్డ్ సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, అవినీతిని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.త్వరలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖలు తమకు సంబంధించిన వివరాలను సంక్షిప్తంగా, నాణ్యతతో కూడిన సమాచారంగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్డీవోలు గంగయ్య, సురేష్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మెనూకు తగ్గట్లే భోజనం.. నాణ్యతలో రాజీ వద్దు

**రాజన్న సిరిసిల్ల, జూన్ 22 ( వుదయం ప్రతినిధి) :**

-- మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విద్యార్థులకు మెనూకు తగ్గట్లే భోజనం ఉండాలని నాణ్యతలో రాజీ వద్దని, అలాగే విద్యాలయం,హాస్టల్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం తంగళ్ళపల్లి లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ముందుగా డైనింగ్ హాల్‌ను సందర్శించిన కలెక్టర్, భోజనం చేస్తున్న విద్యార్థినులతో మాట్లాడి వారికి వడ్డిస్తున్న ఆహార పదార్థాల గురించి తెలుసుకున్నారు. మెనూ చార్ట్‌ను పరిశీలించి, అందుకు అనుగుణంగా భోజనం అందిస్తున్నారా అనే విషయంపై అధికారులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం కిచెన్, గోదాంను పరిశీలించి బియ్యం, పప్పులు తదితర ఆహార



పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు.విద్యాలయంలో హాజరైన విద్యార్థుల సంఖ్యపై ఆరా తీసిన కలెక్టర్, వసతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, విద్యాలయం, హాస్టల్ ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు.

# లక్ష్యంతో కూడిన ప్రణాళికలు రూపొందించి ఉత్తమ ఫలితాలు సాధించాలి...

**జగిత్యాల జూన్ 22 (వుదయం ప్రతినిధి)**

ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ సమీక్ష...



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం అమలు పై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో కలిసి సోమవారం జగిత్యాల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ పాఠశాలలో విద్యా ప్రమాణాలు విద్యార్థుల హాజరు బోధన విధానాలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై జిల్లా విద్యాశాఖాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన రాబోయే పరీక్షల కోసం ఇప్పటి నుంచే లక్ష్యంతో కూడిన ప్రణాళిక రూపొందించుకుని కష్టపడి చదవాలని సూచించారు ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టుదలతో శ్రమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు నోటుబుక్కులు పూర్తిగా అందాయా అని ఆరా తీశారు అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు కోడిగుడ్ల సరఫరా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు ఉపాధ్యాయుల హాజరు బోధన నిర్వహణపై ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్న ఆమె గత సంవత్సర ఎస్ఎస్సి ఫలితాల పై జిల్లా విద్యాశాఖాధికారి నుండి సమాచారం సేకరించారు అనంతరం పాఠశాలలోని డైనింగ్ హాల్ మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించారు ఎండీఎం నిర్వాహకులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలని పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తూ ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహణ చేపట్టాలని సూచించారు పాఠశాల పరిసరాల్లో కిచెన్ గార్డెన్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించిన ఆమె మధ్యాహ్న భోజన పథక నిర్వహణలో ఎల్పీజీ గ్యాస్ వినియోగంపై కూడా వివరాలు తెలుసుకున్నారు చివరగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యను జీవితంలో అత్యంత విలువైన సంపదగా భావించి క్రమశిక్షణ తో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు అనంతరం కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు మందుల లభ్యత వైద్య సిబ్బంది పనితీరు ఆరోగ్య కేంద్రంలో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు కొనసాగించాలని సూచించారు తదుపరి మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణ పురోగతి ప్రభుత్వం అందిస్తున్న 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం గురించి వివరాలు తెలుసుకున్నారు పూర్తయిన ఇళ్లను సందర్శించి పరిశీలించి ఇళ్లు ఎంతో నాణ్యంగా ఆకర్షణీయంగా నిర్మించబడినట్లు అభినందించారు .

# ఆదిలాబాద్ రైతులకు తీపి కబురు

**ఆదిలాబాద్, జూన్ 22:**

- మొక్కజొన్నకు రూ.11.22 కోట్లు, జొన్నకు రూ.83.46 కోట్లు విడుదల

- నేటి నుంచే రైతుల ఖాతాల్లో జమ ప్రారంభం : కలెక్టర్ రాజర్షి షా



ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసిన మొక్కజొన్న, జొన్న పంటలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం తెలిపారు. తాజాగా విడుదలైన నిధులు నేటి నుంచే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అవుతున్నాయని వెల్లడించారు.జిల్లాలో 3,819 మంది రైతుల నుంచి ప్రభుత్వం మద్దతు ధరతో 2.19 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేసింది. దీని మొత్తం విలువ రూ.52.63 కోట్లు కాగా, మొదటి విడతగా రూ.31.08 కోట్లను ఇప్పటికే 2,624 మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.మిగిలిన రూ.21.55 కోట్లలో భాగంగా తాజాగా రెండో విడతగా రూ.11.22 కోట్లు ప్రధాన కార్యాలయం నుంచి జిల్లాకు విడుదలయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన రూ.10.33 కోట్లు కూడా త్వరలోనే విడుదల కానున్నాయని తెలిపారు.అలాగే జిల్లాలో 25,591 మంది రైతుల నుంచి రూ.270.59కోట్ల విలువైన 7.31 లక్షల క్వింటాళ్ల జొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.83.46 కోట్ల నిధులను విడుదల చేసినట్లు వెల్లడించారు. మిగిలిన బకాయిలను కూడా దశలవారీగా చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు.తాజాగా విడుదలైన మొక్కజొన్న నిధులు రూ.11.22 కోట్లు, జొన్న నిధులు రూ.83.46 కోట్లు జూన్ 22 నుంచే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేఫ్ట్ (NEFT), ఆర్టీజీఎస్ (RTGS) ద్వారా నేరుగా జమ చేయడం ప్రారంభమైనట్లు కలెక్టర్ తెలిపారు.రైతులు తమ బ్యాంకు ఖాతాలను పరిశీలించాలని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత కొనుగోలు కేంద్రాలు లేదా మార్క్‌ఫెడ్ అధికారులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.

# వ్యాయామశాలను ప్రారంభించిన మంత్రి

-మనిషి దినచర్యలలో వ్యాయామం ఒక భాగం కావాలి

-రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**మంచిర్యాల/రామకృష్ణాపూర్/ జూన్ 22(వుదయం ప్రతినిధి)**

ప్రతిరోజు వ్యాయామం చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, బరువు తగ్గడం, గుండె సంబంధిత వ్యాధులకు దూరమవడం వంటి అనేక ఉపయోగాలు ఉన్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డు పరిధిలో ఆర్కేపి ఎక్స్ రోడ్ వద్ద శ్రీ మారుతి పవర్ జిమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి వివేక్ పాల్గొన్నారు. జిమ్ లో బరువులు ఎత్తి కార్యకర్తలను జిమ్ నిర్వాహకులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు. ప్రతి ఒక్కరు నిత్యం ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి వ్యాయామం అలవర్చుకోవాలని అన్నారు. యువత క్రీడలు, వ్యాయామంపై ఆసక్తి పెంపొందించుకొని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంలో వ్యాయామం కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరచడంలో జిమ్ లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, పట్టణ మాజీ అధ్యక్షులు పల్లె రాజు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జంగం కల, మాజీ వైస్ చైర్మన్ విద్యాసాగర్ రెడ్డి సీనియర్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**లక్షెట్టిపేట్, జూన్ 22 (వుదయం ప్రతినిధి):**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సూచించారు. సోమవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రజలకు వైద్యులు అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఆసుపత్రిలోని వార్డులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. చికిత్సల కోసం వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని అన్నారు. వైద్య సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని సూచించారు. పట్టణ అభివృద్ధి, రోడ్డు వెడల్పు విషయంలో వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. అనంతరం పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, తహసిల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ చైర్మన్ దొంతంజలి నరసయ్య, వైస్ చైర్మన్ మోత్కూరి రాజేశ్వరి వెంకట్ స్వామి గౌడ్, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాహిద్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్, వైస్ చైర్మన్ ఎండి ఆరిఫ్, నాయకులు చెల్లా నాగభూషణం, పూర్ణచంద్రరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ చొరవతో కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారిపై కొత్తగట్టు వద్ద 'ర్యాంప్ ఏర్పాటుకు లైన్ క్లియర్

**కరీంనగర్ జూన్ 22 (వుదయం ప్రతినిధి):**



కరీంనగర్ – వరంగల్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా, శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద ఇరువైపులా ర్యాంప్ ఏర్పాటు చేయాలని స్థానికులు చేస్తున్న విజ్ఞప్తికి మోక్షం లభించింది. కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాలతో హైవే అధికారులుస్పందించి,పనులుచేపట్టేందుకు సిద్ధమయ్యారు. గతంలో కొత్తగట్టు గ్రామ ప్రజలు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిని కలిసి తమ ప్రాంతంలో రహదారి ఇరువైపులా ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలనివిన్నవించారు. ర్యాంప్ లేకపోవడం వల్ల స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని వారు వివరించారు.ప్రజల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్కుమార్, ఇటీవల హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్ కు కొత్తగట్టు ప్రాంత సమస్య పరిష్కరించాలని సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రహదారికి ఇరువైపులా ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.మంత్రి ఆదేశాల మేరకు, అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, ర్యాంప్ నిర్మాణానికి అవసరమైన చర్యలను ప్రారంభించారు. దీనితో కొత్తగట్టు, చుట్టుపక్కల గ్రామస్తుల రవాణా ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

# ప్రజావాణిలో 125 దరఖాస్తులు స్వీకరణ

**కామారెడ్డి, జూన్ 22 (వుదయం ప్రతినిధి):**

పెండింగ్ దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి: జిల్లా కలెక్టర్



జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, మొత్తం 125 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందనిఅన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పింఛన్లు, రెవెన్యూ తదితర అంశాలకు సంబంధించిన వినతులు ప్రజావాణిలో అందాయని, దూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రాకుండా సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్ వి గిరి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జడ్పీ సీఈవో చందర్, డిఆర్వో పాండు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ నితిక పంత్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి )**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించినప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితిక పంత్ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చినప్రజల నుండి మొత్తం 15ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు.ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని, ప్రతిసోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీస్శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రత ల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.

# పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

**నిజామాబాద్, జూన్ 22 :**

ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి

కలెక్టర్ తో కలిసి నగరంలో విస్తృత పర్యటన



జిల్లా కేంద్రమైన నిజామాబాద్ నగరంలో ఎక్కడ కూడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని నివాస ప్రాంతాలు, ప్రధాన రహదారులలో మురుగు జలాలు, వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులతో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సోమవారం ఉదయం నగరంలోని ఆయా ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. బోధన్ రోడ్, ఖిల్లా రోడ్డు, ఫ్రూట్ మార్కెట్, దేవీ థియేటర్ చౌరస్తా, ఖలీల్ వాడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బిల్డింగ్ తదితర ప్రాంతాలను సందర్శించారు. స్థానికంగా నెలకొని ఉన్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన మార్గాలలోని డ్రైనేజీలను పరిశీలించి, చెత్త చెదారం పేరుకుపోకుండా వెంటవెంటనే శుభ్రం చేయించాలని, వర్షపు జలాలు నిలువ ఉండకుండా సాఫీగా ముందుకు ప్రవహించేలా డ్రైనేజీలపై గ్రిల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. వానల వల్ల రోడ్లపై ఏర్పడే గుంతలను వర్షాకాలం అనంతరం తక్షణమే పూడ్చివేయించాలని, అవసరమైన చోట డ్రైనేజీల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో నగర ప్రజలు ఎక్కడ కూడా ఇబ్బందులు పడకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా మంచినీటి సరఫరా తీరును నిశితంగా పర్యవేక్షణ జరపాలని అన్నారు. మరో మూడు నెలలకు అవసరాలకు సరిపడా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదని భరోసా కల్పించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు ఆరంభం నుండే నాణ్యమైన విద్యను బోధించాలని ఈ సందర్భంగా హితవు పలికారు. కాగా, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఈసారి నగరంలోని అన్ని డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఒక్కో సర్కిల్ వారీగా 60 డివిజన్లలో డ్రైనేజీలు, రోడ్లను శుభ్రం చేయడం, చెత్తను తరలించడం, పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలను శుభ్రం చేయడం వంటి పనులు పూర్తయ్యాయని అన్నారు.

# విధేయుడికి రెండోసారి పార్టీ పగ్గాలు

**ఆర్మూర్, జూన్ 22 (వుదయం ప్రతినిధి):**



ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సాయిబాబా గౌడ్‌ను మరోసారి నియమించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు.పార్టీకి కష్టకాలంలో అండగా నిలుస్తూ, కార్యకర్తలను సమన్వయం చేస్తూ సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించినందుకు ఆయనపై పార్టీ అధిష్ఠానం మరోసారి విశ్వాసం ఉంచింది.

# ధర్మపురి రైతు వేదికల్లో నేటి నుంచి విత్తన మేళా

**ధర్మపురి, జూన్22 (వుదయం ప్రతినిధి):**

అందుబాటులో వివిధ రకాల వరి, పప్పు దినుసులు, కూరగాయల విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్



ధర్మపురి మండలంలోని రైతులకు నాణ్యమైన విత్తనాలను అందు బాటులో ఉంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ధర్మపురి, తిమ్మాపూర్ రైతు వేదికల లో ఈ నెల 23న మంగళవారం నుండి 30వ తేదీ వరకు వారం రోజుల పాటు విత్తన మేళాను నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి యం.రాజ్‌కు మార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రభుత్వం సాగుకు సిఫార్సు చేసిన వివిధ రకాల వరి విత్తనాలతో పాటు పప్పు దినుసులు,కూరగాయల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచ నున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతుల అవసరార్థం ఈ మేళాలో పలు రకాల విత్తనాలను ప్రదర్శిం చడంతో పాటు విక్రయించను న్నారు.వరి రకాలు బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048 తెలంగాణ సోన,హెచ్ఎంటీ సోన, జైశ్రీరామ్, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 7715. కందులు, పెసర్లు, మినుములు. ఇతర ఉత్పత్తులు, నాణ్యమైన కూరగా యల విత్తనాలతో పాటు, ఆధునిక వ్యవసాయానికి ఉపయోగపడే నానో యూరియా, నానో డీఏపీ ఉత్పత్తులు కూడా ఇక్కడ లభించనున్నాయి. వానాకాలం పంటల సాగుకు సిద్ధ మవుతున్న మండలంలోని రైతు సోదరులందరూ ఈ విత్తన మేళాను సందర్శించి, ప్రభుత్వం అందించే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ కోరారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## శ్రీ రేణుక ఎల్లమ్మ యంత్ర ప్రతిష్ఠ,కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం..



**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండలంలోని చల్మెడ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ కమాన్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుండి జూలై 1వ తేదీ వరకు శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ యంత్ర ప్రతిష్ఠ,కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి,లను వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి మహోత్సవ ఆహ్వాన పత్రికలను అందజేశారు.కళ్యాణ మహోత్సవానికి హాజరై అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో చల్మెడ మాజీ ఎంపీటీసీ బాల్రెడ్డి,మాజీ సర్పంచ్ సంగు స్వామి, జూపల్లి యాదగౌడ్,నారాగౌడ్,స్వామి గౌడ్,బురాని మల్లాగౌడ్,శ్రీనివాస్గౌడ్, రమేష్గౌడ్, నాలం బాలాగౌడ్,తిరుపతిగౌడ్,చింటూ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో ఉత్సాహభరితంగా యోగా దినోత్సవం

**- ఆనందంగా పాల్గొన్న గీతం ఉన్నతాధికారులు, సిబ్బంది, విద్యార్థులు**



**పటాన్చెరు (వుదయం):**

ఆరోగ్యం, శ్రేయస్సుకు యోగాను ఒక సంపూర్ణ విధానంగా ప్రోత్సహించేందుకు, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని క్రీడా విభాగం సోమవారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహభరితంగా జరుపుకుంది. ప్రాంగణంలోని అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను గాంధీ స్ఫూర్తితో ఒకచోట చేర్చి యోగ సాధన చేయించారు. అన్ని వయస్సుల వారిలో శారీరక శక్తి, మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యత, ఆరోగ్యకరమైన దీర్ఘాయువును ప్రోత్సహించడంలో యోగా పాత్రను నొక్కి చెప్పే ఈ ఏడాది విశ్వవ్యాప్త ఇతివృత్తం 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా'కు అనుగుణంగా ఈ వేడుకను నిర్వహించారు.శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగాభ్యాసాల ప్రాముఖ్యత, వాటి ప్రాధాన్యతపై పరిచయంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. దీని తరువాత, భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ సూచించిన కామన్ యోగా ప్రోటోకాల్కు అనుగుణంగా యోగాసనాలు, కపాలభాతి, ప్రాణాయామం, ధ్యానంతో కూడిన మార్గదర్శక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ యోగ సాధనలో అంతా చురుకుగా పాల్గొని, యోగా యొక్క శాస్త్రీయ ప్రయోజనాలపై విలువైన అవగాహన పొందారు. క్రమం తప్పని యోగా సాధన చురుకైన జీవనశైలికి, ఒత్తిడి నియంత్రణకు, వ్యాధుల నివారణకు, సంపూర్ణ శ్రేయస్సుకు ఎలా దోహదపడుతుందో శిక్షకుడు వివరించారు.ఈ కార్యక్రమంలో హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం/క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంధోని ఫిలిప్ తో పాటు పలువురు విభాగాధిపతులు హాజరయ్యారు. వీరంతా ఆరోగ్యకరమైన, మరింత సమతుల్యమైన జీవనశైలి కోసం ఈ ప్రాచీన క్రమశిక్షణను స్వీకరించడానికి అందరికీ కలిసి ప్రోత్సాహం చేశారు. ఈ వేడుకలలో భాగంగా, పాల్గొన్న వారందరికీ టీషర్టులు పంపిణీ చేశారు. హాజరైన వారందరిలో ఐక్యత, శ్రేయస్సు, సామూహిక స్ఫూర్తిని పెంపొందిస్తూ, సామూహిక ఫోటో సెషన్ తో పాటు, రుచికరమైన అల్పాహారంతో ఈ కార్యక్రమం ముగిసింది.

## సెయింట్ ఆంథోనీస్ మహిళా డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యసన నివారణ అవగాహన కార్యక్రమం



**సంగారెడ్డి, జూన్ 22:వుదయం**

సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్లో గల సెయింట్ ఆంథోనీస్ మహిళా డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యసన విముక్తి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్స్పెక్టర్ రాము, కానిస్టేబుల్ రజనీకాంత్తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యాన్ని దెబ్బతీసి, కుటుంబాలను చిన్నాభిన్నం చేయడంతో పాటు విద్య, ఉద్యోగ అవకాశాలు మరియు భవిష్యత్తును నాశనం చేస్తుందని వివరించారు. డ్రగ్స్కు దూరంగా ఉండాలని, ఇప్పటికే అలవాటు పడిన వారు తగిన సలహాలు, వైద్య సహాయం తీసుకొని వ్యసనాన్ని అధిగమించాలని సూచించారు.కళాశాల డైరెక్టర్ ఈ. విజయకుమార్ మాట్లాడుతూ, డ్రగ్స్ తాత్కాలిక ఆనందాన్ని ఇచ్చినా శాశ్వత నష్టాన్ని మిగులుస్తాయని అన్నారు. కుటుంబం, భవిష్యత్తు కోసం మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ జవహర్ మాట్లాడుతూ, మత్తు మాయలో పడి మంచి భవిష్యత్తును కోల్పోవద్దని అన్నారు. డ్రగ్స్ వినాశనానికి దారి తీస్తాయని, విద్యా ప్రగతి మరియు ఆరోగ్యానికి అవి శత్రువులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు,అధ్యాపక బృందం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన పోలీస్ శాఖను కళాశాల యాజమాన్యం అభినందించింది.

## సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించాలి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి జూన్ 22 (వుదయం ప్రతినిధి)**



వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ఐ.డి.ఒ.సి సమావేశ హాల్లో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో అన్ని లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో సీజనల్ వ్యాధులను అరికట్టడంలో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన చర్యల పై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. వర్షాకాలంలో జిల్లాలో డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, వాంతులు విరేచనాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబల కుండ అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వేలు నిర్వహించి రికార్డులు నిర్వహించాల్సిందిగా ఆదేశించారు.

అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాలు, కళాశాలల్లో పనిచేస్తున్న వంట మనుషులు, భోజనం వడ్డించే వారికి ఐడిఆర్ (ట్రైఫాయిడ్) వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఎవరికైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే రెండు వారాల పాటు క్వారంటైన్ చేసి వైద్యం అందించాలని వైద్య శాఖ అధికారిని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో అన్ని డ్రైన్ లు శుభ్రం చేయించాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి మంగళ, శుక్రవారాల్లో క్రమం తప్పకుండా డ్రై డే నిర్వహించాలని సూచించారు. అన్ని విద్యాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఫ్రై డే డ్రై డే పాటించాలని ఆదేశించారు. ఇంతకు ముందు సంవత్సరం ఎక్కడైతే డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయో అట్టి వార్డుల్లో, గ్రామాల్లో ప్రత్యేక దృష్టి పెట్టి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఎక్కడా నీటి నిలువ నీరు లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, డి.పి.ఒ ను ఆదేశించారు. ప్రతి నెల 11, 21, 31 వ తేదీల్లో మంచి నీటి ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయాలని, శుభ్రం చేస్తున్న ఫోటోలు తీసుకోవడం, రిజిస్టర్ లో నమోదు చేయడం వంటివి జరగాలని సూచించారు. గ్రామాల సందర్శనకు వచ్చినప్పుడు ఈ రిజిస్టర్లను పరిశీలిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, డిఆర్వో సూర్య ప్రకాష్ , ఎస్.డి.సి. తిరుపతయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కొత్లాపూర్ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక:

**- వర్షా కాలం వేళ విద్యుత్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక నిఘా......**
**- గ్రామ అభివృద్ధికి, ఉత్తమ గ్రామ పంచాయతీగా - - - -**
**- - తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే సహకరించాలి**
**సర్పంచ్ -**
**-చంద్రకళవెంకటరామిరెడ్డి**



***తాండూరు వుదయం ప్రతినిధి**

జూన్22,: తాండూరు*మండలం కొత్లాపూర్ గ్రామ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కొత్లాపూర్ గ్రామ సర్పంచ్ చంద్రకళవెంకటరామిరెడ్డి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆమె ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రకళ మాట్లాడుతూ, వర్షాకాలంలో గ్రామస్థులు ఎదుర్కొనే ప్రధాన సమస్యలపై ముందస్తుగానే దృష్టి సారించినట్లు తెలిపారు. అందులో భాగంగా చేపడుతున్న ముఖ్యమైన చర్యల 1నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు వర్షకాలంలో ఈదురుగాలులు, వానల వల్ల విద్యుత్ అంతరాయం కలగడం సహజం. అయితే ఈసారి కొత్తలాపూర్లో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

చేతికందే దూరంలో ఉన్న, ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించారు.లూజ్ వైర్లను సరిచేయడం, బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించే పనులను వేగవంతం చేశారు.అత్యవసర సమయాల్లో స్పందించేందుకు ప్రత్యేక లైన్మెన్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. వర్షాకాల*ముందస్తు కార్యాచరణ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మరియు వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. డ్రైనేజీల క్లీనింగ్: గ్రామంలోని అన్ని మురుగు కాలువల్లో పూడికతీత పనులను పూర్తి చేయించారు దీనివల్ల వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోకుండా సాఫీగా వెళ్ళిపోతుంది. బ్లీచింగ్ & ఫాగింగ్: దోమల నివారణకు, అంటు వ్యాధులు దరిచేరకుండా ఉండేందుకు గ్రామ వీధుల్లో క్రమం తప్పకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ చేయించడం వంటి పనులను ముమ్మరం చేశారు పుర వీధులలో విద్యుత్ దీపాల అమరిక*ప్రణాళికలు గ్రామస్తుల రక్షణ, సౌకర్యార్థం గ్రామంలోని ప్రధాన పుర వీధులలో నూతన విద్యుత్ దీపాలను అమర్చడం కోసం ముందస్తు చర్యలుప్రధాన లక్ష్యం: రాత్రి వేళల్లో ప్రజల భద్రతను పెంపొందించడం, చీకటి కారణంగా జరిగే ప్రమాదాలను నివారించడం. చేపట్టిన చర్యలు: పాడైపోయిన పాత లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, లైట్లు లేని చీకటి వీధుల్లో కొత్త స్తంభాలకు విద్యుత్ దీపాలను అమర్చడం చేస్తామన్నారు *అంగన్వాడీ కేంద్రాల పరిశీలన గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడ అందుతున్న సేవలపై సమగ్ర పరిశీలన చేయడం జరిగింది.ఆహార నాణ్యత: గర్భిణీలకు, బాలింతలకు మరియు చిన్న పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం (గుడ్లు, పాలు, బాలామృతం) యొక్క నాణ్యతను పరిశీలించాము జరుగుతుందిహాజరు ,రికార్డులు: కేంద్రానికి వచ్చే పిల్లల హాజరు శాతం, బరువుల నమోదు మరియు స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేయడం జరిగింది.పరిశుభ్రత: అంగన్వాడీ కేంద్రం ప్రాంగణం, వంటగది మరియు తాగునీటి వసతుల పరిశుభ్రతను తనిఖీ చేసి, నిర్వాహకులకు తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. సురక్షిత తాగునీరు: వర్షాకాలంలో కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులను అరికట్టేందుకు, తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందేలా చూస్తున్నారు.*సర్పంచ్ చంద్రకళ వెంకటరామిరెడ్డి పిలుపు :"* గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యం. వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎక్కడైనా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. విద్యుత్ సమస్యలు లేదా మరేదైనా అత్యవసర పరిస్థితి వస్తే వెంటనే గ్రామ పంచాయతీ సిబ్బందిని సంప్రదించాలి."గ్రామస్తులకు కోరారు *ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూస్తాం * గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే **బుయ్యాని మనోహర్ రెడ్డిసహకారం అందించాలి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా శ్రద్ధ వహిస్తామని గ్రామ సర్పంచ్ చంద్రకళ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి ధ్యేయంగా తాము నిరంతరం శ్రమిస్తామని ఆమె స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రకళ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, తాగునీరు పారిశుద్ధ్య మెరుగుదలకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. అయితే, గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకువెళ్లడానికి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి స్థానిక శాసనసభ్యుల (ఎమ్మెల్యే) సహకారం ఎంతో అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు

## గ్రామపంచాయతీ భవన నిర్మాణాని కై మంత్రికి వినతి



**వెల్దండ జూన్ 22 (వు దయం)**

వెల్దండ గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కడ్తాల్ మండలంలోని నూతన ఎంపీడీఓ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా విచ్చేసినపంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మంత్రి నూతన భవన నిర్మాణానికి సానుకూలంగా స్పందించారని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి రషీద్, పసునోజు పురుషోత్తమాచారి, గుద్దటి కిష్టల్, మసిగుండ్ల వెంకటేష్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాదేపల్లి మల్లయ్య,, మరేపల్లి శ్రీనివాస్, మండల కాంగ్రెస్ యుయు అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో స్థానికులకి ప్రథమ ప్రాధాన్యత కల్పించండి..



**- అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వాములు కావాలి..**
**- పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

**అమీన్పూర్ (వుదయం):**

అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని సుల్తాన్పూర్ మెడికల్ డివైస్ పార్కులో గల పరిశ్రమలు స్థానికులకు ఉద్యోగాల కల్పనలో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పరిశ్రమల యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సుల్తాన్పూర్ మెడికల్ డివైస్ పార్కు లో గల ఐలా కార్యాలయంలో ఆయా పరిశ్రమల యాజమాన్యాలు, ఐలా అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. ప్రస్తుతం 120 పరిశ్రమలు ఉత్పత్తులు కొనసాగిస్తున్నాయని అధికారులు తెలిపారు. ప్రతి పరిశ్రమ ఉద్యోగాల కల్పనలో స్థానికులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రిక్రూట్మెంట్ సమయంలో వివిధ మాధ్యమాల ద్వారా స్థానికులకు సమాచారం అందించాలని కోరారు. దీంతో పాటు ప్రజోపయోగ కార్యక్రమాలకు సి ఎస్ ఆర్ నిధులు కేటాయించాలన్నారు. జులై మొదటి వారంలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, ఐలా కమిషనర్ శ్రీనివాస్, డిఈ సురేందర్, విద్యుత్ శాఖ ఏడి సంజయ్, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## రెండున్నర లక్షల రూపాయల విలువైన ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు (వుదయం):**

ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన ఆఫియా తబస్సుం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ ద్వారా ఎల్ ఓ సి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రెండు లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసిని సోమవారం పటాన్చెరు లోని తన కార్యాలయంలోఆఫియా తబస్సుం కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, చంద్రశేఖర్, మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ బ్యాంకింగ్ పై అవగాహన కార్యక్రమం




**నారాయణపేట టౌన్ జూన్ 22(వుదయం ప్రతినిధి)**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్, లీడ్ మేనేజర్ విజయకుమార్, ఎస్ బి ఐ జాజాపూర్ మేనేజర్ వెంకట శివ మాట్లాడుతూ సురక్షితమైన డిజిటల్ బ్యాంకింగ్ కొరకు మంచి అలవాట్లు నేర్చుకోవాలని, సేవింగ్, కరెంట్ బ్యాంక్ అకౌంట్లో గురించి సుకన్య సమృద్ధి అకౌంట్ గురించి మరి బ్యాంకు లావాదేవుల గురించి అవగాహన కల్పించారు.చెల్లింపుల కొరకు నమ్మకమైన బ్రౌజర్లను సురక్షితమైన హెచ్ టి పి పి ఎస్ వెబ్సైట్లను వినియోగించాలని సూచించారు.మీ పాస్వర్డ్ తరచుగా మార్చి లాగిన్ వివరాలు ఫోన్లో ఉంచరాదని సూచించారు. నమ్మకం లేని ఇంటర్నెట్ దుకాణాల్లో వివరాలు నమోదు చేయరాదని మొబైల్ బ్యాంకింగ్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్వర్డ్ ఎవరికి తెలియకుండా జాగ్రత్త పడాలన్నారు. చెల్లించే ముందు పేమెంట్ కరెక్ట్ రిక్వెస్ట్ వివరాలు అసలు లబ్ధిదారులు కాదో నగదు సరిగ్గా ఉండదు లేదో పరిశీలించాలన్నారు. మీ యూపీఐ పిన్ను ఎవరికి తెలపరాదని లేదా రాసి ఏటీఎం కార్డు ఉపయోగించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.వాస్తవ లావాదేవులకి ఎస్ఎంఎస్ సందేశాల్లో తెలిపిన దానికి ఏమైనా తేడా ఉందా అని గమనించండి రసీదులు రిపోర్టులు జాగ్రత్త వహించాలన్నారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా లావాదేవులు కే సి సి కార్డు ద్వారా ఏటీఎం డిబేట్ రూపే కార్డుల గురించి వివరంగా వివరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ బ్యాంకింగ్ వ్యవస్థ గురించి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని వాటి వల్ల నష్టాలు నివారించడానికి చాలా లాభాలు ఉంటాయని తెలియజేశారు. పాఠశాలకు అవసరమిత్తం 5 ఫ్యాన్ లను బహుకరించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందము హెచ్ భాను ప్రకాష్, నరసింహ ,నరసింహులు ,రఘురాంరెడ్డి ,వెంకటేష్, కౌన్సిలర్లు అనసూయ, వెంకటేష్ గౌడ్ సుల్తానా విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్లెల రక్షణకు 'సీసీ' నేత్రాలు.. వ్యసనాలకు దూరంగా ఉండాలి: సిద్దిపేట సీపీ రష్మి పెరుమాళ్



**గుడికందుల గ్రామంలో "మన పోలీస్ - మన ఊరు" కార్యక్రమం**
**- 10 సీసీ కెమెరాలు, గ్రంథాలయాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్**

**సిద్దిపేట, జూన్ 22 (వుదయం బ్యూరో)**

ప్రజలకు, పోలీసులకు మధ్య దూరాన్ని తగ్గించి, కమ్యూనిటీ పోలీసింగ్ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సిద్దిపేట పోలీస్ శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "మన పోలీస్ మన ఊరు" కార్యక్రమం సోమవారం మీరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడికందుల గ్రామంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సిద్దిపేట పోలీస్ కమిషనర్ (సీపీ) రష్మి పెరుమాళ్, IPS ముఖ్య అతిథిగా విచ్చేశారు. గ్రామానికి చేరుకున్న సీపీకి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా "సిద్దిపేట సురక్ష నేత్ర" కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 10 సీసీటీవీ కెమెరాలను, అలాగే నూతన గ్రామ గ్రంథాలయాన్ని సీపీ ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల గోడలపై పోలీసులు గీసిన ట్రాఫిక్ నిబంధనలు, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన చిత్రాలను పరిశీలించారు. విద్యార్థులు వేసిన ట్రాఫిక్, డ్రగ్స్, సైబర్ క్రైమ్ థీమ్ రంగోలి (ముగ్గుల) పోటీలను తిలకించి, వారితో ముచ్చటించారు. విద్యార్థులతో మాట్లాడిన సీపీ.. డ్రగ్స్కు దూరంగా ఉండాలని, ఎక్కడైనా కనిపిస్తే వెంటనే 'డయల్ 100'కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, చైల్డ్ అబ్యూస్ (బాలలపై లైంగిక వేధింపులు) గురించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించి, ధైర్యం చెప్పారు. అనంతరం వారికి ఎగ్జామ్ ప్యాడ్లను అందజేశారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు గ్రామ యువతకు, పోలీస్ టీమ్కు మధ్య జరిగిన వాలీబాల్ మ్యాచ్కు ఆమె టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, డ్రగ్స్పై లఘు చిత్రాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు, అవగాహన స్కిట్లు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సీపీ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ.. రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే రూ.10,000 జరిమానా మాత్రమే కాదు, ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఒకవేళ ఎవరైనా బానిసలై ఉంటే పోలీసులకు సమాచారం ద్వారా ఉచిత కౌన్సిలింగ్ ఇప్పించి మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దుతాం. పూర్వకాలంలో పల్లెల్లో ఐక్యత ఉండేది, కానీ నేడు చిన్న విషయాలకే నేరాలకు పాల్పడుతున్నారు. గ్రామ పెద్దలు యువతకు సంస్కృతిని నేర్పించి ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలి. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదు. గుడికందుల గ్రామంలో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని, వీటిని మొబైల్ ఫోన్ లాగే రెగ్యులర్గా మెయింటెన్ చేయాలని సీపీ సూచించారు. ఇటీవల జిల్లాలో చైన్ స్నాచింగ్ గ్యాంగ్లను పట్టుకున్నామని, పల్లెల్లోకి కొత్త వ్యక్తులు వస్తే ప్రశ్నించాలని, అనుమానం వస్తే వెంటనే డయల్ 100 లేదా విలేజ్ పోలీస్ అధికారి వీరేశంకు సమాచారం అందించాలన్నారు.ప్రజల వద్దకు సీపీ.. బహుమతులుగా హెల్మెట్లు :సభ అనంతరం సీపీ నేరుగా గ్రామస్తుల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన ఒక మహిళ యువతకు ఉద్యోగాల గురించి అడగ్గా.. "సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర" వెబ్సైట్ ద్వారా లభించే ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలను వివరించారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు, వాలీబాల్ క్రీడాకారులందరికీ సీపీ చేతుల మీదుగా హెల్మెట్లను బహుమతిగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఎ ఆర్) సుభాష్ చంద్రబోస్, ఏసిపి రవీందర్, సిఐ రాజేష్, మీరుదొడ్డి ఎస్ ఐ సతీష్, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు, మహిళలు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



**మహబూబ్ నగర్ జూన్ 22(వుదయం ప్రతినిధి)**

ప్రజావాణిలో వచ్చిన పిర్యాదుదారుల దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె . ఎల్.బి హరిప్రియ, అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను శ్రద్ధగా విన్నారు. ప్రతి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అర్జిదారులకు ఆమె భరోసా ఇచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి, గిరిజన అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించి 117 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని , డి.ఆర్.ఓ ఎ.నిర్మల, జడ్.పి.సి.ఈ.ఓ, ఇంచార్జి డి. పి.ఓ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావుకు ఘన స్వాగతం



**వెల్దండ జూన్ 22 (వు దయం)**

మాజీ మంత్రివర్యులు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు కు సోమవారం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు అచ్చంపేట పట్టణంలో నిర్వహించే పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భంగా మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు రామ్ రెడ్డి, జంగిలి నిరంజన్, జోగయ్య తోపాటు పలువురు నాయకులు హరీష్ రావుకు శాల్వాల్ కప్పి ఘన స్వాగతం పలికారు

## గున్ముక్లా గ్రామంలోమాలగుట్ట మైనింగ్ వెంటనే ఆపాలని ఎస్పీకి ఫిర్యాదు



**మరికల్ జూన్ 22 (వుదయం ప్రతినిధి)**

ధన్వాడ మండల కేంద్రం పరిధిలోని గున్ముక్లా కొనసపల్లి మంత్రో న్ పల్లి ఏంనూన్ పల్లి గ్రామానికి చెందిన అఖిలపక్ష నాయకులు సోమవారం నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాలగుట్ట మైనింగ్ వెంటనే ఆపాలని ప్రజావాణిలోఫిర్యాదు చేశారు మరియు మైనింగ్ వల్ల గ్రామాలకు వివిధ నష్టం కలుగుతుందని వాతావరణ పర్యాయం కాలుష్యం ఏర్పడుతుందని అఖిలపక్ష నాయకులు ఎస్పీకి సూచించారు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ అఖిలపక్ష నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# కల్లెడ అడవుల్లో సస్పెన్స్ థ్రిల్లర్

## 'జీబు రాజేశం' షార్ట్ ఫిల్మ్ షూటింగ్ జోరు

జన్నారం,జూన్ 22(వుదయం విలేకరి) కడెం మండలం కల్లెడ గ్రామం, జన్నారం పరిసర ప్రాంతాల్లో 'జీబు రాజేశం' షార్ట్ మూవీ చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. స్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి సమృత్ చింత దర్శకత్వం వహిస్తున్నారు. రవీంద్ర సిద్దార్థ్ సహాయ దర్శకుడిగా, వెంకటేష్ కెమెరా పనిని నిర్వహిస్తున్నారు. అశోక్ బోగె, ప్రియా అవిరెడ్డి, ప్రవీణ్,కోదురుపాక శ్రీనివాస్, ప్రతాప్, అలాగే జన్నారం నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు గాజుల సహస్ర గౌడ్,యశోద మోక్షిత్, తదితరులు నటిస్తున్నారు. కథకు తగ్గ సహజమైన అడవులు, కొండలు, గ్రామీణ అందాలు కల్లెడలో లభించడంతో ఇక్కడ షూటింగ్ పెట్టినట్లు యూనిట్ తెలిపింది. శ్రీ మల్లీశ్వరానంద అఘోర శివశక్తి త్రిశక్తి పీఠాధిపతి ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతోంది. స్థానిక గ్రామస్తులు, యువత చిత్ర బృందానికి సహకరిస్తున్నారు. "కల్లెడ లోకేషన్లు కథకు పర్ఫెక్ట్‌గా సరిపోయాయి. చివరి వరకు థ్రిల్ ఉండేలా కథనం ఉంటుంది. కొత్త అనుభూతి ఇస్తుంది" అని దర్శకుడు సమృత్ చింత చెప్పారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెస్తామని చిత్ర బృందం వెల్లడించింది. స్థానిక కళాకారులతో రూపొందుతున్న ఈ చిత్రానికి మంచి ఆదరణ వస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొంది.

# జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి రైతులు ఆందోళన చెందవద్దు

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి, జూన్ 22 (వుదయం ప్రతినిధి):జిల్లాలో రైతులకు యూరియా ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, అవసరమైన మేరకు యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువుల సరఫరాను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణానికి అనుగుణంగా యూరియా పంపిణీ జరుగుతోందన్నారు. దీని వల్ల ఎరువుల సమాన పంపిణీతో పాటు అక్రమ నిల్వలు, మళ్లింపులను అరికట్టడం సాధ్యమవుతోందని పేర్కొన్నారు.
గత వానాకాలంతో పోలిస్తే ప్రస్తుతం వరి నాట్లు నమోదైన విస్తీర్ణం తక్కువగా ఉన్నప్పటికీ రైతులు ముందస్తుగా యూరియాను కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. కామారెడ్డి జిల్లాలో గత ఏడాది ఇదే సమయానికి 5,571 ఎకరాల్లో వరి నాట్లు నమోదుకాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 250 ఎకరాల్లో మాత్రమే నాట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ గత ఏడాది ఇదే తేదీ నాటికి 2.37 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేయగా, ఈ ఏడాది 2.64 లక్షల బస్తాలను రైతులు కొనుగోలు చేశారని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 0.65 లక్షల యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, అదనంగా అవసరమైన మేరకు నిల్వలను నిరంతరం సమకూరుస్తున్నామని తెలిపారు. అలాగే జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరి నర్సరీలు పెంచబడిన నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని,
రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల బస్తాలకు పైగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ తగిన నిల్వలను అందుబాటులో ఉంచుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు యూరియా లభ్యతపై ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికాకుండా అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు.

# క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

## తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సోని బాలదేవి.



ఆసిఫాబాద్,(వుదయం ప్రతినిధి ): గిరిజన విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సోని బాలదేవి అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లాకు వచ్చిన ఆమె జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలను సందర్శించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం అనంతరం పాఠశాలకు చేరుకున్న డా. సోని బాలదేవి, విద్యార్థి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాధించిన పతకాలు, ట్రోఫీలను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గిరిజన బాలికలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ పొందితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. క్రీడల ద్వారా ఆర్థికంగా ఎదిగి తమ తల్లిదండ్రులకు అండగా నిలవాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలలోని వసతులు, శిక్షణ విధానాన్ని పరిశీలించిన డా. సోని బాలదేవి అధికారులకు పలు సూచనలు చేశారు.

# ప్రభుత్వ విద్యకు మరో ముందడుగు

- అచ్చంపేట్ ప్రభుత్వ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ తరగతుల ప్రారంభం
- చిన్నారులతో మమేకమైన ఆర్డీవో రవీందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్
- అక్షరాభ్యాసంతో విద్యా ప్రస్థానానికి శ్రీకారం
- నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం





నిజాంసాగర్ జూన్ 22 (వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా చిన్నారులకు బాల్యదశ నుంచే నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ప్రీ-ప్రైమరీ తరగతులను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రీ-ప్రైమరీ తరగతి గదులను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన విద్యా సామగ్రి, ఆటవస్తువులు, చిన్నారులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం చిన్నారులతో ఆప్యాయంగా మమేకమై వారి అభిరుచులు, విద్యపై ఆసక్తిని తెలుసుకున్నారు. నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పలకపై అక్షరాలు దిద్దించి వారి విద్యా ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. చిన్నారుల ఉత్సాహాన్ని చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు.
ఆర్డీవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ బాల్యదశలో అందించే విద్య పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రీ-ప్రైమరీ విద్య ద్వారా చిన్నారుల్లో నేర్చుకోవాలనే ఆసక్తి పెరగడంతో పాటు మానసిక, సామాజిక, భావోద్వేగ వికాసం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు కల్పిస్తూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా మెరుగైన విద్యను పొందేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రీ-ప్రైమరీ తరగతుల ఏర్పాటు ద్వారా చిన్నారుల్లో విద్యపై ఆసక్తి, అభ్యాస నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు మౌలిక వసతుల అభివృద్ధి, నూతన బోధనా విధానాలు, డిజిటల్ సౌకర్యాల కల్పన వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కూడా నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సాయి భుజంగరావు, ఎంపీడీవో శివకృష్ణ, మండల విద్యాధికారి తిరుపతి రెడ్డి, ఎంపీపీఎస్ అచ్చంపేట్ ప్రధానోపాధ్యాయులు లాల్‌సింగ్, జెడ్పీహెచ్‌ఎస్ అచ్చంపేట్ ప్రధానోపాధ్యాయులు వెంకట్రాం రెడ్డి, పీఆర్‌టీయూ అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి సురేందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మంద బలరాం, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి, గ్రామ సర్పంచ్ సంకు లక్ష్మయ్య, ఉపసర్పంచ్ రవీందర్, నాయకులు బంగ్లా ప్రవీణ్ కుమార్, బొడ్డు అంజయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల/జూన్ 22(వుదయం ప్రతినిధి) ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూరు పట్టడానికి చెందిన లింగ కృష్ణ తాను టైల్స్, మార్బుల్ వ్యాపారం నిర్వహిస్తున్నానని, అన్ లోడింగ్ సమయంలో హమాలీలు అధిక ధరలు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దోమల చంద్రశేఖర్ తన కూతురు మందమర్రి లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఆరవ తరగతి పూర్తి చేసిందని, మంచిర్యాలలోని వసతి గృహానికి బదిలీ చేయగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండలం కోనంపేట గ్రామ రైతులు తమకు ముఖ్యమంత్రి గిరి వికాస్ పథకం కింద మంజూరైన బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన చిలుక పద్మ తాము ఉంటున్న రేకుల ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మాగంటి సౌభాగ్యవతి తాను భూభారతి పోర్టల్ లో పాస్ పుస్తకం వివరాల సవరణ కొరకు దరఖాస్తు చేసుకున్నానని, దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం అమరవాది కు చెందిన తోటపల్లి లత తన భర్త మరణించినందున జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం గద్దెరాగడి ప్రాంతానికి చెందిన గొట్టే నరేందర్ బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లిలో అనుమతులకు మించి మట్టి తవ్వకాలు జరిగాయని, ఈ విషయమై పూర్తి విచారణ చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన సముద్రాల శంకర్ తమ గ్రామంలోని చెరువులపై జరిగిన అక్రమ ఆక్రమణలను తొలగించి చెరువులను పునరుద్ధరించాలని, శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, వైద్యాధికారులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ నెల 29, 30 తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా 1 వేయి 836 సిబ్బంది 459 బూత్ ల ద్వారా పోలియో చుక్కల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పోలియో వ్యాక్సిన్ సురక్షితమైనదని, అనారోగ్యంగా ఉన్నవాళ్లు కూడా ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నీటి జనిత, కీటక జనిత వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, అన్ని శాఖల సమయంతో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాను పోలియో రహిత, ఆరోగ్య మంచిర్యాల గా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జన్నారంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

జన్నారం,జూన్ 22(వుదయం విలేఖరి) జన్నారం మండలంలో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు జన్నారం గ్రామ పంచాయతీలో చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక సహాయం అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జన్నారం సర్పంచ్ అజ్మీరా కళావతి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అజ్మీరా నందునాయక్,ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, మాజీ ఎంపీటీసీ రియాజుద్దీన్, నాయకులు కట్టెకొల మహేశ్, ఆజర్, జహీర్, జీలకర గంగన్న, రసమల్లా పాపా గౌడ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందనపల్లి జడ్పీ పాఠశాలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం




జన్నారం, జూన్ 22(వుదయం విలేకరి) డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా జన్నారం ఇందనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ సీపీ అంబర్ కిషోర్, డీసీపీ భాస్కర్ ఆదేశాల మేరకు జన్నారం ఎస్ఐ జి. ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏఎస్ఐ జి. శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, నష్టాల గురించి వివరించారు."డ్రగ్స్ వద్దు, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం" అనే నినాదంతో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చిన్న వయసులోనే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేందర్, పీజీటీ టీచర్ తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన కౌటాల నూతన ఎస్సై.




కౌటాల (వుదయం ప్రతినిధి )జిల్లా పోలీస్ కార్యాలయం లో ఎస్పీ నితికా పంత్ ను కౌటాల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై సతీష్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ ఎస్సై సతీష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నేరాల నియంత్రణ, ప్రజా సమస్యలపై సత్వర స్పందన, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా, ప్రజల విశ్వాసాన్ని చూరగొనే విధంగా నిబద్ధతతో పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు

# సిగరెట్, మద్యం విక్రయాలపై నియంత్రణ అవసరం

*యువత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం.. బెల్ట్ షాపుల నిర్మూలనకు ప్రజల డిమాండ్*

*గ్రామాల్లో పెరుగుతున్న బెల్ట్ షాపులు*

*అధికారుల చర్యలు కోరుతున్న ప్రజలు*

*యువతను కబళిస్తున్న మద్యం, పొగాకు*

నాగిరెడ్డిపేట్,వుదయం సిగరెట్, మద్యం విక్రయాలు రోజురోజుకు పెరుగుతుండటంతో సమాజంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా యువతలో ఈ అలవాట్లు విస్తరిస్తుండటంతో వారి ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, మద్యం సులభంగా లభిస్తుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, రక్తపోటు వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే మద్యం సేవించడం వల్ల కాలేయ వ్యాధులు, నాడీ సంబంధిత సమస్యలు, మానసిక ఒత్తిడి, కుటుంబ కలహాలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల సమీప ప్రాంతాల్లో సిగరెట్లు, గుట్కా, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించడం ఆందోళన కలిగిస్తోంది. కొంతమంది యువకులు చిన్న వయస్సులోనే ఈ అలవాట్లకు బానిసలవుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. మద్యం మత్తులో జరిగే గొడవలు, కుటుంబ వివాదాలు, ఆర్థిక ఇబ్బందులు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కుటుంబాల ఆదాయంలో అధిక భాగం మద్యం కోసం ఖర్చవుతుండటంతో పేద కుటుంబాలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా, మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులు ప్రజల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి. ప్రతి గ్రామంలో చిన్నచిన్న బెల్ట్ షాపులు ఏర్పడి, మద్యం సీసాలపై అదనపు ధరలు వసూలు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఒక సీసాపై అధిక మొత్తంలో అదనపు చార్జీలు వసూలు చేస్తూ ప్రజలను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారని వారు వాపోతున్నారు. నాగిరెడ్డిపేట్ మండలంలోని అనేక గ్రామాల్లో ఈ పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు ఉండడం వల్ల యువత సులభంగా మద్యానికి అలవాటు పడుతున్నారని, కుటుంబాల్లో కలహాలు పెరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికే పలు చట్టాలు, నియంత్రణ చర్యలు అమలు చేస్తున్నప్పటికీ వాటి అమలులో మరింత కఠినత అవసరమని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో పొగాకు, మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధించాలని, అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించి యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి యువతను చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచిస్తున్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సిగరెట్, మద్యం వినియోగాన్ని తగ్గించడం అత్యంత అవసరమని, గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్ షాపులను వెంటనే మూసివేసి కఠిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు.


# చక్కని ఆరోగ్యం

## లివర్ ఆరోగ్యానికి కాఫీ మేలు చేస్తుందా..



ప్రపంచవ్యాప్తంగా ఫ్యాటీ లివర్ సమస్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, రోజువారీ ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు కూడా కాలేయ ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటిలో బ్లాక్ కాఫీ ఒకటి. ఉదయం నిద్రలేవగానే చాలామంది తాగే ఈ పానీయం కేవలం చురుకుదనాన్ని పెంచడానికే కాకుండా కాలేయాన్ని రక్షించడంలో కూడా సహాయపడుతుందని తాజా సమాచారం సూచిస్తోంది. నియమితంగా కాఫీ తాగే వ్యక్తుల్లో ఫ్యాటీ లివర్ వ్యాధి వచ్చే ప్రమాదం తక్కువగా ఉండటంతో పాటు, ఇప్పటికే ఈ సమస్య ఉన్నవారిలో వ్యాధి పురోగతి నెమ్మదిగా సాగుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే కాలేయంలో మచ్చలు ఏర్పడే ఫైబ్రోసిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా కాఫీ ఉపయోగపడుతుందని వారు వివరిస్తున్నారు. కాఫీ కాలేయానికి మేలు చేయడానికి ప్రధాన కారణం ఇందులో ఉండే సహజ సమ్మేళనాలే. ముఖ్యంగా క్లోరోజెనిక్ యాసిడ్, కెఫిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో వాపులను తగ్గించే లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి కణాలను దెబ్బతినకుండా కాపాడటంతోపాటు జీవక్రియలను మెరుగుపరచడంలోనూ సహాయపడతాయి. శరీరంలోని అన్ని ప్రధాన జీవక్రియలలో కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి కాఫీలోని యాంటీ ఆక్సిడెంట్లు వాపును నియంత్రించడం, జీవక్రియలను మెరుగుపరచడం ద్వారా కాలేయ ఆరోగ్యానికి పరోక్షంగా మద్దతు ఇస్తాయి. అందుకే బ్లాక్ కాఫీని లివర్-ఫ్రెండ్లీ పానీయంగా పరిగణిస్తారు. అయితే కాఫీ మాత్రమే ఫ్యాటీ లివర్ సమస్యకు పరిష్కారం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మధుమేహం వంటి కారణాలతో ముడిపడి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో కాలేయంలో అధిక కొవ్వు పేరుకుపోయి వాపు, మచ్చలు, తీవ్రమైన సందర్భాల్లో కాలేయ వైఫల్యానికి కూడా దారితీస్తుంది. కాబట్టి కాఫీ తాగడం వల్ల మాత్రమే ఫ్యాటీ లివర్ పూర్తిగా తగ్గిపోతుందని భావించడం సరైంది కాదు. సమతుల ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, బరువు నియంత్రణ, మద్యం వినియోగాన్ని తగ్గించడం, వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలు కూడా అంతే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. కాఫీ ఎంపిక విషయంలో కూడా జాగ్రత్త అవసరం. పాలు కలపకుండా బ్లాక్ కాఫీ తాగడం ఉత్తమమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా అధిక చక్కెర, సిరప్‌లు, విప్డ్ క్రీమ్ కలిపిన కాఫీ పానీయాలను నివారించాలని సూచిస్తున్నారు. ఇవి బరువు పెరగడానికి, జీవక్రియ సమస్యలకు కారణమై ఫ్యాటీ లివర్ పరిస్థితిని మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉంటుంది. సాధారణంగా ఆరోగ్యవంతులైన పెద్దలు రోజుకు రెండు నుంచి మూడు కప్పుల బ్లాక్ కాఫీ తాగవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అయితే కెఫిన్‌కు సున్నితంగా స్పందించే వారు, గర్భిణులు, గుండె లేదా ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు, ఆందోళన సమస్యలు లేదా నిద్రలేమితో బాధపడేవారు, కొన్ని మందులు వాడుతున్నవారు కాఫీ పరిమాణాన్ని పెంచే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. కెఫిన్ వినియోగాన్ని తగ్గించాలని భావించే వారికి డీకెఫినేటెడ్ కాఫీ కూడా ఒక ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలితోపాటు పరిమిత మోతాదులో బ్లాక్ కాఫీ తీసుకోవడం కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయకారిగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## కొందరు మహిళలకు ముందస్తు మెనోపాజ్ ఎందుకు వస్తుంది..



గర్భధారణ సమస్యలు కేవలం సంతానం పొందడంలో ఇబ్బందులకే పరిమితం కావని, మహిళల దీర్ఘకాలిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రాథమిక వంధ్యత్వం (ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ) చరిత్ర ఉన్న మహిళలు ఇతర మహిళలతో పోలిస్తే రుతుక్రమం శాశ్వతంగా ఆగిపోయే దశ మెనోపాజ్‌ను ముందుగానే ఎదుర్కొనే అవకాశం ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం ఫలితాలు మహిళల పునరుత్పత్తి ఆరోగ్యం, భవిష్యత్తు ఆరోగ్య పరిస్థితుల మధ్య ఉన్న సంబంధంపై మరింత అవగాహన కల్పిస్తున్నాయి. మెనోపాజ్ మహిళల జీవితంలో సహజంగా సంభవించే జీవసంబంధ దశ. ఈ దశలో రుతుస్రావం పూర్తిగా నిలిచిపోవడంతోపాటు సంతానోత్పత్తి సామర్థ్యం కూడా ముగుస్తుంది. సాధారణంగా చాలా మంది మహిళలు 50 నుంచి 51 ఏళ్ల మధ్య మెనోపాజ్‌కు చేరుకుంటారు. అయితే 45 ఏళ్లలోపు మెనోపాజ్ రావడాన్ని ఎర్లీ మెనోపాజ్‌గా, 40 ఏళ్లలోపు రావడాన్ని ప్రీమేచ్యూర్ మెనోపాజ్‌గా పరిగణిస్తారు. ఈ రెండు పరిస్థితులు గుండె జబ్బులు, ఎముకల బలహీనత, జ్ఞాపకశక్తి సంబంధిత సమస్యల ప్రమాదాన్ని పెంచుతాయని ఇప్పటికే పలు అధ్యయనాలు సూచించాయి. ఈ పరిశోధనలో దాదాపు 700 మంది మహిళల ఆరోగ్య వివరాలను దీర్ఘకాలంగా పరిశీలించారు. వారిలో సగం మందికి ప్రాథమిక వంధ్యత్వం ఉన్నట్లు నిర్ధారణ అయింది. అంటే నిర్దిష్ట కాలం పాటు గర్భం దాల్చేందుకు ప్రయత్నించినప్పటికీ, గతంలో ఎప్పుడూ విజయవంతమైన గర్భధారణ జరగని మహిళలను ఈ వర్గంలో చేర్చారు. అధ్యయనంలో పాల్గొన్న మహిళల వివరాలను విశ్లేషించగా, ప్రాథమిక వంధ్యత్వం చరిత్ర ఉన్న మహిళలు సాధారణంగా ఇతర మహిళలతో పోలిస్తే సగటున ఒక సంవత్సరం ముందుగానే సహజ మెనోపాజ్‌కు చేరుకున్నట్లు తేలింది. ముఖ్యంగా కారణం తెలియని వంధ్యత్వం లేదా ఎండోమెట్రియోసిస్ కారణంగా వంధ్యత్వం ఎదుర్కొన్న మహిళల్లో 45 ఏళ్లకు ముందే మెనోపాజ్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే 40 ఏళ్లలోపు వచ్చే ప్రీమేచ్యూర్ మెనోపాజ్‌తో వంధ్యత్వానికి స్పష్టమైన సంబంధం కనిపించలేదు. అయినప్పటికీ ఎర్లీ మెనోపాజ్‌తో ఉన్న బలమైన సంబంధం నిపుణుల దృష్టిని ఆకర్షించింది. వంధ్యత్వం, ముందస్తు మెనోపాజ్ మధ్య సంబంధం ఎందుకు ఉంటుందనే అంశంపై శాస్త్రవేత్తలు ఇంకా పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఒకే రకమైన జీవసంబంధ కారణాలు ఈ రెండు పరిస్థితులకు దోహదపడే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. సాధారణంగా మహిళల అండాశయాల్లోని అండాల సంఖ్య వయసు పెరిగేకొద్దీ తగ్గిపోతుంది. కొంతమందిలో ఈ ప్రక్రియ వేగంగా జరిగితే సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గడమే కాకుండా మెనోపాజ్ కూడా ముందుగానే వచ్చే అవకాశం ఉంటుంది. ఎండోమెట్రియోసిస్ వంటి సమస్యలు కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. గర్భాశయ అంతర్గత పొరలాంటి కణజాలం గర్భాశయం వెలుపల పెరగడం వల్ల ఏర్పడే ఈ వ్యాధి వంధ్యత్వానికి కారణమవడమే కాకుండా ముందస్తు మెనోపాజ్ ప్రమాదాన్ని కూడా పెంచుతుందని గత పరిశోధనలు సూచించాయి. జన్యుపరమైన అంశాలు, హార్మోన్ల మార్పులు, శరీర అభివృద్ధి విధానం, జీవనశైలి వంటి అంశాలు కూడా వంధ్యత్వం, పునరుత్పత్తి వ్యవస్థ వృద్ధాప్య ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని పరిశోధకులు భావిస్తున్నారు. మెనోపాజ్ సమయం మహిళల భవిష్యత్తు ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. మెనోపాజ్ ముందుగానే వస్తే ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు ఎక్కువ కాలం తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.

## ఉదయాన్నే నిద్రలేస్తే ఆరోగ్యానికి ఎన్నో లాభాలు



రాత్రి త్వరగా నిద్రపోయి, ఉదయాన్నే త్వరగా లేవడం మంచి అలవాటు అని పెద్దలు చెబుతుంటారు. ఇలా చేయడం వల్ల రోజువారీ పనులను ప్రశాంతంగా పూర్తి చేసుకోవచ్చు. అంతేకాకుండా శారీరక, మానసిక ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఈ రోజుల్లో చాలా మంది ఆలస్యంగా నిద్రపోయి, ఆలస్యంగా లేస్తున్నారు. ఈ అలవాటు బద్ధకాన్ని పెంచడమే కాకుండా కొన్ని ఆరోగ్య సమస్యలకు కూడా దారితీస్తుంది. జీవనశైలిలో చిన్న మార్పు చేసి, త్వరగా నిద్రపోయి త్వరగా లేవడం అలవాటు చేసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉదయం ఆలస్యంగా లేస్తే పనులన్నీ తొందరపాటుగా చేయాల్సి వస్తుంది. దీంతో ఒత్తిడి పెరుగుతుంది. కానీ త్వరగా నిద్రలేస్తే పనులను ప్రశాంతంగా, సమయానికి పూర్తి చేసుకోవచ్చు. ఇది మనసును తాజాగా ఉంచి ఒత్తిడిని తగ్గిస్తుంది. ఉదయాన్నే లేవడం వల్ల వ్యాయామానికి సమయం దొరుకుతుంది. ఉదయం చేసే వ్యాయామం శరీరానికి శక్తిని అందించడంతో పాటు బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. ఉదయం సమయంలో గాలి స్వచ్ఛంగా ఉంటుంది. ఆ సమయంలో వాకింగ్ లేదా వ్యాయామం చేస్తూ లోతుగా శ్వాస తీసుకోవడం ఊపిరితిత్తులకు మంచిది. దీంతో శ్వాసకోశ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉదయాన్నే త్వరగా లేచే వారు సాధారణంగా రాత్రి కూడా త్వరగా నిద్రపోతారు. దీంతో వారి నిద్ర సమయానికి పూర్తవడంతో పాటు నిద్ర నాణ్యత కూడా మెరుగుపడుతుంది. ఉదయాన్నే లేచి ధ్యానం, నడక లేదా ప్రశాంతంగా గడపడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడి సానుకూల ఆలోచనలు పెరుగుతాయి. ఉదయాన్నే త్వరగా నిద్రలేవడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మనసు కూడా ఉల్లాసంగా ఉంటుంది. రోజును ఉత్సాహంగా ప్రారంభించడానికి ఈ అలవాటు ఎంతో ఉపయోగపడుతుంది.

## థైరాయిడ్ సమస్యలు ఉన్నవారికి మేలు చేసే ఆహారాలు ఇవే..



థైరాయిడ్ గ్రంధి పరిమాణంలో చిన్నదైనా శరీరంలోని అనేక ముఖ్యమైన ప్రక్రియలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. జీవక్రియ (మెటబాలిజం), శక్తి స్థాయిలు, గుండె ఆరోగ్యం, శరీర ఉష్ణోగ్రత, మానసిక స్థితి, జుట్టు ఆరోగ్యం, హార్మోన్ల సమతుల్యత వంటి అంశాలు థైరాయిడ్ పనితీరుపై ఆధారపడి ఉంటాయి. థైరాయిడ్ సక్రమంగా పనిచేయాలంటే కొన్ని ముఖ్యమైన పోషకాలు శరీరానికి తగిన మోతాదులో అందడం అవసరం. ఈ పోషకాల లోపం థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తి, వినియోగం, క్రియాశీలతపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. సెలీనియం థైరాయిడ్ గ్రంథిని రక్షించడంలో, థైరాయిడ్ హార్మోన్లను క్రియాశీల రూపంలోకి మార్చడంలో సహాయపడుతుంది. బ్రెజిల్ నట్స్, ట్యూనా చేప, సన్‌ఫ్లవర్ గింజలు, మష్రూమ్స్‌లో ఇది సమృద్ధిగా లభిస్తుంది. అయోడిన్ థైరాయిడ్ హార్మోన్ల తయారీకి అత్యంత అవసరమైన ఖనిజం. అయోడైజ్డ్ ఉప్పు, సముద్రపు పచ్చి మొక్కలు (సీ వీడ్), రొయ్యలు, కాడ్ చేప, గుడ్లు మంచి వనరులు. ఐరన్ శరీరం థైరాయిడ్ హార్మోన్లను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో సహకరిస్తుంది. రాజగిరా (అమరాంత్), గుమ్మడికాయ గింజలు, గుడ్డు పచ్చసొన, ఆకుకూరల్లో ఇది ఎక్కువగా ఉంటుంది. జింక్ థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి తోడ్పడటంతోపాటు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. శనగలు, గుమ్మడికాయ గింజలు, జీడిపప్పు, హెంప్ గింజలు, ఓయిస్టర్ల ద్వారా జింక్ పొందవచ్చు. టైరోసిన్ అనే అమైనో ఆమ్లం థైరాయిడ్ హార్మోన్ల తయారీలో ఉపయోగపడుతుంది. గుడ్లు, చికెన్, చేపలు, పనీర్, నువ్వుల గింజలు టైరోసిన్‌కు మంచి మూలాలు. విటమిన్ డి థైరాయిడ్ పనితీరుపై ప్రభావం చూపడంతోపాటు రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. సాల్మన్, సార్డిన్ చేపలు, గుడ్డు పచ్చసొన, యూవీ కిరణాలకు గురిచేసిన మష్రూమ్స్, ఫోర్టిఫైడ్ పాల ఉత్పత్తుల్లో ఇది లభిస్తుంది. మెగ్నీషియం క్రియారహిత థైరాయిడ్ హార్మోన్లను క్రియాశీల రూపంలోకి మార్చడంలో సహాయపడుతుంది. బాదం, పాలకూర, అవకాడో, బ్లాక్ బీన్స్, గుమ్మడికాయ గింజలు మంచి వనరులు. విటమిన్ ఎ థైరాయిడ్ హార్మోన్ల జీవక్రియను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చిలగడదుంపలు, క్యారెట్లు, ఎర్ర క్యాప్సికం, కాలేయం (లివర్)లో ఇది సమృద్ధిగా ఉంటుంది. బి-విటమిన్లు శక్తి ఉత్పత్తి, జీవక్రియ ప్రక్రియలకు అవసరం. ఇవి థైరాయిడ్ నియంత్రించే ముఖ్యమైన శారీరక విధులకు మద్దతు ఇస్తాయి. న్యూట్రిషనల్ ఈస్ట్, పప్పుధాన్యాలు, సాల్మన్ చేప, ఆకుకూరల్లో బి-విటమిన్లు లభిస్తాయి. అయితే ఈ పోషకాలు థైరాయిడ్ ఆరోగ్యానికి ఉపయోగకరమైనప్పటికీ, ఇప్పటికే థైరాయిడ్ సంబంధిత సమస్యలు ఉన్నవారు లేదా ఆహారంలో పెద్ద మార్పులు చేయాలనుకునేవారు వైద్య నిపుణుల సలహా తీసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

## గసగసాలను అంత తేలిగ్గా తీసుకోవద్దు..



గసగసాలు సాధారణంగా చల్లదనాన్ని అందించే ఆహార పదార్థంగా ప్రసిద్ధి చెందాయి. అయితే వీటి ప్రయోజనాలు అంతటితో ముగియవు. నిపుణుల అభిప్రాయం ప్రకారం సరైన మోతాదులో తీసుకుంటే గసగసాలు రాత్రిపూట మంచి నిద్రకు తోడ్పడటంతోపాటు పగటిపూట జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి. ముఖ్యంగా తీవ్రమైన వేసవి కాలంలో శరీరానికి చల్లదనాన్ని అందించడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడటంలో ఇవి ఉపయోగకరంగా ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. పోషక విలువలు గసగసాలలో సమృద్ధిగా ఉంటాయి. వీటిలో ప్రోటీన్, పీచు, ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లు, వివిధ సూక్ష్మ పోషకాలు పుష్కలంగా ఉంటాయి. గసగసాల నుంచి తీసే నూనెలో కూడా పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు, ముఖ్యంగా లినోలిక్ ఆమ్లం అధికంగా ఉంటుంది. ఈ పోషకాలు శరీరానికి శక్తిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పరిశోధనల ప్రకారం గసగసాల్లో ఉండే కొన్ని సమ్మేళనాలు నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ముఖ్యంగా వీటిలో ఉండే మెగ్నీషియం నాడీ వ్యవస్థ పనితీరుకు మద్దతు ఇవ్వడంతోపాటు రాత్రిపూట కలిగే అస్థిరతను తగ్గించడంలో సహకరిస్తుంది. దీంతో సహజ నిద్ర చక్రం మెరుగుపడే అవకాశం ఉంటుంది. గసగసాల్లో కాల్షియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. ఇవి శరీరంలోని వివిధ అవయవాల ఆరోగ్యానికి తోడ్పడతాయి. అయితే గసగసాల ప్రయోజనాలు పూర్తిగా పొందాలంటే వాటిని సరైన మోతాదులో, శరీరం సులభంగా జీర్ణించుకోగల రూపంలో తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణక్రియ, పేగుల ఆరోగ్యానికి కూడా గసగసాలు ఉపయోగపడతాయి. వీటిలో అధికంగా ఉండే పీచు జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా వేసవిలో శరీరంలో వేడి ప్రభావం ఎక్కువగా ఉన్నప్పుడు పేగుల ఆరోగ్యాన్ని కాపాడటానికి పీచు పదార్థాలు అవసరం. గసగసాల్లోని ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా గసగసాలు జీర్ణవ్యవస్థపై శాంతిదాయక ప్రభావాన్ని చూపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలను కొంతవరకు తగ్గించడంలో సహాయపడే అవకాశం ఉంటుంది. అయితే ఇవి వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలి. క్లినికల్ న్యూట్రిషనిస్ట్‌లు తెలిపిన వివరాల ప్రకారం గసగసాల్లోని పోషకాలు, బయో యాక్టివ్ సమ్మేళనాలు సమగ్ర ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అయితే ప్రతి వ్యక్తి శరీరతత్వం, జీర్ణశక్తి, జీవనశైలి, వాతావరణ పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే వీటిని ఆహారంలో చేర్చుకోవాలి. నిపుణుల ప్రకారం గసగసాల వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాల్లో సహజ నిద్ర చక్రానికి మద్దతు ఇవ్వడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, శరీర శక్తి స్థాయిలను నిలబెట్టడం, పోషక విలువలను అందించడం ఉన్నాయి. అయితే ఇవి ఎంత మోతాదులో తీసుకోవాలన్నది వ్యక్తిగత అవసరాలపై ఆధారపడి ఉంటుంది. గసగసాలను తీసుకునే విధానంలో జాగ్రత్త అవసరం. రాత్రంతా నానబెట్టి తీసుకోవడం ఒక సాధారణ పద్ధతి.

## ఉదయాన్నే ఛాతిలో మంటల, కడుపు ఉబ్బరం ఉంటున్నాయా.. కారణాలు ఇవే..

నేటి వేగవంతమైన జీవనశైలిలో ఉదయం లేవగానే ఛాతీలో మంట, నోటిలో పుల్లని రుచి, కడుపులో ఉబ్బరం వంటి సమస్యలు చాలా మందిని ఇబ్బంది పెడుతున్నాయి. చాలామంది దీనికి మసాలా ఆహారం లేదా జీర్ణ సమస్యలే కారణమని భావిస్తారు. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం రాత్రి భోజనం చేసే సమయం కూడా ఉదయపు యాసిడ్ రిఫ్లక్స్‌కు ప్రధాన కారణంగా మారుతుంది. ముఖ్యంగా ఆలస్యంగా భోజనం చేసి వెంటనే నిద్రపోవడం వల్ల ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. రాత్రి ఆలస్యంగా భోజనం చేయడం వల్ల జీర్ణవ్యవస్థకు సరైన సమయం దొరకదు. భోజనం చేసిన వెంటనే పడుకోవడంతో పొట్టలోని ఆమ్లాలు పైకి ఎగసి అన్నవాహికలోకి చేరే అవకాశం పెరుగుతుంది. పరిశోధనల ప్రకారం భోజనం చేసిన తర్వాత కనీసం మూడు గంటల వ్యవధి లేకుండా నిద్రపోతే గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ వ్యాధి (GERD) ప్రమాదం అధికమవుతుంది. ఆలస్యంగా భోజనం చేయడం శరీరంలోని జీవక్రియలపై కూడా ప్రభావం చూపుతుంది. రాత్రి సమయంలో ఇన్సులిన్ స్పందన తగ్గిపోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు సరిగా నియంత్రణ కావు. అదే సమయంలో నిద్రకు సహాయపడే మెలటోనిన్ హార్మోన్ విడుదలవుతుంది, జీర్ణక్రియ కొనసాగడం వల్ల శరీరంలో హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. దీంతో ఉదయం లేవగానే అలసట, భారంగా అనిపించడం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు కనిపిస్తాయి. రాత్రివేళల్లో కొవ్వును కరిగించే ప్రక్రియ కూడా మందగిస్తుంది. ఈ సమయంలో ఎక్కువగా లేదా భారమైన ఆహారం తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు కొవ్వుగా నిల్వయ్యే అవకాశం పెరుగుతుంది. దీర్ఘకాలంలో ఇది బరువు పెరగడానికి కూడా దారితీస్తుంది. యాసిడ్ రిఫ్లక్స్‌కు మరో ముఖ్య కారణం అన్నవాహిక, జీర్ణాశయం మధ్య ఉండే కండరాల వాల్వ్‌పై పడే ఒత్తిడి. నిలబడి ఉన్నప్పుడు లేదా నడుస్తున్నప్పుడు గురుత్వాకర్షణ కారణంగా కడుపులోని ఆమ్లాలు కిందనే ఉంటాయి. కానీ కడుపు నిండుగా ఉండగానే పడుకోవడం వల్ల ఈ వాల్వ్‌పై ఒత్తిడి పెరిగి ఆమ్లాలు పైకి రావడానికి అవకాశం కలుగుతుంది. ఈ సమస్యను తగ్గించేందుకు రాత్రి భోజనాన్ని సాధ్యమైనంత వరకు సాయంత్రం 7 నుంచి 7.30 గంటల మధ్య పూర్తిచేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. నిద్రకు కనీసం 3 గంటల ముందే భోజనం ముగిస్తే కడుపు ఖాళీ అయ్యేందుకు తగిన సమయం లభించి రిఫ్లక్స్ ప్రమాదం తగ్గుతుంది. భోజన సమయంతో పాటు కొన్ని జీవనశైలి మార్పులు కూడా ప్రయోజనకరంగా ఉంటాయి. ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణాశయ ఆమ్లాలు అన్నవాహికలోకి చేరే అవకాశాలు తగ్గుతాయి. అలాగే మంచం తల భాగాన్ని ఆరు నుంచి ఎనిమిది అంగుళాల మేర ఎత్తుగా ఉంచితే గురుత్వాకర్షణ సహాయంతో ఆమ్లాలు పైకి రావడం నివారించవచ్చు. భోజనంచేసిన తర్వాత చక్కెర లేని చూయింగ్ గమ్ నమలడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. దీనివల్ల లాలాజలం ఎక్కువగా ఉత్పత్తి అయి పొట్టలో ఆమ్లాల ప్రభావాన్ని కొంత మేర తగ్గించడంలో సహాయపడుతుంది. ఉదయపు యాసిడ్ రిఫ్లక్స్‌ను నియంత్రించడంలో భోజనం చేసే సమయం కీలక పాత్ర పోషిస్తుంది.



## అర్హటిక్ యోగాతో చెక్ పెట్టండిలా..

ప్రస్తుత సమాజంలో మనిషి మానసిక సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు. ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యలు సర్వసాధారణం అయిపోయాయి. ఆందోళన, ఒత్తిడి కారణంగా ప్రాణాలు తీసుకుంటున్న వారు లేకపోలేదు. మానసిక సమస్యలతో నరకం చూస్తున్న వారికి యోగా ఓ వరమని చెప్పటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. మరీ ముఖ్యంగా అర్హటిక్ యోగా టెక్నిక్ ద్వారా నాడీ వ్యవస్థ పని తీరు మెరుగుపడుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. ఎమోషనల్ స్టెబిలిటీ వస్తుంది. వరల్డ్ ప్రాణిక్ హీలింగ్,



ఇండియా డైరెక్టర్ శ్రీరామ్ రాజగోపాల్ అర్హటిక్ యోగా గురించి మాట్లాడుతూ.. 'అర్హటిక్ యోగాను గ్రాండ్ మాస్టర్ చోవా కోక్ సుయ్ అభివృద్ధి చేశారు. మెంటల్ క్లారిటీ పెంచడం, ఆందోళనను తగ్గించటం, మానసిక ఆరోగ్యం మెరుగుపర్చటం కోసం అర్హటిక్ యోగాను ఆయన అభివృద్ధి చేశారు' అని తెలిపారు. అర్హటిక్ యోగాలో బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు.. అర్హటిక్ కుండలిని, అర్హటిక్ ధ్యానం వంటి మెడిటేషన్ టెక్నిక్స్.. ఎనర్జీ ప్యూరిఫికేషన్ మెథడ్స్ ఉంటాయి. అర్హటిక్ యోగాను రోజూ చేయటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఎమోషన్స్, ఆలోచనలపై కంట్రోల్ వస్తుంది. మైండ్ ఫోకస్ పెరుగుతుంది.

## వ్యాయామానికి ముందు వార్మప్ తప్పనిసరి..

ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. అయితే చాలా మంది వ్యాయామం చేసే ముందు వార్మప్ చేయడాన్ని నిర్లక్ష్యం చేస్తారు. కానీ వ్యాయామానికి ముందు శరీరాన్ని వార్మప్ చేయడం వల్ల శరీరం వ్యాయామానికి సిద్ధమవుతుంది. దీంతో వ్యాయామ ఫలితాలు మెరుగుపడతాయని నిపుణులు చెబుతున్నారు. వార్మప్ అనేది వ్యాయామానికి ముందు చేసే తేలికపాటి శారీరక కదలికలు లేదా స్ట్రెచింగ్ వ్యాయామాలు. సాధారణంగా 5 నుంచి 10 నిమిషాల పాటు జాగింగ్, జంపింగ్ జాక్స్, ఆర్మ్ స్వింగ్స్, స్ట్రెచింగ్ వంటి వ్యాయామాలు చేయడం ద్వారా శరీరాన్ని వ్యాయామానికి సిద్ధం చేస్తారు. ఎలా అయితే వాహనాన్ని స్టార్ట్ చేసిన వెంటనే వేగంగా నడపకుండా కొంతసేపు ఇంజిన్‌ను వేడెక్కిస్తామో, అలాగే వ్యాయామానికి ముందు కూడా శరీరాన్ని క్రమంగా సిద్ధం చేయాలి. వార్మప్ చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది, కండరాలకు రక్తప్రసరణ మెరుగవుతుంది. దీంతో శరీరం వ్యాయామాన్ని సులభంగా తట్టుకోగలుగుతుంది. వార్మప్ లేకుండా నేరుగా కఠినమైన వ్యాయామాలు చేస్తే కండరాలపై ఒక్కసారిగా ఒత్తిడి పడుతుంది. దీంతో కండరాల నొప్పులు, కండరాలు పట్టేయడం, గాయాలు అయ్యే ప్రమాదం పెరుగుతుంది. అందుకే వ్యాయామానికి ముందు తప్పనిసరిగా వార్మప్ చేయాలని ఫిట్‌నెస్ నిపుణులు సూచిస్తున్నారు. శరీరం ముందుగానే సిద్ధమవడంతో వ్యాయామాన్ని ఎక్కువసేపు, మరింత సమర్థవంతంగా చేయగలుగుతారు. కండరాలు, కీళ్లు మరింత చురుకుగా మారి కదలికలు సులభమవుతాయి. వార్మప్ శరీరాన్నే కాదు, మనసును కూడా వ్యాయామానికి సిద్ధం చేస్తుంది. దీంతో దృష్టి కేంద్రీకరణ పెరిగి మెరుగైన ఫలితాలు పొందవచ్చు.

వ్యాయామం ఎంత ముఖ్యమో, దానికి ముందు వార్మప్ చేయడం కూడా అంతే ముఖ్యం. కేవలం 5 నుంచి 10 నిమిషాలు వార్మప్ చేయడం ద్వారా గాయాల ప్రమాదాన్ని తగ్గించుకోవడంతో పాటు వ్యాయామం నుంచి మరింత మంచి ఫలితాలు పొందవచ్చు. కాబట్టి ప్రతి వ్యాయామానికి ముందు వార్మప్‌ను అలవాటుగా మార్చుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.



## టాటా మోటార్స్‌కు 3,400 విద్యుత్తు వాహన ఆర్డర్లు

విద్యుత్తు విభాగంలో భారీ వాణిజ్య వాహనాలకు టాటా మోటార్స్ ఆర్డర్లు దక్కించుకుంది. సరకు రవాణా, లాజిస్టిక్స్, ప్రయాణికుల విభాగాల్లో కలిపి మొత్తం 3,400 వాహనాల కోసం ఆర్డర్లు పొందినట్లు కంపెనీ ప్రకటించింది. ఇందులో 2,000 చిన్న వాణిజ్య వాహనాలు, పికప్‌లు, 200 ట్రక్కులు, 500 విద్యుత్ బస్సులున్నాయి. ఈ వాహనాలను ఇ-కామర్స్, లాజిస్టిక్స్, ఎఫ్ఎమ్‌సీజీ, నగరాల్లో సరకు రవాణా, సిమెంట్, స్టీల్, గనులు, టార్మాక్ కార్యకలాపాలు, నగరాల మధ్య ప్రయాణికుల రవాణా సేవలకు వినియోగించనున్నారు. విభిన్న రంగాల నుంచి భారీ ఎత్తున వాహన ఆర్డర్లు లభించడం, కంపెనీపై వినియోగదార్లకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని టాటా మోటార్స్ తెలిపింది.




# ఓఎన్‌జీసీ ఇకపై గ్యాస్-చమురు కంపెనీ



ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ గ్యాస్ కార్పొరేషన్)ని ఇకపై చమురు-గ్యాస్ కంపెనీగా కాకుండా, గ్యాస్-చమురు కంపెనీగా చూడాలని సంస్థ ఛైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ సూచించారు. ముడిచమురుతో పోలిస్తే సహజ వాయువు ఉత్పత్తి వేగంగా పెరుగుతుండటంతో, కంపెనీ పోర్ట్‌ఫోలియోలో వ్యూహాత్మక మార్పు రావడం ఇందుకు కారణం. 'ప్రస్తుతం మా పోర్ట్‌ఫోలియోలో చమురు కంటే గ్యాస్ వాటా కొంచెం ఎక్కువగా ఉంది. కొత్తగా నిల్వలను కనుగొనకపోవడంతో, చమురు ఉత్పత్తి స్థిరంగా ఉన్నప్పటికీ, ఓఎన్‌జీసీ భవిష్యత్తు వృద్ధి అంతా గ్యాస్ ఆధారంగానే సాగనుంది' అని సింగ్ పేర్కొన్నారు. ప్రభుత్వ ధరల సంస్కరణల ప్రకారం కొత్త బావుల నుంచి వచ్చే 'న్యూ వెల్ గ్యాస్' ధరను ముడిచమురు ధరలో 12 శాతానికి అనుసంధానించారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినందున, గ్యాస్ వ్యాపారం లాభదాయకంగా మారింది. ప్రస్తుతం ఓఎన్‌జీసీ మొత్తం గ్యాస్ ఉత్పత్తిలో 'న్యూ వెల్ గ్యాస్' వాటా నాలుగో వంతుగా ఉంది. రాబోయే కాలంలో ఇది 30-36 శాతానికి చేరి, భవిష్యత్తులో ప్రధాన వనరుగా మారనుంది. రవాణా రంగంతో పాటు దేశీయంగా గ్యాస్‌కు భారీగా డిమాండ్ పెరుగుతోంది. డీయూడీపీ, డీఎస్ఎఫ్ క్షేత్రాలు వంటి ప్రాజెక్టులు, కేజీ బేసిన్‌లోని 98/2 ఆఫ్‌షోర్ బావుల ద్వారా ఏటా గ్యాస్ ఉత్పత్తిలో 7-8% వృద్ధిని ఓఎన్‌జీసీ లక్ష్యంగా పెట్టుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి ఇవి అందుబాటులోకి రానున్నాయి. సముద్రగర్భంలో ఉత్పత్తి పెంచడానికి కంపెనీ ప్రస్తుతం రూ.33,000 కోట్ల విలువైన ఆఫ్‌షోర్ ప్రాజెక్టులు అమలు చేస్తోంది. ప్రస్తుత ఉత్పత్తికి ప్రధానంగా ఉన్న పశ్చిమ తీర బావుల సాంకేతిక నిర్వహణ కోసం బ్రిటిష్ పెట్రోలియం (బీపీ)తో 100% టెక్నికల్ సర్వీస్ భాగస్వామ్యాన్ని సంస్థ కుదుర్చుకుంది. కంపెనీ ఏటా దాదాపు 500 బావులు తవ్వుతుండగా, 2025-26లో రిజర్వ్ రీప్లేస్‌మెంట్ రేషియో 1.1 కంటే ఎక్కువగా నమోదైంది. అంటే వాడుతున్న నిల్వల కంటే ఎక్కువగా కొత్త వాటిని కంపెనీ కనుగొంటోంది.

# మళ్లీ టారిఫ్‌లకు ట్రంప్ రెండు ఆయుధాలు సిద్ధం..



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (Donald Trump) ప్రపంచ వాణిజ్యంపై పగబట్టినట్లున్నారు. ఇప్పటికే ఆయన విధించిన టారిఫ్‌లు చెల్లుబాటు కావని ఆ దేశ సుప్రీం కోర్టు తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ట్రంప్ (Donald Trump) ప్రపంచ దేశాలపై పన్నులు విధించేందుకు మరో రెండు సరికొత్త ఆయుధాలను సిద్ధం చేశారు. వీటిల్లో ఒకటి వెట్టిచాకిరీ చేయించే దేశాల జాబితా కాగా.. మరొకటి అదనపు పారిశ్రామిక సామర్థ్యం. చౌకగా అందుబాటులో ఉండే కార్మికులను, పరిశ్రమలను వాడుకుని భారీగా ఉత్పత్తి చేయగలిగే దేశాలపై ఈ నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపించనుంది. అమెరికా అధ్యక్షుడికి చట్టపరమైన అధికారం ఉన్న ట్రేడ్ యాక్ట్ 1974లోని సెక్షన్ 301ని అగ్రరాజ్యం ఆయుధంగా చేసుకోనుంది. ఇప్పటికే ట్రంప్ విధించిన 10% పన్నుల గడువు జులై 10వ తేదీతో ముగియనుంది. ఆ తర్వాత కొన్ని దేశాలపై టారిఫ్‌లు ఎక్కువగా.. మరికొన్నింటిపై తక్కువగా ఉంటాయి. అమెరికాతో వాణిజ్యానికి సంబంధించి ఇప్పటికే భారత్ తాత్కాలిక ఒప్పందంపై సంతకాలు చేయగా.. బ్రిటన్, ఐరోపా సమాఖ్య, దక్షిణ కొరియా, యూకే వంటి దేశాలు ట్రేడ్ డీల్స్ చేసుకున్నాయి. ముఖ్యంగా ఆటోమొబైల్స్‌పై పన్నులు తగ్గించేందుకు వీటిల్లో చాలా దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ తీసుకురాబోయే కొత్త పన్నుల ప్రభావం ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు భారత్‌తో పూర్తిస్థాయి వాణిజ్య చర్చలు చివరి దశకు చేరుకోవడంతో అమెరికా ప్రతినిధి జెమీసన్ గ్రీర్ నేడు న్యూఢిల్లీకి చేరుకొన్నారు. ఈ సందర్భంగా సుంకాలపై ఇరు దేశాల మధ్య చర్చలు జరిగే అవకాశం ఉంది.

# ఈ వారం 3 ఐపీఓలు..

పశ్చిమాసియాలో మెరుగుపడుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు మదుపర్ల సెంటిమెంటును పెంచడంతో.. దేశీయంగా కంపెనీలు తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)ల ద్వారా నిధుల సమీ




కరణకు ముందుకొస్తున్నాయి. ఈ వారం 3 ప్రధాన (మెయిన్‌బోర్డు) ఐపీఓలు ప్రారంభం కానున్నాయి. మరిన్ని పబ్లిక్ ఇష్యూలకూ మార్గం సుగమమైంది. కార్డెలియా క్రూయిజెస్ ఆపరేటర్ వాటర్‌వేస్ లీజర్ టూరిజం, జైపుర్‌కు చెందిన ఆభరణాల తయారీ సంస్థ అద్విత్ జువెల్స్, ఐటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సీఎస్ఎం టెక్నాలజీస్ తమ తొలి పబ్లిక్ ఆఫర్లను ఈ వారం ప్రారంభించనున్నాయి. ప్యాకేజింగ్ సొల్యూషన్స్ సంస్థ నాక్ ప్యాకేజింగ్ తన ఇష్యూ ధరల శ్రేణిని ఈ వారమే ప్రకటించే అవకాశం ఉంది. క్విక్ కామర్స్ యూనికార్న్ జెప్టో ఐపీఓ ద్వారా రూ.10,000 కోట్లకు పైగా నిధులు సమీకరించాలని చూస్తుండగా, దేశంలోనే అతి పెద్ద ఫండ్ హౌస్ అయిన ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, జులైలో తన రూ.13,000 కోట్ల పబ్లిక్ ఇష్యూను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. జూన్‌లో సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్, హెక్సాగన్ న్యూట్రిషన్ ఇప్పటికే తమ ఐపీఓలను ప్రారంభించగా, ఇన్సూర్‌టెక్ యూనికార్న్ టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూ ప్రస్తుతం కొనసాగుతోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ), రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్, టెలికాం విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ గత వారం మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తమ ముసాయిదా పత్రాలను దాఖలు చేశాయి. ఆ రెండు మెగా ఇష్యూలూ త్వరలోనే రాబోతున్నాయి.

## 1,000 మంది ఉద్యోగులను తీసేసి..



పలు రంగాల్లో ఉపాధి అవకాశాలపై కృత్రిమ మేధ, రోబోటిక్స్ గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. దేశీయ, ప్రపంచస్థాయి కంపెనీల్లో లేఆఫ్‌లకు ఏఐ టూల్స్, రోబోలు ప్రధాన కారణంగా మారుతున్నాయి. తాజాగా అమెరికాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం జనరల్ మోటార్స్ 1000కి పైగా ఉద్యోగాలను తొలగించింది. ఆ స్థానాలను రోబోలతో భర్తీ చేసింది. ఈ మార్పు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. మిషిగన్‌లోని తన కేంద్రకార్యాలయంలో కొలాబరేటివ్ రోబోట్స్ (కోబోట్స్)ను జనరల్ మోటార్స్ విధుల్లోకి తీసుకువచ్చింది. వాహనాల అసెంబ్లింగ్‌లో మిగతా ఉద్యోగులతో కలిసి కోబోట్స్ పనిచేస్తున్నాయి. తమ కార్యకలాపాల్లోకి అధునాతన సాంకేతికతను చొప్పించే ప్రయత్నాల్లో భాగంగా ఈ రోబోలను తీసుకొచ్చామని కంపెనీ ప్రతినిధి కెవిన్ కెల్లీ వెల్లడించారు. అన్ని భద్రతా నియమాలను పాటిస్తూనే, తమ ఉత్పత్తులు పోటీని తట్టుకునేలా చూసుకునేందుకు ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అయితే జనరల్ మోటార్స్ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెషిన్లు తమ ఉద్యోగాలను లాగేసుకుంటున్నాయని ట్రేడ్ యూనియన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ''వెయ్యి ఉద్యోగాలు పోయాయి.. ఇప్పుడు రోబోలు వచ్చాయి. ఇదే భవిష్యత్తు అంటున్నారు.

# మన ప్రైవేటు రంగానికి రూ.9,500 కోట్ల రుణాలు




ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) ప్రైవేట్ రంగ పెట్టుబడుల్లో, ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. దేశ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా వివిధ ప్రాజెక్టుల కోసం ఈ ఏడాదిలో 1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.9,500 కోట్ల) ప్రత్యక్ష రుణాలు అందించాలని ఏడీబీ లక్ష్యంగా పెట్టుకుంది. '2025లో సొంత మూలధనం నుంచి భారత ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం 4 బి.డాలర్లు, ప్రైవేట్ రంగం కోసం 1 బి.డాలర్ల కంటే ఎక్కువ రుణాలు అందించాం' అని ఏడీబీ వైస్ ప్రెసిడెంట్ (మార్కెట్ సొల్యూషన్స్) భార్గవ్ దాస్‌గుప్తా తెలిపారు. సొంత నిధులతో పాటు అంతర్జాతీయ వనరుల నుంచి మరో బిలియన్ డాలర్లను ఏడీబీ సమీకరించింది. దీంతో గతేడాది భారత ప్రైవేట్ రంగానికి ఏడీబీ నుంచి 2 బి.డాలర్లు అందాయి. ఈ ఏడాది కూడా అదే వేగాన్ని కొనసాగిస్తామని దాస్‌గుప్తా స్పష్టం చేశారు. భారత ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రైవేట్ రంగంలో పునరుత్పాదక, స్వచ్ఛ ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, ఇ-మొబిలిటీ, గ్రీన్ డేటా కేంద్రాలు, పట్టణ మౌలిక సదుపాయాలు, సుస్థిర వ్యవసాయం, ఆర్థిక సేవల విభాగాలకు ఏడీబీ రుణాలు ఇవ్వనుంది. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితులతో 2026 మొదటి 4 నాలుగు నెలల్లోనే ఏడీబీ ట్రేడ్ అండ్ సప్లయ్ చెయిన్ ఫైనాన్సింగ్‌ను ఏకంగా 40% వృద్ధి నమోదు చేసింది.






## టీజీ20 లీగ్.. నల్గొండ నైట్స్‌తో మ్యాచ్.. రంగారెడ్డి రైజర్స్ ఫస్ట్ బౌలింగ్

టీజీ20 లీగ్ రెండో రోజు రెండు మ్యాచులతో అలరించనుంది. తొలి మ్యాచ్ రంగారెడ్డి రైజర్స్ - నల్గొండ నైట్స్ జట్ల మధ్య జరుగుతోంది. టాస్ నెగ్గిన రంగారెడ్డి రైజర్స్ బౌలింగ్ ఎంచుకుని ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది.

రంగారెడ్డి రైజర్స్: తనయ్ త్యాగరాజన్ (కెప్టెన్), ఆరోన్ వర్గీస్, అవనీశ్ రావు ఆరవెల్లి, అలంకృత్ రాపోల్, జ్ఞాన ప్రకాశ్ రెడ్డి, ఆదిత్య జవ్వాజి, నితిన్ సాయి యాదవ్, రాకేశ్ నానావత్, అరుణ్ కుమార్, పున్నయ్య భువనగిరి, ఆర్యన్ చరియప్ప. నల్గొండ నైట్స్: ప్రణవ్ సూర్యదేవర, గౌరవ్ రెడ్డి, నితీశ్ రెడ్డి, రాహుల్ బుద్ధి (కెప్టెన్), వరుణ్ గౌడ్, ఎండీ అర్బాజ్ అహ్మద్, అనికేత్ రెడ్డి, హర్షవర్ధన్ సింగ్, దివేశ్ సింగ్, రక్షన్ రెడ్డి, నిశాంత్ సరాను

# అమెరికా లాకర్ రూమ్‌లో ఇరాన్ జట్టు నోట్..

పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గించేందుకు ఒకవైపు శాంతి చర్చలు జరుగుతుంటే.. మరోవైపు ఫిఫా వరల్డ్‌కప్‌లో భాగంగా అమెరికాలో ఇరాన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఆడుతోంది. న్యూజిలాండ్, బెల్జియంతో ఇరాన్ ఆడిన మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఓటమిలేకుండా ముందుకు సాగుతుండటంతో ఇంకా నాకౌట్ రేసులోనే ఉన్న ఈ జట్టు.. తర్వాతి మ్యాచ్‌లో ఈజిప్ట్‌తో పోటీ పడనుంది. కాగా.. లాస్‌ఏంజెలెస్‌లో బెల్జియంతో మ్యాచ్ అనంతరం లాకర్ రూమ్‌లో ఇరాన్ జట్టు (Iran Football Team) ఉద్వేగపూరిత లేఖను ఉంచింది. ఆ లేఖలోని సందేశాన్ని ఇరాన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ తాజాగా విడుదల చేసింది. టోర్నీలో తమకు లభించిన ఆతిథ్యానికి ఇరాన్ ఆ లేఖలో దేశాల మధ్య శాంతి, స్నేహం, పరస్పర గౌరవం వర్ధిల్లాలని కోరుకుంటున్నాం'' అని టెహ్రాన్ రాసుకొచ్చింది. అలాగే #168, #Minab పదాలను జోడించింది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ దాడులు మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. అప్పుడు మినాబ్‌లోని ఓ పాఠశాలను అమెరికాకు చెందిన తోమహాక్ క్షిపణి తాకింది. ఈ ఘటనలో 160 మందికి పైగా చిన్నారులు, టీచర్లు ప్రాణాలు కోల్పోయారు. ఆ విషాదాన్ని ఉద్దేశించే మినాబ్, 168 పదాలను ఆటగాళ్లు తమ లేఖలో ప్రస్తావించారు. ఇదిలా ఉంటే.. టోర్నమెంట్‌లో భాగంగా ఇరాన్ వసతి ఏర్పాట్లు కూడా చర్చనీయాంశమవుతున్నాయి. ఆ జట్టు ఒకేసారి 48 గంటలకు మించి అమెరికాలో ఉండేందుకు ఇమిగ్రేషన్ అధి



కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లను ప్రస్తావించిన ఆ జట్టు.. శాంతి కోసం అభ్యర్థించింది. ''వేల సంవత్సరాల నాటి ప్రాచీన పర్షియా నుంచి ఇప్పటివరకు ఇరాన్ స్ఫూర్తి సజీవంగా, స్థిరంగా ఉంది. ఎంతో గర్వంగా లాస్‌ఏంజెలెస్‌కు వచ్చాం. సగౌరవంగా పోటీపడ్డాం. హుందాగా ఈ నగరాన్ని వీడుతున్నాం. ఇరాన్ జట్టుకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. అన్ని కారులు అనుమతించలేదు. దాంతో ఇరాన్ జట్టు ప్రతి మ్యాచ్ కోసం మెక్సికోలోని టిజువానా నుంచి సరిహద్దులు దాటి, అమెరికాకు వస్తోంది. అలాగే జట్టు వెంట వచ్చే ప్రతినిధులు వీసా తిరస్కరణ వంటి సవాళ్లు ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ దాటుకొని ఫిఫా ప్రపంచకప్‌లో ఇరాన్ టీమ్ గట్టి పోటీ ఇస్తోంది. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సోషల్ మీడియాలో మీమ్స్ మొదలయ్యాయి.

# ఇంగ్లాండ్‌కు ఐసీసీ భారీ షాక్!

న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-1తో సమంగా ఉంది. మొదటి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ గెలవగా.. రెండో మ్యాచ్‌లో కివీస్ 253 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండో టెస్టుకు రెగ్యులర్ సారథి బెన్ స్టోక్స్ దూరం కాగా.. ఘోర పరాజయం చవిచూసింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్‌కు ఐసీసీ గట్టి షాక్ ఇచ్చింది. ఈ జట్టుకు పాయింట్లను తగ్గించింది. ఇప్పటికే పర్సంటేజీ తగ్గగా.. పాయింట్లలోనూ భారీగా కోత పడటంతో డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు మరింత సంక్లిష్టంగా మారాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఇంగ్లాండ్ ఏడో స్థానంలో ఉంది. ఆదివారం న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో ఇంగ్లాండ్ ఓడిపోయింది. దీంతో డబ్ల్యూటీసీ పట్టికలో ఈ జట్టు పర్సంటేజీ 34.72 నుంచి 26.38 శాతానికి పడిపోయింది. రెండో టెస్టు మ్యాచ్‌కు ముందు ఇంగ్లాండ్ ఖాతాలో 50 పాయింట్లు ఉన్నాయి. కానీ, ఈ టెస్టులో ఏకంగా 12 ఓవర్లను ఆలస్యంగా వేయడంతో 12 పాయింట్లను కోల్పోవాల్సి వచ్చింది. దీంతో పాయింట్ల సంఖ్య 50 నుంచి 38కి తగ్గింది. కెప్టెన్‌గా వ్యవహరించిన జో రూట్‌తోపాటు సహచరులందరికీ మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానాగా పడింది.




స్వదేశంలో సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో ఉన్న ఇంగ్లాండ్‌కు ఓ గుడ్‌న్యూస్. బాక్సర్‌తో గొడవ కారణంగా రెండో టెస్టు ఆడలేకపోయిన కెప్టెన్ బెన్ స్టోక్స్ మళ్లీ జట్టులోకి వచ్చాడు. కివీస్‌తో మూడో టెస్టు కోసం ప్రకటించిన స్క్వాడ్‌లో అతడికి చోటు దక్కింది. కెప్టెన్ రాకతో తుది జట్టులో ఎవరిని పక్కన పెడతారో చూడాలి. జూన్ 25 నుంచి నాటింగ్‌హామ్ వేదికగా మూడో టెస్టు ప్రారంభం కానుంది.

# టార్గెట్ 2027 వన్డే ప్రపంచకప్.. రోడ్ మ్యాప్ సిద్ధం!




వన్డే ప్రపంచ కప్ 2027 టోర్నీకి నిర్దిష్టమైన ప్రణాళిక (రోడ్‌మ్యాప్)ను రూపొందించడం ప్రారంభమైందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. ప్రపంచ కప్ ముందు టీమ్ఇండియా తగినన్ని 50 ఓవర్ల క్రికెట్ మ్యాచులు ఆడేలా చూస్తామని తెలిపారు. ''వచ్చే ఏడాది అక్టోబర్‌లో టోర్నీ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ ఆడనుంది. జులై 14 నుంచి 19 వరకు ఆ సిరీస్ జరగనుంది. రాబోయే కాలంలో మరిన్ని మ్యాచులను నిర్వహించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. మ్యాచ్ ప్రాక్టీస్ వల్ల కప్పు గెలిచేందుకు అవకాశాలు మెరుగవుతాయని'' అని సైకియా పేర్కొన్నారు. ''కప్పు నెగ్గడమే టీమ్ఇండియా లక్ష్యం. అందుకోసం కట్టుదిట్టమైన ప్రణాళికలు రూపొందిస్తాం. రోడ్ మ్యాప్ తయారీలో హెడ్ కోచ్, చీఫ్ సెలక్టర్ నుంచి సహాయక సిబ్బందిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతారు. అంతర్జాతీయ స్థాయిలో అతిపెద్ద ఈవెంట్‌కు వెళ్లేటప్పుడు మంచి సన్నద్ధత అవసరం. ఆ విషయంలో టీమ్ఇండియాకు కావాల్సినవన్నీ చేసేందుకు బీసీసీఐ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుంది'' అని దేవజిత్ సైకియా వెల్లడించారు.

# అదంతా ముగిసిపోయింది: విరాట్ కోహ్లీ

టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ గతేడాది టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. కెప్టెన్‌గా భారత జట్టుకు అద్భుత విజయాలు అందించిన అతడు.. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్‌లో ఆడి అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పేస్తాడనే అంచనాలున్నాయి. అయితే, ఇప్పటికీ ఫిట్‌గా.. ఫామ్‌లో ఉన్న కోహ్లీ టెస్టుల్లో పునరాగమనం చేయాలని కోరుకొనేవారు లేకపోలేదు. తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న విరాట్ కోహ్లీకి ఇలాంటి ప్రశ్నే ఎదురైంది. దీనికి అతడు చాలా లౌక్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం. స్పోర్ట్స్ బ్రాండ్ వన్8 లాంచ్ ఈవెంట్‌కు విరాట్ కోహ్లీ హాజరయ్యాడు. ఈ బ్రాండ్‌లోని ఓ షూ ధర రూ. 9,230గా ఉంది. టెస్టుల్లో విరాట్ సాధించిన పరుగుల సంఖ్య కూడా అంతే. దానికి కోట్ చేస్తూ.. కార్యక్రమానికి హోస్ట్‌గా ఉన్న కమెడియన్ డానిష్ సైత్ ఓ ప్రశ్న సంధించాడు. ''మీరు ఇంకొన్ని పరుగులు చేసి.. ఆ వస్తువు లాభాలను పెంచొచ్చు కదా?'' అని విరాట్‌ను అడిగాడు. దీనికి కోహ్లీ బదులిస్తూ.. ''నేను తక్కువ ధరకే అమ్మేయడానికి ఇష్టపడతాను. ఇక మీరు అడుగుతున్న దానితో (టెస్టు క్రికెట్) నా పని అయిపోయింది. ధన్యవాదాలు'' అని చెప్పాడు. దీంతో విరాట్ మళ్లీ టెస్టుల్లోకి పునరాగమనం చేసే అవకాశాలు లేవని స్పష్టమైందని క్రికెట్ వర్గాలు తెలిపాయి.



# వుదయం సినిమా

MOVIE TIME!

## ఘనంగా టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స

**వుదయం సినిమా** "టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స 2026" ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జ్యూరీ ఛైర్ పర్సన్ ఇంద్రజ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎంట్రీలు పరిశీలిస్తుంటే కొత్త వారిలో ఎంత టాలెంట్ ఉందో చూసి ఆశ్చర్యపోయామని ఈ సందర్భంగా డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు. ఈ యంగ్ టాలెంట్ కు ఇండస్ట్రీలో అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తామని ఆయన చెప్పారు. ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, వచ్చే ఏడాది నుంచి మొదటి బహుమతి లక్ష రూపాయలు అందిస్తామని డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు.



# జూన్ 25న #NBK112 అమరావతిలో గ్రాండ్ లాంచ్




**వుదయం:** గాడ్ అఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సెన్సేషనల్ డైరెక్టర్ కొరటాల శివ, సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని, SLV సినిమాస్, యువసుధ ఆర్ట్స #NBK112 అమరావతిలో జూన్ 25న గ్రాండ్ లాంచ్ – ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్గాడ్ అఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంచలన దర్శకుడు కొరటాల శివ తొలిసారిగా #NBK112 చిత్రం కోసం జతకడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అభిమానులు, సినీ వర్గాల్లో భారీ అంచనాలు పెంచింది. "Power Meets Purpose, Mass Becomes A Movement" అనే పవర్ ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన అనౌన్స్‌మెంట్ పోస్టర్, ఈ చిత్రం ఎంత భారీ స్థాయిలో ఉండబోతుందో సూచించింది. ఇద్దరు విజయవంతమైన నిర్మాతలు SLV సినిమాస్ సుధాకర్ చెరుకూరి, యువసుధ ఆర్ట్స సుధాకర్ మిక్కిలినేని ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు.ఈ ప్రాజెక్ట్‌పై ఉన్న అంచనాలను మరింత పెంచుతూ, అమరావతి సమీపంలోని వెంకటాయపాలెంలో ఉన్న TTD ఆలయంలో జూన్ 25న గ్రాండ్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానుండటంతో ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుంది.

# "జీవించేశారు అన్నయ్యా!" చిరు నటనకు ఫిదా

**వుదయం సినిమా:** 'వాల్తేరు వీరయ్య' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం (ChiruBobby2) షూటింగ్ శరవేగంగా దూసుకుపోతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ 'కేవీఎన్ ప్రొడక్షన్స్' పతాకంపై నిర్మాత వెంకట్ కె. నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో, ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



ఇప్పటికే పొల్లాచ్చిలో హైవోల్టేజ్ యాక్షన్ సీక్వెన్సులు, ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో కూడిన తొలి షెడ్యూల్‌ను చిత్ర బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ షెడ్యూల్ ముగింపును పురస్కరించుకుని విడుదల చేసిన ప్రత్యేక 'బిహైండ్‌దిసీన్స్' (BTS) వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో మెగాస్టార్ చిరంజీవి అత్యంత హుందాగా, పవర్‌ఫుల్ అండ్ హైఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తూ అభిమానుల్లో అంచనాలను అంబరానికి తీసుకెళ్లారు. ఈ షెడ్యూల్‌లో యువ కథానాయికలు అనస్వర రాజన్, నివేదా పేతురాజ్ కూడా పాల్గొన్నట్లు వీడియో ద్వారా స్పష్టమైంది.



"జీవించేశారు అన్నయ్యా!" : సెట్స్‌లో దర్శకుడి భావోద్వేగం

ఈ బీటీఎస్ వీడియోలో ఒక ఆసక్తికరమైన సంఘటన హైలైట్‌గా నిలిచింది. ఓ కీలక సన్నివేశంలో చిరంజీవి నటనకు ముగ్ధుడైన దర్శకుడు బాబీ కొల్లి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. మెగాస్టార్ పర్ఫార్మెన్స్ చూసి ఉద్వేగాన్ని ఆపుకోలేక.. "జీవించేశారు అన్నయ్యా!" అంటూ ప్రశంసించడం చిత్ర యూనిట్‌ను విశేషంగా ఆకట్టుకుంది. చిరంజీవిని ఇంతకు ముందెన్నడూ చూడని రీతిలో, సరికొత్త కోణంలో బాబీ ఈ చిత్రంలో ఆవిష్కరిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

హైదరాబాద్‌లో నేటి నుంచే కొత్త షెడ్యూల్

పొల్లాచ్చి షెడ్యూల్ ముగించుకున్న చిత్రబృందం, నేడు (సోమవారం) హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించింది. ఈ సరికొత్త షెడ్యూల్‌లో కథకు వెన్నెముకగా నిలిచే కీలకమైన టాకీ భాగాలతో పాటు, కొన్ని ప్రధాన యాక్షన్ ఘట్టాలను కూడా చిత్రీకరించనున్నట్లు సమాచారం.

టాప్ టెక్నికల్ టీమ్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి స్టార్ కంపోజర్ ఎస్. థమన్ సంగీతాన్ని అందిస్తుండగా, విజయ్ కార్తిక్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్‌ను, ఆంటోని ఎల్. రూబెన్ ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందిస్తున్న ఈ చిత్రానికి హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి అదనపు స్క్రీన్‌ప్లేను, భాను-నందు ద్వయం మాటలను సమకూరుస్తున్నారు.

# 'లవ్ వైరస్–2' సాంగ్ ఆవిష్కరణ





**వుదయం:** జర్నలిస్ట్ ఎస్.డి. నుమన్ దర్శకత్వంలో రూపొందిన 'లవ్ వైరస్' షార్ట్ ఫిలిం విడుదలైన కొద్ది కాలంలోనే విశేష ప్రజాదరణ పొందిన విషయం తెలిసిందే. యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన ఈ షార్ట్ ఫిలిం సోషల్ మీడియాలో మంచి స్పందనను సాధించడంతో, అదే ఉత్సాహంతో 'లవ్ వైరస్–2' ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర యూనిట్ సిద్ధమైంది.స్వయం కృషి క్రియేషన్స్ బ్యానర్‌పై జర్నలిస్ట్ ఎస్.డి. నుమన్ దర్శకత్వంలో, అరమాస ప్రవీణ్ నిర్మాతగా రూపొందుతున్న 'లవ్ వైరస్–2' షార్ట్ ఫిలిం సాంగ్‌ను ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఆదివారం రాయదుర్గంలోని తన నివాసంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వి.వి. వినాయక్ మాట్లాడుతూ, కేవలం 36 గంటల్లో 40 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిలిం రూపొందించడం నిజంగా అభినందనీయమని అన్నారు. 'లవ్ వైరస్' తొలి భాగానికి సోషల్ మీడియాలో లభించిన విశేష ఆదరణే రెండో భాగం నిర్మాణానికి ప్రేరణగా నిలిచిందని పేర్కొన్నారు. కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ ముందుకు వస్తున్న నిర్మాత అరమాస ప్రవీణ్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. దర్శకుడు ఎస్.డి. నుమన్ మాట్లాడుతూ, మొదటి భాగానికి ప్రేక్షకులు అందించిన ఆదరణతో మరింత బాధ్యతగా 'లవ్ వైరస్–2' ను రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా ఈ చిత్రం ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు భాను ప్రకాష్, గణపతి, శ్యామ్, డి.ఓ.పీ. హరీష్, శ్రీహర్ష, గ్రాఫిక్ డిజైనర్ ఉదయ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. 'లవ్ వైరస్–2' కూడా తొలి భాగం మాదిరిగానే ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకాన్ని చిత్ర బృందం వ్యక్తం చేసింది.

# ఘనంగా "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" మూవీ సక్సెస్ మీట్



**వుదయం సినిమా:** మాజిక ఇతివృత్తాల నేపథ్యంలో చిత్రాలను రూపొందించే దర్శకుడు పి సునీల్ కుమార్ రెడ్డి శ్రావ్య ఫిల్మ్స బ్యానర్ పై సుభాష్ చక్రవర్తి రవడ సహ నిర్మాతగా గే, ట్రాన్స్జెండర్ వ్యక్తుల జీవితాల మీద తీసిన కోర్ట్ రూమ్ డ్రామా "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్". ఈ చిత్రంలో ఎల్ బి శ్రీరామ్, ఎస్తర్ నార్రోన్హ, రాజు ఖేర్, ఆనంద చక్రపాణి , ప్రీతీ నిగమ్ తో పాటు రియల్ ట్రాన్స్జెండర్ యాక్టర్స్ ప్రధాన పాత్రలు పోషించారు. హిమ రాథోడ్ హీరోయిన్ గా చంద్రముఖి , లైలా వంటి ప్రముఖ యాక్టివిస్టులు , గే యాక్టివిస్ట్ విష్ణు తేజ చాలా పరిణితితో నటించారు. "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" సినిమా ఈ నెల 19న దేశవ్యాప్తంగా విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గే, ట్రాన్స్ జెండర్స్ కు అండగా నిలుస్తున్న పలు సేవా సంస్థల నిర్వాహకులను సత్కరించారు. ఈ సందర్భంగా నటుడు ఆనంద చక్రపాణి మాట్లాడుతూ ఎన్నో రకాల సినిమాలు వస్తుంటాయి కానీ ఇలాంటి కథతో సినిమా చేయాలంటే ధైర్యం ఉండాలి. మనం చాలా సమస్యల్ని మనకెందుకు అని చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటాం. ప్రశ్నించాలని అనుకోం. కానీ దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి గారు సినిమా అనే బలమైన మాధ్యమం ద్వారా సొసైటీలో ఉన్న ఈ రుగ్మత గురించి ఆలోచింపజేసేలా సినిమా రూపొందించారు. ఈ సినిమా చూస్తుంటే చాలా సన్నివేశాల్లో కన్నీళ్లు వచ్చాయి. ఇలాంటి మంచి ప్రయత్నాన్ని ప్రేక్షకులు మరింతగా ఆదరించాలి. అన్నారు. గే కమ్యూనిస్ట్ యాక్టివిస్ట్ విష్ణు మాట్లాడుతూ మా సినిమా ప్రదర్శితమవుతున్న థియేటర్స్ లో హౌస్ ఫుల్స్ బోర్డ్స్ చూడటం సంతోషంగా ఉంది. సునీల్ కుమార్ రెడ్డిగారు ఒక మంచి విషయాన్ని ప్రేక్షకులకు, సొసైటీకి చెప్పాలని అనుకున్న ఉద్దేశం నెరవేరిందని అనిపిస్తోంది. కాలేజ్ స్టూడెంట్స్, టీచర్స్, పలు ఆర్గనైజేషన్స్ వాళ్లు మా మూవీ చూస్తున్నారు. సినిమా చూశాక వారిలో మా లాంటి వాళ్ల పట్ల ఒక కొత్త పర్సెప్షన్ కనిపిస్తోంది. ఇలాంటి మార్పు రావాలనే సునీల్ కుమార్ రెడ్డిగారు "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" సినిమా రూపొందించారు. అన్నారు. తెలంగాణ స్టేట్ ట్రాన్స్ జెండర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లైలా మాట్లాడుతూ "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్ చెబుతున్నాం. నేను ఈ సినిమాలో భాగమవడం సంతోషంగా ఉంది. నాకు ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన సునీల్ కుమార్ రెడ్డి గారికి కృతజ్ఞతలు. మా సమస్యల్ని చెప్పే ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలి. అప్పుడే సమాజంలో మరికొంత మార్పు అనేది మొదలవుతుంది. ఈ సినిమా చూడని వారు తప్పకుండా చూడండి.

# 'ది రెడ్ బ్యాగ్' టీజర్ అద్భుతంగా ఉంది..



**వుదయం:** మెమరీ మేకర్స్ బ్యానర్ మీద హరికృష్ణ సోమిశెట్టి నిర్మాణంలో రవి కుమార్ సీరపు తెరకెక్కించిన చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. ఈ సినిమాలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన ప్రతీ కంటెంట్ సినిమాపై ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. ఆదివారం నాడు 'ది రెడ్ బ్యాగ్' టీజర్‌ను ఏపీ ఇండస్ట్రీస్, కామర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ మినిస్టర్ టీజీ భరత్ రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంఛ్ ఈవెంట్‌లో..మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ .. ''ది రెడ్ బ్యాగ్' టీజర్ అద్భుతంగా ఉంది. మా కర్నూలు నుంచి వచ్చిన హరి గారు తీసిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి. మా రెడ్ బుక్ గురించి ఇండియా వ్యాప్తంగా తెలుసు. అలానే ఈ 'ది రెడ్ బ్యాగ్' మూవీ కూడా ఇండియా అంతా సౌండ్ చేయాలి. కర్నూలులోనే అత్యధిక భాగంగా షూటింగ్ చేశారు. కానీ ఫారిన్‌లో తీసినట్టుగా కనిపిస్తోంది. సినిమా టీంకి ఆల్ ది బెస్ట్. ఈ చిత్రం మంచి విజయం సాధించి మా హరికి డబ్బులు బాగా రావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.ప్రముఖ దర్శకుడు నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ .. ''ది రెడ్ బ్యాగ్' టీజర్ లాంచ్‌కు వచ్చిన టీజీ భరత్ గారికి ధన్యవాదాలు. ఇలాంటి వినూత్న చిత్రాలు తప్పకుండా విజయవంతం అవ్వాలి. హరి గారు ఈ చిత్రం హిట్ అయితే మరిన్ని కొత్త సినిమాల్ని నిర్మిస్తారు. 'ది రెడ్ బ్యాగ్' టీజర్ చూసి నేను షాక్ అయ్యాను. నెక్ట్స్ లెవెల్లో సినిమా ఉండబోతోందని అర్థమైంది. ఈ చిత్రం కచ్చితంగా విజయం అవుతుందనే నమ్మకం ఏర్పడింది. ఇదొక ట్రెండ్ సెట్టర్‌గా నిలవాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.దర్శకుడు రవి కుమార్ సీరపు మాట్లాడుతూ .. ''ది రైడ్ బ్యాగ్' చిత్రం లైఫ్ టైం ఇంపాక్ట్ చూపిస్తుంది. ఈ మూవీ చూసిన తరువాత మీరు ఎక్కడ రెడ్ బ్యాగ్‌ని చూసినా మా 'ది రెడ్ బ్యాగ్' సినిమా గుర్తుకు వస్తుంది. నా పదహారేళ్ల నిరీక్షణ తరువాత ఈ అవకాశం వచ్చింది.

# జూలై 17న 'రాజా ది రాజా'

**వుదయం:** యూత్‌ఫుల్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన 'రాజా ది రాజా' చిత్రం మూవీ లవర్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కె. శ్రీలతా రెడ్డి సమర్పిస్తున్నారు.తాజాగా చిత్ర బృందం ఈ సినిమాను జూలై 17న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ముందుకు రావడం విశేషం. దీంతో సినిమా మరింత గ్రాండ్ గా ప్రేక్షకులను చేరుకునే అవకాశం లభించనుంది.



# హృదయాలను హత్తుకునేలా 'ఓ..! సుకుమారి'

**వుదయం సినిమా:** వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న యంగ్ హీరో తిరువీర్, స్టార్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తొలిసారిగా జంటగా నటిస్తున్న గ్రామీణ నేపథ్య రొమాంటిక్ కామెడీ చిత్రం 'ఓ..! సుకుమారి'. ఈ సినిమా ద్వారా భరత్ దర్శన్ దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతున్నారు. ఇటీవల విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'శివం భజే' చిత్రాన్ని నిర్మించిన ప్రముఖ నిర్మాణ సంస్థ 'గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్' పతాకంపై నిర్మాత మహేశ్వర రెడ్డి మూలి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది.

**ప్రేమలో ముంచెత్తుతున్న 'ఓ..! సుకుమారి' టైటిల్ సాంగ్**

తాజాగా చిత్ర బృందం ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌ను గ్రాండ్‌గా ప్రారంభించింది. అందులో భాగంగా చిత్రంలోని లీడ్ మెలోడీ ట్రాక్ అయిన 'ఓ..! సుకుమారి' టైటిల్ సాంగ్‌ను విడుదల చేసింది. ఒక స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన ప్రేమగీతంగా సాగే ఈ పాట సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. భరత్ మంచిరాజు స్వరపరిచిన ఈ మెలోడీ ట్యూన్ హృదయాన్ని హత్తుకునేలా ఉండి, ప్రేమలోని తియ్యదనాన్ని ఎంతో అందంగా ఆవిష్కరించింది. గాయకుడు అభిజిత్ రావు తన సోల్ ఫుల్ వోకల్స్‌తో ఈ పాటకు ప్రాణం పోయగా, ప్రముఖ గేయ రచయిత పూర్ణాచారి అందించిన సాహిత్యం ప్రేమలో పడిన ఒక పల్లెటూరి యువకుడి ఆరాటాన్ని, అంతరంగాన్ని అద్భుతంగా ప్రతిబింబించింది.



**ఆకట్టుకుంటున్న తిరువీర్, ఐశ్వర్య రాజేష్ కెమిస్ట్రీ**

విజువల్ పరంగా కూడా ఈ పాట ఎంతో రిఫ్రెషింగ్‌గా సాగింది. పల్లెటూరి వాతావరణంలో తిరువీర్ తన ప్రేమను ఎంతో అమాయకంగా, నిజాయితీగా వ్యక్తపరుస్తుండగా.. ఐశ్వర్య రాజేష్ ఆ ప్రేమను ఆస్వాదిస్తూ మురిసిపోయే హావభావాలు విజువల్స్‌కు మరింత అందాన్ని తెచ్చాయి. వినగానే మళ్లీ మళ్లీ వినాలనిపించేలా ఉన్న ఈ మెలోడీ సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. కాగా, ఎంతో క్రేజ్ సంపాదించుకున్న ఈ గ్రామీణ ప్రేమకథా చిత్రం తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.